భీమన్న
ఉగాదులు

(ఉగాది కవితల సంపుటి)

మహాకవి

బోయి భీమన్న

సాహితీ షష్టిపూర్తి ప్రచురణ

ప్రథమ ముద్రణ
1983

ముద్రణ
పద్మావతీ ఆర్ట్ ప్రింటర్స్
హైదర్‌గూడ, హైదరాబాద్-1

వెల
18-00

ప్రతులకు

1. ఆంధ్ర సారస్వత పరిషత్తు
తిలక్‌రోడ్, హైదరాబాద్-500001

2. సుశీలా నికేతన్
ఐ. సి. 8ఎ, ఇరంమంజిల్ కాలనీ
హైదరాబాద్-500004.

ఇందులో....

వసంత వేదిక

నేను కవిగా గొంతు విప్పినప్పటినుంచి, కవిగా కలం పట్టినప్పటినుంచి, కవిగా వెల్లడైనప్పటి నుంచి, ఇంతవరకూ వందలకొలది వసంత కవితలు, డజన్లకొలది ఉగాది కవితలు వ్రాసి ఉంటాను. వసంతరుతువు ప్రారంభమూ, తెలుగు సంవత్సరారంభమూ ఒకటే తెలుగువాళ్లకు.

తెలుగు సంవత్సరాదిని ఉగాది అని కూడా అంటారు. నా చిన్నప్పుడూ, మా ప్రాంతంలోనూ సంవత్సరాది అనేదే వ్యవహారం. నేను కాలేజీకి వెళ్లేవరకూ ఉగాది అనే మాటను నేను వాడలేదు.

మొత్తం మీద నా వసంత కవిత లన్నీ ఉగాది కవితలే. ప్రత్యేకంగా ఉగాది అని పేరు పెట్టి వ్రాసిన కవితలు మాత్రమే డజన్ల కొలదీ వుంటాయి. అవి ఎక్కడెక్కడో వుంటాయి. నా సాహిత్యోద్యానంలో వెతికితే అక్కడక్కడ దొరుకుతాయి.

అయితే ఆమధ్య నాకొక చిత్రమైన భావం తట్టింది— నా ఉగాది కవిత లన్నీ కలిపి ఒక సంపుటిగా వేస్తే బాగుండదా అని. ఉగాదు లన్నీ ఇంచుమించు ఒకే రూపంలో వుంటాయి. కనుక, ఉగాది కవితలలో కూడ సారూప్యత ఎక్కువ వుంటుంది. కనుక అవన్నీ కలిపి ఒకచోట చేరిస్తే, వైవిధ్య లోపంవల్ల బోరు కొడతా యేమో కదా!

పైకి ఒకేలా కనిపించినా, సూక్ష్మ పరిశీలనకు దేని వ్యక్తిత్వం దాని కుంటుంది. సరసులకు, సహృదయులకు, సాహితీప్రియులకు, విద్వాంసులకు అందులోని వైవిధ్యం అర్థమవుతుంది కనుక బోరు కొట్టడమనే ప్రమాదం వుండదు. దేని వ్యక్తిత్వం దానిది. ఒకేలా కనిపించే కవలలకు సహితం ఎవరి బ్రతుకు వారిదే కదా!

అందువల్ల నా ఉగాది కవిత లన్నిటినీ చేర్చి ఒక సంపుటిగా ప్రకటించా లన్న నిర్ణయానికే వచ్చాను. అలా ఒక నిర్ణయానికొచ్చాక, వెదికి చూస్తే కొన్ని మాత్రమే దొరికాయి. అందులోనూ కొన్నిటికి సంవత్సరాల పేర్లున్నాయి. కొన్నిటికి లేవు. సంవత్సరాల పేర్లతో ఉగాది కవితలుగా వున్నవాటిని తరచూ ఎవరికోరిక మేరకో ప్రత్యేకంగా వ్రాసి వుంటాను- పత్రికలకో, కవి సమ్మేళనలకో, ఆకాశవాణికో. అటువంటి సందర్భాలకోసం వ్రాసిన వాటి కాపీలు సాధారణంగా నా దగ్గర వుండవు. నాకు నేను వ్రాసుకొనే కవితలు తప్ప, మరేదో ప్రత్యేక ప్రయోజనాన్ని ఆశించి వ్రాసిన కవితలను నేను శ్రద్ధగా భద్ర పరచుకొనే అలవాటు నాకు లేదు.

ప్రక్రియ పరంగా చూస్తే నా కవిత నాలుగు విధాలు. పద్యం, గేయం, వచనం, వచన(గద్య)కవిత. ఈ నాలుగు ప్రక్రియలలోనూ నా ఉగాదు లున్నాయి.

కాలం నిత్య సంతోషి. నిరంతర పురోగామి. దానికి అన్ని ఋతువులూ సమానమే. దానికి ఏ అవస్థా లేదు. మన అవస్థలను దానికి ఆపాదిస్తాం. ఎండ, వాన, శీత కాలాలను మన యౌవన, ప్రౌఢ, వృద్ధాప్య అవస్థలతో పోల్చు కొంటాం. మన సుఖదుఃఖాలనే ప్రకృతిలో ప్రతిబింబాలుగా దర్శించుకొంటాం. అంతే.

మన భూగోళం మీద కాలానికి ప్రత్యక్ష కర్తలు ఇద్దరు. సూర్యుడు, చంద్రుడు. ఈ ఇద్దరిలో సూర్యుడు సార్వభౌము డయితే, చంద్రుడు స్వతంత్రించిన సామంతరాజు. అనేక జాతుల ప్రజలు ద్రైరెక్టుగా సూర్యపాలన క్రిందే వుండగా మన తెలుగు, కన్నడ, వంగ, కాశ్మీర వంటి జాతులవాళ్లు చంద్రపాలనను అభిమానిస్తున్నారు. అందుకే వీళ్ళకాలం చంద్రుణ్ణి బట్టి వుంటున్నది. కొందరికి పూర్ణిమ నుంచి పూర్ణిమకు మాసమైతే, మరి కొందరికి అమావాస్య నుంచి అమావాస్యకు మాసం. మన తెలుగువాళ్ళ సంవత్సరారంభమాసం, అదే చైత్రమాసం, ఫాల్గుణ బహుళ అమావాస్య మరునాటి నుంచి మొదలవుతుంది. ఆ దినమే మన ఉగాది.

సూర్యచంద్రుల కాలగతులలో తేడా లుండటం వల్ల, చాంద్రమానాన్ని అనుసరిస్తున్న మనకు ఋతువుల ప్రకృతి ధర్మాలతో కొన్ని వైరుధ్యాలు

కనిపిస్తూవున్నై. నా దృష్టిలో వసంతోదయం ఫాల్గుణ పూర్ణిమ (కామ పూర్ణిమ, హోళీ) తోనే జరుగుతుంది. మన దేశం మొత్తం మీద వసంతారంభం అదే. వసంతాగమనంతో విజృంభించి వచ్చిన కాముణ్ణి శివుడు దహించిం దానాడే. దహించినా, రంగు రంగుల వసంతా లాటలు, వేడుకలు, యౌవనోత్సాహాల సంరంభాలు లోకానికి తప్పలేదు. కాముడు చావనూ లేదు. పైగా, విశ్వరూపం ధరించాడు !

మన కాలమానంలోని ప్రభవ విభవాది అరవై సంవత్సరాల పేర్లతోనూ అరవై ఉగాదులూ వుంటాయి. ఈ నా సంపుటిలో అన్నీ చేరలేదు. చేర్చబడ్డ ఉగాదులకు రకరకాల శీర్షికలు పెట్టాను. ఇవి కూడ ఒక వరుస క్రమంలో వుండక పోవచ్చు. దేనికదే స్వతంత్ర సమగ్ర కవిత అనే సత్యం సహృదయులకు తెలుసు.

నేను కవిగా కళ్లు తెరిచి చూచిన ఉగాది బహుశా దుందుభి (1922). అంతకుముందు పదేళ్ళ క్రితం నేను విరోధికృత్ (1911 సెప్టెంబరు) లో పుట్టాను. నేను పుట్టిన తరవాత వచ్చిన మొదటి ఉగాది పరీధావి. నా 11 వ ఏట దుందుభి ఉగాది నుంచి నా కవితా ప్రస్థానం ప్రారంభమయిందనుకొంటే, మళ్లీ మొన్న దుందుభి ఉగాది 1982 ఏప్రిల్‌లో వచ్చి, నాచేత కవిత వ్రాయించుకొంది. అంటే ఆ ఉగాదితో ఉగాది కవితా షష్టిపూర్తి కూడా అయిందన్నమాట. 1983 ఏప్రెల్ 14 న వచ్చిన రుధిరోద్గారి ఉగాదిని కూడ ఇందులో చేర్చగల్గడం నా అదృష్టం.

ఇదొక తమాషా సంపుటి, నా ఇంటి తోట, నేను ఆనందించే పరమ వసంతం, నేను ఆరాధించే మహా సరస్వతి. మీకూ హృదయోల్లాసకం కాగల్గితే ధన్యుణ్ణనుకొంటాను.

కొన్ని వివరణలు

ఈ ఉగాదులు వరుసక్రమంలో లేవు. లేకపోయినా పరవాలేదు——దేనికదే స్వతంత్ర కవిత కనుక. ఇందులో నా అన్ని ఉగాది కవితలూ లేవు. న్యాయంగా

చూడా లంటే ఇందులో 52 ఉగాది కవిత లుండాలి, 1922 నాటి దుందుభి ఉగాది నుంచీ కవిత వ్రాయడం ప్రారంభించా ననుకొంటే, నేను ఆనాటి నుంచీ కవిత వ్రాస్తూనే వున్నవాణ్ని కనుక అన్ని ఉగాదులూ ఇందులో వున్నట్టే భావించ వలసిఉంది. నిరంతర పరిణామ శీలమైన సృష్టిలో ప్రతిక్షణమూ ఒక ఉగాదే నా దృష్టిలో.

ఉగాది అనగానే వేపపువ్వు, మామిడిపిందెలు, కొత్తచెరకు మొదలైన వన్నీ వుంటాయి. మనకు ఉగాదే వసంతారంభం కనుక వసంత రమణీయత లన్నీ వుంటై. ఇవన్నీ అన్ని ఉగాదులకీ సమానమే. నా ఉగాదులలో ఈ వర్ణ నలు కాక, దేశకాల పాత్రలకు సంబంధించిన సమస్యలూ, విమర్శలూ, పరిష్కార సూచనలూ కనిపిస్తూ వుంటై. వాటిని సహృదయులు గుర్తించ గలరు.

ఉదాహరణకు—— బాంగ్లా యుద్ధ విజయం తరువాత కొద్ది సంవత్సరాల పాటు మన దేశంలో ఎమర్జెన్సీ విధించబడింది. ఆ కాలంలో కొన్ని ఉగాదు లొచ్చాయి. అప్పటి పరిస్థితుల కనుగుణంగా ఆయా ఉగాది కవిత లుంటై. ఏదైనా ఒక సంఘటన మంచిదా, చెడ్డదా అనేది ప్రధానం కాదు. ఏదీ పూర్తిగా మంచిదిగానూ వుండదు, చెడ్డదిగానూ వుండదు. కొందరికి మంచిదైతే, మరి కొందరికి చెడ్డది అవుతుంది ఏదైనా. మనం ప్రధానంగా చూడ వలసింది అట్టి సంఘటన చరిత్రలో ఒక భాగమా కాదా అనేది. ఎమర్జెన్సీ చరిత్రలో ఒక భాగమే. అందుకే ఆ కాలంలోని ఉగాదులకు అందుకు తగిన గుణాను భూతులు వుంటై.

మన దేశాన్ని కులమతాతీత శ్రేయో జాతిగా రూపొందించా లంటే సర్వ జనీన సమాదర్శం కల ఎమర్జన్సీ లాంటి పరిపాలనే తగి వుంటుందని నా విశ్వాసం.

ఎమర్జెన్సీని బడుగువర్గాల అభివృద్ధికి, దుష్ట శిక్షణ శిష్ట రక్షణకు ఒక అవశ్య కర్తవ్యంగా భావించాను. భగవంతుడి అవతారాలన్నీ ఇలాంటివే కదా ! దుష్ట విజృంభణలతో లోకం తల్లడిల్లిపోతున్నప్పుడు భగవంతుడు సందర్భానికి తగిన ఏదో ఒక అవతారం ఎత్తేవాడు. దుష్ట సంహారం చేసి, లోక సంక్షోభాన్ని మాన్పేవాడు. ముప్ఫై ఏళ్ల స్వరాజ్యపాలనలో కూడ

ధనికవర్గ దోపిడీ తగ్గకపోతే, పేదవర్గాలకు అభ్యుదయం కలగకపోతే, పరిస్థితిని అదుపు చెయ్యడానికి ఎమర్జెన్సీని విధించడం కంటె గత్యంతరం ఏముంది ? ఈ ఆలోచనా ధోరణితో ఆనాటి నా ఉగాది కవితలు నడిచినై. నేను వూహించి నట్లు జరిగిందా, లేదా అంటే. అది వేరే విషయం. ఊహించడం వరకే కవి చేయగల పని. దాని అమలు విజ్ఞతగల రాజకీయ పార్టీల చేతిలో వుంది.

సిసలుగా, స్వేచ్ఛగా వూహించగల అవకాశాలు కవికి లభింప చెయ్యాలి. కవి వూహలను ప్రజాభ్యుదయం కోసం ప్రభుత్వాలు వాడుకోవాలి. ఇదీ నా సిద్ధాంతం.

అలాగే డాక్టరు చెన్నారెడ్డిగారు ముఖ్యమంత్రిగా వుండగా ఉగాది ఉత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. అప్పటి నా ఉగాది కవితలు అందుకు సంబంధించి వుంటై. మొత్తం మీద నా ఉగాదులు ప్రకృతి ధర్మాలనే కాక కాలవైపరీత్యాలనూ, దేశ పరిస్థితులనూ, అధినాయక ప్రభావాలను కూడ ప్రతిబింబిస్తూ చారిత్రకమైనట్టివిగా కూడ వుంటై. ఈ సత్యాన్ని సహితం సహృదయులు గమనించగలరు.

కవిత్వ పోషణ బాధ్యత

లతా, వనితా, కవితా ఇవి ఏదో ఒక ప్రాపు, ఆశ్రయం లేకుండా రాణించవు. ఇది సార్వకాలిక సత్యం.

వివిధ లలితకళలూ, సాహిత్యమూ, శాస్త్ర విజ్ఞానమూ మొదలైన మానసిక కృషికి సంబంధించిన అంశాలన్నిటినీ సౌలభ్యంకోసం ఇక్కడ కవిత కిందనే పేర్కొంటున్నాను. కవిత్వమూ, సంగీత నృత్య నాటక చిత్రలేఖనాది లలితకళలూ, గణిత వైద్యాది శాస్త్ర విజ్ఞానమూ— ఇటువంటి వన్నీ కూడా ఆలోచన ప్రధానమైనట్టివి. సృజనాత్మకమైనట్టివి. లౌకిక, భౌతిక విషయాలవలె కాక ఈ మానసిక విషయాలకు ధ్యానం, ఏకాగ్రత, తపస్సూ తప్పనిసరి. అందుకే వీటన్నిటినీ యోచనా ప్రధానమైన కవిత కిందకు చేర్చి పేర్కొంటున్నాను.

వేదకాలం నుంచీ కూడ కవిత రాజాశ్రయంలోనే పెరిగింది. ప్రకృతి రహస్యాలను పట్టి పైకి తీయవలసిన కవి, అభ్యుదయం కోసం వాటిని ప్రజలకు అందించవలసిన కవి నిరంతరం ధ్యానంలో, మననంలో సమాధిగతుడై కూర్చో వలసి వుంది. ఏకాగ్రత చెదరకూడని పరిస్థితి.

మరి, అట్టి తపస్వికి తిండి లభించడ మెలా ? మరెవరో సమకూర్చి పెట్ట వలసి వుంది కదా! వేదరుషులు అరణ్యాలలో ఆశ్రమాలు కట్టుకొని, కంద మూలఫలాదులతో బ్రతికేవారు. వాటిని శిష్యులు సేకరించి తెచ్చేవారు. రాజులు ఆశ్రమ రక్షణ చేసేవారు. అవసరాలు తీరుస్తూ వుండేవారు. అందుకే, ఆనాడు రుషులకు తిండి సంపాదన బెంగ లేనందువల్లనే, అంతలేసి మౌలిక సాహిత్యాలూ, విజ్ఞాన రహస్యాలూ వెలుగు చూడగలిగాయి. వేదాలు, ఉపనిషత్తులు, సంగీతం, నాట్యం, ఆయుర్వేదం, ధనుర్వేదం, గణితం మొదలైన వన్నీ ఒక్క తపస్సు తప్ప మరే బెంగా, ఏ బాధా, ఏ భయమూ లేని రుషుల వల్లనే పుట్టి పెంపొందడం జరిగింది.

కావ్య ప్రబంధ యుగాలలో కూడా కవిత రాజాశ్రయంలోనే పెరిగింది. రాజ్యరక్షణ, పరిపాలన, వాణిజ్యం, వ్యవసాయం, పరిశ్రమలు మొదలైన భౌతిక విషయాలలో అధిక సంఖ్యాకులైన ప్రజలు నిమగ్నులై వుంటారు. ధ్యాన పరమైన ఆధ్యాత్మిక విషయం ఒక్కటీ ఏ కొద్దిమంది మేధావులనో వరించి వుంటుంది. అట్టి కొద్ది మంది మేధావుల కృషి ఫలితమైన ఆధ్యాత్మిక, వైజ్ఞానిక సంపద మొత్తం జాతికంతకూ ఉపయోగపడుతున్నప్పుడు, మొత్తం జాతి ఉత్పత్తి చేస్తున్న భౌతిక సంపద మేధావికి ఎందుకు ఉపయోగించబడదు?

కవిది ఆధ్యాత్మిక కృషి. వైజ్ఞానిక పరిశోధన. అతని కృషి ఫలితం జాతి సంస్కారాన్నీ, సంస్కృతినీ, ప్రగతినీ, నైతిక స్థాయినీ పెంచుతుంది. ఆనందా న్నిస్తుంది. అట్టివాడికి తిండి పెట్టవలసిన బాధ్యత జాతికి లేదా? ప్రతివ్యక్తి ఏదో ఒక పనిలో నిపుణుడై వుంటాడు. అందరి పనుల ఫలితాన్నీ ఉమ్మడిగా అనుభ వించవలసి వుంది. గాంధీజీ ధర్మకర్తృత్వ సిద్ధాంతంలోని ఉద్దేశ మిదే కదా?

ఆనాడు రాజులు పోషించిన కవిత్వాన్నీ, కళలనూ ఈనాడు ప్రజా ప్రభుత్వాలు పోషించవలసి వుంది. ఆనాడు రాజుల డబ్బు ప్రజల నుంచి

వచ్చిందే. ఈనాడు ప్రభుత్వాల డబ్బూ ప్రజలనుంచి వస్తున్నదే. తేడా ఏమీ లేదు. కవిత్వమూ, కళలూ తమ ఆరాధన తప్ప మరొక వ్యాపారాన్ని చెయ్య నివ్వవు. కవి ధన సంపాదన కోసం రాజకీయమూ, వ్యాపారమూ నడిపితే కవిత్వం పోతుంది. ఆనాడూ, ఈనాడూ, ఏనాడూ కూడా ఇది పరమ సత్యం. అందుకే ధనవంతులు, ప్రధానంగా ప్రభుత్వం కవులను, కళాకారులను పోషించక తప్పదు. ఈనాటి ప్రజాస్వామికంలో ప్రజల కష్టార్జితం చాలవరకు రాజకీయ నాయకుల చేతుల్లో వుంటున్నది. ధనం మీద పెత్తనం వాళ్లదే. భోగభాగ్యాలు, గౌరవ సన్మానాలు, లావుపాటి దండలు, ఖరువైన పర్సులు, ట్రస్టులు, స్మారక చిహ్నాలు, నిలువెత్తు విగ్రహాలు, అన్నీ వాళ్లకే ప్రత్యేక హక్కులుగా వుంటున్నై. జాతి నైతిక జీవనస్థాయిని ఉన్నతంగా నిలపవలసిన బాధ్యత మాత్రం కవులది! వీళ్లకు జాతి సంపదపైన ఏ హక్కూ లేదు.

ఈ దుర్మార్గం మారకుండా ఈ జాతి ఆదర్శమార్గంలో ఎలా పురోగమించ గలుగుతుంది?

అంకితాలు-చరిత్ర

రాజుల కాలంలో కవులు తమ కావ్యాలను రాజులకు అంకిత మిచ్చేవారు. అందులో ఆయా రాజుల వంశాలనూ, విజయాలనూ వర్ణించేవారు. అది ఒక మాదిరిగా ఆయా రాజుల సమకాలీన చరిత్ర వ్రాయడం లాంటిది. ఆ కాలంలో రాజుల చరిత్రే రాజ్యాల చరిత్ర, దేశచరిత్ర. అది కవులు తమ కావ్యాంకితాల ద్వారా చేసేవారు. తమ రచనల ద్వారా ప్రజా జీవితంలోని ఆధ్యాత్మిక రంగాన్ని సుసంపన్నం చేసే అట్టి కవుల బ్రతుకు తెరువుకోసం ఆయా రాజులు శాశ్వతమైన ఏర్పాట్లే చేసేవారు - పెద్దపెద్ద మొత్తాలలో ధన కనక వస్తు వాహనాలను ఇవ్వడం ద్వారానూ, మాన్యాలనూ, అగ్రహారాలనూ బహూకరించడం ద్వారానూ. అటువంటి ఏర్పాట్లను ప్రభుత్వాలు కూడా చేయవలసి ఉంది. అగ్రహారాలు కాకపోతే, వాటికి నేటి ప్రత్యామ్నాయమైన ఏర్పాట్లు - ఎడతెగని ఆదాయం వచ్చే జీతభత్యాలు లాంటివి. లేకపోతే మానవుడు అభ్యుదయ స్వభావాన్ని పోగొట్టుకొని, కేవలం భోజన మాత్రోపజీవి యైన ఒక జంతువుగా దిగజారిపోయే ప్రమాదం ఉంది.

ఆ విధంగా ప్రారంభ మయింది మన అంకితాల చరిత్ర. మౌలికమైన ఏ రచన అయినా విశ్వ ప్రయోజక మైనట్టిదే. రచన చెయ్యడానికి, దానిని వెల్లడించడానికి, ప్రజలలో ప్రచారం చెయ్యడానికి ఆనాడు రాజులు తోడ్పడేవారు. అందుకే రాజాశ్రయం కావలసి వచ్చింది. అప్పుడు కూడా స్నేహాన్నీ, ప్రేమనూ ప్రకటించడానికి, అనుబంధాలను గట్టి పరచుకోడానికి అంకితా లిచ్చిపుచ్చు కొన్న సందర్భాలు లేకపోలేదు. అట్టి సందర్భాలు ఈనా డెక్కువగా కనపడు తున్నాయి.

పేదలైన కవులు తమ కావ్యాల ప్రకటనకోసం ధనవంతులైన మిత్రుల్నీ, శ్రేయోభిలాషుల్నీ ఆశ్రయించడం తప్పడంలేదు. ప్రజా ప్రభుత్వాలను నిర్వహిస్తున్నవాళ్లు ఎక్కువగా సంస్కార విహీనులుగా ఉండడంవల్ల, ధనాధికార మాత్రులుగా ఉండడం వల్ల సాహిత్య సాంస్కృతిక రంగాలలో ప్రభుత్వాలు తమ ధర్మాల్ని నిర్వహించడంలేదు. అందువల్లనే ప్రతిభావంతులైన కవులు తమ కృషిని ప్రజల కందివ్వడం కోసం భిక్షా పాత్ర పట్టవలసి వస్తున్నది. నా స్థితి కూడా సుమారుగా అలాంటిదే. అయితే, నా భిక్షా పాత్రలో వాగ్దానాలే తప్ప, పడ్డ పైసలు బహుకొద్ది.

అయితే, నేను ఇంతవరకూ మొత్తంమీద ముప్పది ఐదు కావ్యాల వరకూ స్వయంగా ప్రకటించగలిగా నంటే, ఎవరి సహాయమూ లేకుండా చెయ్యలేదు. అన్నీ కూడ మిత్రులకు అంకితా లివ్వ బడ్డట్టివే. అందరూ కూడ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నా సాహిత్య కృషికి, ప్రకటనకు కొంతలో కొంతైనా తోడ్పడిన వాళ్లే. అందుకు ఆ అందరికీ కూడ నేను ఎల్లప్పుడూ కృతజ్ఞుడ్ని.

నా కావ్యాంకిత ప్రణాళికలో, నేను తప్పకుండా ఏదో కావ్యాన్ని అంకితం ఇవ్వాలనుకొన్న పేర్లలో మాన్యులు దేవులపల్లి రామానుజరావుగారి పేరు ఒకటి. ఆయన నాకు చాలా ఆత్మీయులు. కష్టసుఖా లన్నిటిలో కూడ మేము తోడు నీడగా పయనించుకొంటూ వస్తున్న వాళ్లం. ''భీమన్న ఉగాదులు'' అనే ఈ విశిష్ట కావ్య సంపుటిని ఇప్పటికైనా అంకితం ఇవ్వగలుగు తున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. కాదనకుండా ఈ కృతిని స్వీకరిస్తున్నందులకు రామానుజ రావు గారికి నేనెంతో ఋణపడి ఉన్నాను.

కృతజ్ఞతలు

ఈ ఉగాదుల కావ్యసంపుటిని భీమన్న సాహితీ షష్టిపూర్తి సంఘం ప్రకటిస్తున్నది. అందుకు ఆ సంఘానికి నేనెంతో కృతజ్ఞుడ్ని.

ఇంతవరకూ వ్యక్తులకు మాత్రమే షష్టిపూర్తి చేసే ఆచారం మన తెలుగు నాడులో వుంది. సాహిత్యానికి షష్టిపూర్తి ఉత్సవం జరపడ మనేది కొత్త ఆలోచన. కొత్త ఏది జరిగినా నా నుంచే ప్రారంభం కావడం నా అదృష్టం. నా సాహిత్యానికి షష్టిపూర్తి అంటే, నా కది అపూర్వ గర్వకారణం.

సాహితీ షష్టిపూర్తి సంచిక ఒకటి ప్రకటించబడింది. అందులో నా సాహిత్యాన్ని పరామర్శిస్తూ ఎందరో ఎందరో విద్యాధిక మేధావి మిత్రులు వ్రాసిన సాహితీ వ్యాసాలూ, కవితలూ వున్నై. వారందరికీ కూడా నేను కృతజ్ఞతాభి వందనాలు చెల్లించవలసి వుంది.

సాహితీ షష్టిపూర్తి సంచికతో పాటు ప్రకటిత మయిన ఈ కవితా సంపుటి ఈ రూపంధరించడానికి కారకులు ఎందరో మహానుభావులు. వారందరికీ, ముఖ్యంగా సాహితీ షష్టిపూర్తి సంఘం అధ్యక్షులు రామానుజరావు గారికి, బొజ్జా తారకం గారికి, శామ్యూల్ పెనుమాక గారికి, జె. సిద్ధార్థ కుమార్ గారికి, బి. రామదాసు గారికి, శ్రీమతి సంయుక్త బుల్లయ్యగారికి, డాక్టర్ టి. వి. నారాయణ గారికి, శ్రీ కావూరి పట్టాభి రామయ్య గారికి, కె. నాగయ్య, ఎం. ప్రేమ్‌కుమార్ ఎస్. రాష్ట్రపాల్ గారలకు, తదితర కమిటీ సభ్యులకు, ఎస్. విశ్వనాథ్ గారికి, జె. బాపురెడ్డి గారికి, చిత్రశిల్పి శీలా వీర్రాజుగారికి, ముద్రాపకులు శ్రీ పి. శ్రీనివాస్‌గారికి నేను చాలా రుణపడి వున్నాను.

ఈ సందర్భంలో లేఖనాది విషయాలలో బహుముఖంగా తోడ్పడిన కుసుమ జవహర్‌లాల్‌కి, దాకే శివాజీకి కూడ నేను కృతజ్ఞత చెప్పవలసి వుంది. అదే విధంగామా అమ్మాయిలు విజయపల్లవి, విజయేందిరల సేవలను కూడా నేను గుర్తించవలసి ఉంది. అలాగే ఈఉగాదుల పుష్పమాలకు సువర్ణ తంతువుగా భాసించేమా ఆవిడ హైమవతి పాత్రను కూడా నేను ప్రశంసించవలసిందే.

నిజానికి సాహితీ షష్టిపూర్తి సంఘం కార్యదర్శి గనుమల జ్ఞానేశ్వర్ పూనుకోకపోతే ఈ సాహితి షష్టిపూర్తిగాని, ఈ సంచికగాని, ఈ ఉగాదుల కావ్య సంపుటిగాని ఈ రూపం ధరించేవి కావు. పగలనక, రాత్రిఅనక, ఎండనక, వాననక, నిద్రాహారాల ధ్యాసే లేకుండా ఈ కార్యక్రమ ఫలసిద్ధి కోసం నిరంతరం కృషి చేసిన జ్ఞానేశ్వర్‌ను చూస్తే - కరుణార్ద్రి అయిన సరస్వతి నాకు తోడ్పడే నిమిత్తం ప్రత్యేకంగా ఆయనను పంపించిందా అన్న భావం కలుగుతుంది నాకు. ఆయనకు ఎలాంటి కృతజ్ఞతలైనా చంద్రుడికి నూలు పోగుల్లాంటివే.

సాహిత్యమంటే, ముఖ్యంగా కవిత్వమంటే రాజకీయ నినాదాలు, సాంఘిక సమస్యలు, ఆకలి దప్పులు, సలహాలు, విమర్శలు కాదు. వాటన్నిటికి అతీతమై, అలసిన మనస్సుకు ఓదార్పునూ, విశ్రాంతినీ కలిగించగల ఆధ్యాత్మిక శక్తే కవిత. శరీరానికి అన్నంవలె, ఆత్మకు జ్ఞానంవలె, హృదయానికి కవిత్వం ఆహారం. ఇది నా దృక్పథం. ఈ దృక్పథంతోనే నా సాహిత్యాన్ని అవలోకించి ఆస్వాదించాలని సహృదయులకు నా విన్నపాలు.

—భీమన్న

దేవులపల్లి
రామానుజరావు గారికి

సాహిత్య కళాప్రపూర్ణుడై
విద్యా శిఖరాల నందుకొన్నవాడు

త్రిలింగ దేశ పునస్సమైక్యం కోసం
అహోరాత్రాలు సూర్యచంద్రులైనవాడు

ప్రజాభిప్రాయాన్ని ప్రగతి పథంలో పెట్టడానికి
గోల్కొండ వాస్తవ సంపాదకుడై
అపర భగీరథుడైనవాడు

తెలుగు తోటలో, సాంస్కృతిక వసంతంలో
వివిధ రచనా ప్రసూనాలను పూయించినవాడు

పలుముఖాలుగా పలచబడిపోతున్న
సారస్వత సంస్థా శకుంతలాలను పట్టి
ఒకే అకాడమీ కిందకు తెచ్చి పెంచినవాడు

ఆధునిక ఆంధ్ర సాహిత్యోద్యానానికి
నిరంతర కృషితో ఏకైక వనమాలి అయినవాడు

అన్ని భాషలలోని అన్ని అతిశయోక్తులకు
సమ్మాన్యుడైన సహజోక్తి అయినవాడు

సరసుడు, సహృదయుడు, రసాభిజ్ఞుడు
కుల, మత, వర్గ విభేద రహితుడు

సమస్త జన ప్రేమాస్పదుడు
కార్యదక్షుడు, దీక్షా కంకణ బద్ధుడు.

ఆడి తప్పని వాడు
వెన్న కడుగు లేనివాడు

దూర దర్శి, సూక్ష్మ గ్రాహి
చతుర వక్త, సజ్జీవన ప్రవక్త
నాకు అత్యంత ఆత్మీయుడు
దేవులపల్లి రామానుజరావు

అంతటి వాడికి
ఇంతటి ఉగాదుల కావ్య సంపుటిని
అంకిత మిస్తున్నాను
ఆనంద పడుతున్నాను.

రుధిరోద్గారి
ఉగాది

బోయి భీమన్న
14-4-83

భీమన్న ఉగాదులు

* * * * *

కొత్త కోకిల

కొత్త కోకిల గొంతు విప్పి
కోటి వేణువు లూదెనే!
గున్నమావుల గుండె లన్నీ
వెన్నవెన్నై కరిగెనే!
పద్య కవితల పద్మవనులు
వచన కవితల వరిపొలాలు
గేయ సుందరవాణి చల్లని
చాయలో విశ్రమించెనే!
పల్లవములా? కావు కావవి
భావి ఋతువుల ప్రాభవములే!
కారుటెండలు, గాలివానలు
కత్తిదూసిన ఫలితమేమే?
క్రొత్త కాలిడి నప్పుడెల్లా
ప్రాత బుసకొట్టుచునె యుండు;
నిత్య శంఖావర్తి విధి ఇది,
నీది నిచ్చెన మెట్ల పథమే!

2. అలరించాలే కాని

అలరించాలే కానీ- నీవు నను
అలరించాలే కానీ-
అలరు తీవలో ఆమని కానా?
ఆమనిలో ఆనందమె కానా?
పొగమంచునె పో,
అగరు దీపమై
నీ చుట్టూ వె
న్నెలలు కాయనా?
కారాకునె పో,
కరగిపోయి నీ
పదములపై నవ
పద్మము కానా?
చిరు మబ్బునె పో,
మెరుపు తీగనై
నీ యెద గుడిలో
నిలిచి వెలుగనా?
నిరుపేదనె పో,
పరమ శివుడనై -
పూర్ణ దేహ మిడి
పూజ చేయనా?

3. తుమ్మెద బోయీ

పిల్లలు పుడుతుంటారు
పెద్దలు గిడుతుంటారు
పైని చిగురాకు మొలుస్తుంటే
క్రింది కారాకు రాలిపోతుంటుంది.

క్రొత్త సంవత్సరాన్ని కనేసి
పాత సంవత్సరం కన్నుమూసింది,
తెలుగు సంవత్సరం, పాపం, మంత్రిపదవి లాంటిది!
స్వాగత సన్మానాలే తప్ప వీడ్కోలు ఉత్సవా లుండవు!

ఉత్తరాయణం ఉత్తరాదికి పుణ్యకాలమైతే
దక్షిణాదికి పాపకాలం!
ఒకరికి కొత్త వెలుగుల ఉగాదే
మరొకరికి మంచు చీకటి సమాధి!

ప్రతి ప్రేమగాథా కళ్యాణంతో సరి
ప్రతి వీరగాథా యుద్ధంతో సరి
ప్రతి ప్రజాగాథా ఎన్నికలతో సరి!
మిగిలేది పైని ఒక్కడు, క్రింద ఒక లోకం!

నా దృష్టి పైవాడిపై లేదు
నేనూ అతడి దృష్టికి అందను,
నా చింతంతా - ఈ నా లోకం
పట్టి మాలోకం కదా అని!

గెలిచేది ఒక్కడే, ఓడేది పలువురు
ఏ నియోజక వర్గంలోనైనా!
మానవ సమాజ లక్షణమే అంత!
ఊరేగేది ఒక్కడు, వోట్లిచ్చేది లక్షలు!

ఆ కొత్త వెలుగు, ఆ నవ వసంతం,
ఆ గెలిచినవాడు, ఆ ఊరేగేవాడు
తానే కావాలని ప్రతివాడూ కోరతాడు!
అవకాశం దొరికితే ఎవడూ వదులుకోడు!

కాలపు సుడిగుండంలో, చీకటి లోతుల్లో నుంచి
పైకి తేలివచ్చిందీ నాడీ ఉగాది!
పాకాలు, పాజాలు, విందులు, వినోదాలు!
ఈ మల్లెల మేనాకు నేనొక తుమ్మెద బోయీని!

— భీమన్న

4. నిత్య వసంత సీమ

స్థావర జంగమ ప్రకృతి
        సంఘములో వికసించు స్వేచ్ఛగా
జీవ సమస్తమున్ రుతు వ
        శీకృతమై; మన నారి కేళ కే
శీ వనిలోన నిత్య సర
        శిన్ విహరించు వసంత మొక్కటే;
హే, వన సుప్రియా! ఇచట
        నే స్థిరవాసివి కాగదే ఇకన్!

        మన కొబ్బరి తోటలు నం
        దన వనములు, కల్పతరు సుధాసంభరముల్:
        ఘన సేవ్యము లీ పొలములు,
        ధన ధాన్య క్షీర నీర ధర్మాలయముల్.

తీయ కొబ్బరి పూల పొత్తిళ్ల నుండి
ఆరు రుతువుల నొకరీతి ననుభవింతు
గాని, రావమ్మ కోకిలా! కోనసీమ
సర్వ శోభా లలామ! భూ స్వర్గధామ!

        అడుగు లిడినది విభుజేరు నవసరమున
        సప్తగోదావరీదేవి సప్త పదిగ;
        ఇది మహాపుణ్య సుక్షేత్ర, మిందె కలడు
        బాలయోగిగ వెలసిన పరమ శివుడు;
        రమ్మ, వాసంతి! మానవ ప్రాంగణమున
        అందుకొందువు నవ జీవ నామృతమ్మ!

5. బొమ్మల బజారు

పాత బొమ్మల్ని అమావస్యలోకి విసిరేసి
కొత్త బొమ్మల బజారులో తిరుగుతున్నాం
మా ఆవిడా, మా ఇద్దరు పిల్లలూ-
ఆ సంవత్సరాది పండుగ ఉదయం!

ఓహో, ఎన్ని బొమ్మలు! ఎన్ని బొమ్మలు!
బజారునిండా అన్నీ బొమ్మలే!
''ఈ బొమ్మలన్నీ ఎక్కడివి, నాన్నా?
ఎక్కడినుంచి వస్తై?''
అదిగో అక్కడినుంచి వస్తై!

అల్లంత దూరంలో అదొక మహాశైలం;
శైలాన్ని కొట్టి, తవ్వి, వెలువరిస్తున్నారు
రకరకాల శిలల్ని కార్మికజనం.

శిలల్ని శిల్పాలుగా చెక్కుతున్నారు
ఇదిగో, ఈ శిల్పక్షేత్రంలో శిల్పాలు!

మహాశైలం సామీప్యంలోనే
తీరికలేకుండా పనిచేస్తున్న కళాక్షేత్రం,
దానిచుట్టూ విస్తరించివున్న బజారు అది.

ఆ శిల్పక్షేత్రంలో తయారయ్యే బొమ్మలు
ఈ బజారుకు వస్తూవుంటై నిరంతరంగా,
పోతూవుంటై నిదానంగా.
రావడంకంటె పోవడం తక్కువ కనుక
బజారు క్రిక్కిరిసే వుంటుందెప్పుడూ.

బజారునిండా ఎన్నో షాపులు,
అన్ని షాపుల్లోనూ అవే బొమ్మలు,

ఒకే శైలం శిలల శకలాలు
ఒకే శాస్త్రం కింద చెక్కబడ్డాయి,
ఒకే కేంద్రం నుంచి సప్లయి అయాయి.
ఒకే వెలకు లభించాలి న్యాయంగా.
అయినా-వాటి వ్యాపారంలో
ఈ షాపులమధ్య ఎంత పోటీ!
వెలలో ఎంత వ్యత్యాసం!
రోడ్డుపక్క రూపాయికి దొరికే బొమ్మ
మోహన శిల్పశాలలో మూడు రూపాయలు,
హస్తకళల కౌముదిలో అయిదు రూపాయలు!

మౌలికంగా ఏ తేడాలూ లేని బొమ్మల్లో
స్థాన విశేషాన్నిబట్టి
ఒకో బొమ్మకు ఒకోవిలువ!
ప్రచార విశేషాన్నిబట్టి
ఒకో బొమ్మకు ఒకోప్రఖ్యాతి!
బలప్రయోగ నైపుణ్య విశేషాన్నిబట్టి
ఒకో బొమ్మకు ఒకో రాజపూజ్యత!

మేము ఈ బజారులో
సరదాకు తిరుగుతున్నామా?
మాకు అవతల బోలెడు పను లున్నై.
అందమైన ఏవైనా రెండు మూడు బొమ్మలు
కొనుక్కుపోవడానికి మా ఈ షాపింగు!

చూచేకొలదీ చూడా లనిపిస్తున్న బొమ్మలు
ఉండేకొలదీ ఉండా లనిపిస్తున్న బజారు,
ఒకదానిని మించి ఒకటి
ఆకర్షిస్తున్న షాపులు
తమ అరచేతులలో
మనకు చూపుతున్న స్వర్గాలు!
అరచేతిలో పెట్టి
మోచేతివరకూ నాకిస్తున్న అప్సరలు!

''నాన్నా, ఈ సరస్వతిని కొందాం''
అన్నది, మా ఎనిమిదేళ్ల చిన్నపిల్ల
మైమరచి తిరుగుతూన్న నన్ను గుంజుతూ!
''నాకు ఆ లక్ష్మి కావాలి'' అన్నది
మా పెద్దపిల్ల వెనువెంటనే!
''అది చదువు లేకుండానే
డబ్బు గడిస్తుందేమో'' అన్నది చిన్నది
చురచుర చూసింది పెద్దది-
మహా కవుల్ని పోషిస్తున్న
వేలిముద్ర జమీందారు వలె!

సరస్వతినీ, లక్ష్మినీ కూడా కొన్నాం!
''మరి, పార్వతో?''
''నే నున్నానుగా?'' అన్నది వాళ్ళమ్మ,
''నీవు అలమారాలో పట్టవు''!
పార్వతి బొమ్మకోసం వెతికాం,
ఏ దుకాణంలోనూ లేదు!

''పార్వతి అంటే శక్తి కదా, నాన్నా?''
''అవును, ఆ ఇద్దరినీ మించిన శక్తి''.
''మనకు లక్ష్మి సరస్వతీ వున్నారు,
కాని శక్తి లేదు!''

అదిరిపడ్డాను, ఆ పిల్ల అభ్యుక్తికి!
ఎంతటి సత్యావిష్కరణ!

అవును!
మనకు లక్ష్మి వుంది
సరస్వతి కూడా వుంది
శక్తే లేదు!

పైరవీల పంచలలో
లంచాల కంచాలలో
చీకటి బజార్ల లాకర్లలో
అధిక ధరల బొజ్జలలో
పదవీ రాజకీయాలలో
ప్రపంచ పర్యటనలలో

ఓహో, లక్ష్మి!
లక్ష్మికి సేవ చేస్తూ సరస్వతి!
అవును, నిజమే!
మనకు శక్తే లేదు!

"ఇదిగో, ఇక్కడున్నది పార్వతి!
శైలజ! శక్తి!"
"ఏదీ, ఏది, నాన్నా?"

అదిగో, అలా చూడు!
ఆ కొండ నుంచి బండల్ని
తవ్వి పడవేస్తున్న శ్రమ జీవుల కండల్ని,
ఆ శిలల నుంచి శిల్పాలు
చెక్కి పడవేస్తున్న బొమ్మల్ని,
వాళ్ల ముఖాలలో చిందుతున్న దేమిటి?
వాళ్ల నఖాలలో మ్రోగుతున్న దేమిటి?
చెమట కాదు, శివ!
శ్రమకాదు, శక్తి!
ఇక్కడున్నది శక్తి,
బజారులో ఎక్కడుంది?

"మరి, మరి.—"
"మరి, అది
మన చేతికి రావడ మెలా" అంటావా?
అదే వస్తుంది, పద!
రాకేంజేస్తుంది
తప్పక వస్తుంది.

6. ఉపజ్ఞా కోకిల

ఏమిటే కోయిలా
ఏమాయె నీ గొంతు?
పోయెనో ఆమనులు,
పూయవో మామిడులు?
　　చింతతో కూర్చుంటివే, కోకిలా!
　　చింత చిగురులు తింటివే?
స్వేచ్ఛా విహారివే
శ్రీ తనయు సహచరివి,
ఆంధ్రీజన స్థాన
ఆస్థాన గాయనివి,
　　ప్రజ్ఞలెక్కడ పోయెనే, కోకిలా!
　　ప్రాభవ మేమ్కమాయెనే?
బేల పడకే, బాల!
పోలేదు నీ పరువు;
కాలచక్రపు నీడ
కాంతి తగ్గిన దంతే!
　　హిమ నిశీథులు కరగునే, కోకిలా!
　　సుమ రోదసులు విరియునే!

(శ్రీమన్న కాలేజీ విద్యార్థిగా వ్రాసిన పాట ఇది. విదేశీ పాలన బానిసత్వంలో దేశం ఉన్నప్పుడు, జాతి ఆత్మ మూగవోయి ఉన్నప్పుడు, దానిని కోకిలగా ఊహించి ధైర్యం చెబుతాడు కవి).

7. నవోదయ వైతాళిక

(నవోదయ విభాతం ప్రపంచాన్ని మేల్కొల్పుకొంటూ వస్తుంది. విశ్వకృషికుడైన మానవుణ్ణి సమీపిస్తుంది. తట్టి లేపుతుంది.)

రాత్రిని కౌగలించుకొని,
        రాజువలెన్ శయనించి, స్వాప్నిక
క్షేత్రము పైరుపెట్టిన కృ
        షీవల మిత్రమ! లెమ్ము! ప్రాజ్మహా
గోత్రములందు చేపు లవి
        గో! ఫలసాయపు మాధురుల్ సుధా
పాత్రములందు తీసె సువి
        భాతము నీ కని! లెమ్ములెమ్మయా!

భీమన్న

నిద్దురలో నీయూహల
ముద్దులు కురిపించి, నిన్ను ముంచెత్తిన ఈ
ప్రొద్దునుగైకొని కన్నుల
కద్దు కొనన్ లెమ్ము! లేచినది జగ మెల్లన్!

శ్రీలు కోటిమంది క్షీరాబ్ధి నుదయించి
రనగ, తెల్లతామరసము లందు
ఇంపు గొల్పవిరిసె ఎర్రదామర పూలు!
మాధవునిగ లెమ్ము, మధురమూర్తి!

చీకటి తీగ పూచి విక
సించిన దీ ఉదయప్రసూన, మీ
రేకలపైని వాలినవి
రిక్కలు చక్కని మంచుచుక్కలై!
నాక రమా సువీక్షణ ఘ
నా కృతు లయ్యవి తేంట్లు కావు; నీ
కోకిల గొంతుతో కొలుచు
కో శ్రుతి మాధురు లాత్మ నిండుగా!

చేనులో రేయి రేయెల్ల సేవ చేసి
కోడి కూతనె కను మూసుకొన్న కష్ట
జీవివే యైన, ఏమిటి చేత నేను?
మానవుడు తప్పినను, తప్పలేను క్రమము!

చెలులన్గూడి, సుఖమ్ములన్ బొదలి, తు
ష్టిన్ బొంది, దివ్యమ్ము లౌ
కలలన్ గాంచుచు, గాఢ సుప్తిని శివై
క్యానందమున్ గొంట జీ

పులకున్ కార్యము రాత్రులందు, క్రమమున్
బోనాడి జీవింప- దు
ర్బలమై వ్రేళలు లేని తీవల గతిన్
ప్రాల్మాలవే మస్గడల్?

కుండపోతగ కురిసి, లేకుండపోయి,
మరల పైకొనుచున్నది మబ్బుతునక!
మూలశక్తిని మరి మరి మునిగిరాక
ఆత్మ వికసింప జాల దితోధికముగ.

బావిలో మున్గి, పైకేగి, పూవుదోట
తడిపి, క్రిందికి పోవు ఏతమ్మ పగిది
నిండుగా వచ్చి వట్టిగా నిష్క్రమించు
బ్రతుకు భాండము తిరిగి నింపంగ వలదె?

యామినిలో అనంత హృద
యమ్ములు చిందిన నూత్నభావరా
గామృతమే విభాత రమ
గా ప్రభవించును రోజురోజు, త
ద్భూమికలోన నీది నొక
పోలికయున్నది చూచుకొమ్మ-క్రొం
దామరపూల, చేల, రస
దాళల, తోటల, శాలియెన్నులన్!

జలజాలయ కోడలు, మన
జలజాసను రాణి, బాల జలజాప్తునకున్
పులు గడిగి, పురుడు పోయగ
కలహంసము నెక్కివచ్చె! కనుగొను ముషసిన్!

భీమన్న

ఒక్కొక్క ఉషస్సును హృది
కొక్కొక్క నవానుభూతి నొసగుచు జీవిన్
ఒక్కొక్క మెట్టు పెంచును!
దిక్కులు కననేల? బైలుదేరుము నాతో!

పరమ విష్ణుమోసి, బ్రహ్మను ప్రసవించి,
తనువుదొరగి చనియె తాను రేయి;
కాల రుద్రమూర్తి కనువిచ్చుటకు ముందె
లోకబాంధవునిగ సాకుకొమ్ము!

పురు లంటుకొనగ పేలాల్
కొర కురికెడి మూక భంగి క్రుమ్మరు నదె ప్రా
గ్గిరి తటముల, తొగతోటల,
అరవిందములందు రేగి అలి బృందమ్ముల్!

డెందమును దోసిటన్ గొని
వందన మిడు ముదయరవికి; ప్రాత స్సంధ్యా
వందనమే సుందరమౌ,
నందనమౌ; శతవిధాల నవ మందిరమౌ!

8. వాకిట్లో వసంత లక్ష్మి

ఒక ప్రక్క--
పంపులో నీళ్ళు లేవు
మార్కెట్లో కూరలు లేవు
జేబులో పైసలు లేవు!

మరో ప్రక్క--
వసంతలక్ష్మి వచ్చి
వాకిట్లో నిలబడింది!

ఏమి టలా చూస్తావు?
ఒత్తేసుకో కళ్ళల్లోని దైన్యాన్ని
హత్తేసుకో వసంతలక్ష్మి హృదయాన్ని.

గత రాత్రి చచ్చిపోయింది పాత ఏడాది,
దాని చితినుంచి పుట్టుకొచ్చింది కొత్త ఉగాది!
పాత కన్నీళ్ళు రాలిపోక పోతే
కొత్త వెలుగులకు చోటెక్కడిది?

మన కేమున్నదో, ఏం లేదో
పండగ కేం తెలుస్తుంది?
పండగకు కావలసింది గుండె!
అది మనకుంది, చెప్పు స్వాగతం!

కాలిపోతున్న గుడిసెల్ని కాలిపోనీ!
వాటి సమాధులే పునాదులుగా
లేచే భవనాలకు రూపం కల్పించుకో!

పాత ఏడాదీ ఏడాది క్రితం
కొత్తగానే పుట్టింది కాదా?
పుట్టడంకాదు ముఖ్యం
పుట్టుక సార్థకం కావాలి!

కాలిపోయిన గుడిసె స్థానంలో
మరో గుడిసె లేస్తే ఏం లాభం
అభ్యుదయం ఎలా సాధ్యం
అని కదూ నీ ఆలోచన?

వందలు వేలు ఉగాదుల్ని
మనమే వ్యర్థం చేసుకొన్నాం,
లోపం ఉగాదిది కాదు
అది ప్రతిసారీ నవ్వుతూనే వస్తున్నది,
మనమే దాన్ని ఏడ్పించి పంపేస్తున్నాం!

మన కష్టాలు మనకే వుండనీ,
మన సుఖాలను మధులక్ష్మికి పంచు!

నిత్యకల్యాణం పందిరి కింద
నెరసిన తలలూ వుంటై,
పచ్చతోరణం ప్రణయ పంక్తిలో
పండిన కలలూ వుంటై!

మల్లెపూల తీగల కింద
మంటి పెల్లలు కెలక్కు!
కాకుల లోక గోలకు విసిగి
కోకిళ్ళను తరిమికొట్టకు!
ఎంతో గడ్డి తించే కదా
ఒక నేరు పాలివ్వడం గొడ్డు?

వనజ్యోత్స్నవు నీవు
వద్దు మృత్స్న మాలిన్యచింత!
నవోదయ లక్ష్మితో కలిసి
నవజీవన ప్రణాళికలు నిర్మిస్తాం!
నాదోపాసనతో కీటకమే
నవభ్రమర మవుతున్నప్పుడు
రసోపాసనతో మానవుడు
రాజేశ్వరుడే ఎందుకు కాడు?

మనది రసాద్వైతం, మనమే ఆనందబ్రహ్మ!
ఎందుకు చూస్తావలా ఉగాది పచ్చడిలా?
తీపితో చేదూ, చేదుతో వగరూ
కాపురాలు చెయ్యక తప్పదు!
అవిగో వస్తున్నై పంపులో నీళ్ళు!
ఇక కడిగి కళ్ళకద్దుకో వసంతలక్ష్మి కాళ్ళు!

9. త్రిలింగోదయం

శ్రీ కాళేశ్వర సూర్యచంద్ర మతులన్,
    శ్రీశైల మల్లీశ్వరే
చ్ఛా కల్యాణ గుణామృత ద్యుతుల, ద్రా
    క్షారామ భీమేశ్వర
ప్రాకామ్య స్థితులన్ రహించెడి నవాం
    ధ్ర శ్రీ- త్రిలింగోర్వి- అ
న్నాకా రేశ్వరి మా జనాళికి సమ
    స్తానందముల్ పంచుతన్!

వెతుకుతున్నాను నేను
దేనికోసమో తెలీదు
ఎంతకాలం నుంచో తెలీదు
కలలో లా అస్పష్టంగా ఉంది,
కల మాత్రం కాదు.

చంటిబిడ్డ కోరికలా ఉంది,
మాటలు రావు, జ్ఞాపకం చాలదు.

నా ముందూ, నా వెనకా, నా చుట్టూ
నాతోపాటు వెతుకుతున్నారెందరో!
మేమంతా కలిసే వెతుకుతున్నాం
వాళ్లంతా ఎవరో తెలీదు.
నే నెవరనో నాకూ తెలీదు!
అంతా జడస్థితి!

ఆ! దొరికిం దిక్కడ!
ఎక్కడ? ఎక్కడ?
ఏమిటి? ఏమిటి?
త్రిలింగేశ్వరి! త్రిలింగ ధాత్రీశ్వరి!
ఆహా! దొరికిందా నా తల్లి!
నా జనని! జన్మభూమి!
ఇప్పుడు తెలిసింది నాకు
నే వెతుకుతున్న దేమిటో!

తీరాంధ్రంలో ద్రాక్షారామంలో
భీమేశ్వరుని సన్నిధిలో
దొరికిందా అన్నపూర్ణ!
ఏదీ? ఏదీ?
అయ్యో! ఇదొక ముక్క!
ఒక ఖండం! ఒక వరుణభంగి!

అదిగో అక్కడ! అక్కడ!
ఎక్కడ? ఎక్కడ?
రాయలసీమలో, శ్రీశైలంలో
మల్లికార్జునుని సన్నిధిలో
కువలయానంద కుంకుమ రూపిణి!
దొరికింది మహాశక్తి, మా భూమి!
ఓహో, దొరికిందా? ఏదీ!
అయ్యో, ఇది కూడా ఒక ముక్క!
ఒక ఖండం! ఒక శీతుభంగి!

ఎక్కడి కీ పరుగు?
ఏమిటీ కోలాహలం?
నేనూ పరుగెడుతున్నా నెక్కడికి?
రజాకార్లు! రజాకార్లు!
ఎవరా భక్తజన రక్షకులు?
నిద్రపోతున్న జాతిముఖం మీద
నెత్తురు కల్లాపు చల్లిన అరుణోదయంలో
జన్మ జన్మాల దాస్యపు బూజు తొలగిపోగా,
నెత్తురుబొట్లే రత్నాలై మెరుస్తూ
కోటి రత్నాల వీణ ఝంగుమనగా,
అమ్మయ్య, దొరికిం దిక్కడ!
తెలంగాణలో, కాళేశ్వరుని సన్నిధిలో
దొరికింది మహాశక్తి!
నవశక్తి! యువశక్తి!
దొరికిందా? ఏదీ? ఏదీ?
అయ్యో, ఇది కూడా ఒక ముక్క!
ఒక ఖండం! ఒక వసంత భంగి!

మూడు లోకాలు పాలించగల
ముక్కోటి తెలుగు శక్తిని
ఇలా మూడు ముక్కలు చేసి
ఎడాపెడా విసిరేసిం దెవరు?
ఎవరికుంది మనల్ని గెల్చే శక్తి?
అనంత జీవజ్యోతి-

జ్యోతిర్లింగ రూప విభూతి-
ముక్కంటే మూడు ముక్కలై
ఇలా చేశాడా తెలుగు శక్తిని?

అలా వీల్లేదు, వీల్లేదన్నాం,
పట్టం దంటే పట్టం డన్నాం,
మూడు ముక్కలైన తెలుగు సీమను
ఏక భూమిగా చేసేశాం!
మూడు ముక్కలైన మహేశ్వరుణ్ణి
ఏకేశ్వరుణ్ని చేసేశాం!

రెండు కళ్లుండడం సామాన్యం,
మూడు కళ్లున్నప్పుడే ముజ్జగాలు పాలించడం!
కోస్తా, రాయలసీమ, తెలంగాణ-
మూడూ మూడు కళ్లు తెలుగు నేలకు.
ఖండ మాత్రం కా దిప్పుడు ఏకఖండం!
ఏకనేత్ర కా దిప్పుడు, త్రిలోచన!
త్రివక్ర కా దిప్పుడు, త్రిభంగి!
త్రిభంగిగా నిల్చి త్రినేత్రాలూ అరమోడ్చి,
తీయని ఫలా లందిసున్న త్రిలింగ దేశలక్ష్మి!
త్రిధా శతధా భిన్నులై ఖిన్నులై వున్న మాకు
వేంగి, ఏకశిలా, విజయనగర
సామ్రాజ్యపు ఆదర్శాల ముందు
వీర తిలకం దిద్దుతున్న
పూర్ణ వసంత రాజ్యశ్రీ!

10. ప్రగతీ! ఓ ప్రగతీ!

ప్రగతీ, ప్రగతీ, ఓ ప్రగతీ!
సర్వలోక మానవోన్మన స్వ్వగతీ!
ఎవరు దేవీ, నీవు?
ఏది నీ వుండే తావు?

అందరూ నిన్నే కోరుతున్నారు
ఎందరో నీ వెంట పడుతున్నారు
నీ కోసం పోటీలు పడుతున్నారు
పార్టీలు కడుతున్నారు
మీసాలు తీసేసి, రోసాలు పెంచుకొని
సుందోపసుందులే అవుతున్నారు
ఎవరు దేవీ నీవు, ప్రగతీ?
ఎక్కడా కనిపించదు నీ అతీగతీ!

రేడియోలో నీవు నాద రాధవు
పత్రికల నిండా నీవు అక్షర రంభవు
సభావేదికలపై సాక్షాత్ మోహినివి
హరిజనులకు ఆకాశ సౌధానివి
బలహీనవర్గాలకు బంగారు లేడివి
ఓహో, నీ వోరచూపుల వొంక నవ్వు
అయిన వాళ్లకు అమృతం!
కానివాళ్లకు కల్లు!

అరవై కోట్ల గుండెలు
నీ కోసం కొట్టుకొంటుంటే
ఇరవై కోట్ల గుడిసెలు
చీకట్లో పొగచూరి చస్తుంటే
కోటల్లో రత్నకింకిణులూ
కూలీపేటల్లో ఇనప గజ్జెలూ
గళ్లు మనిపిస్తున్న రాజమోహినీ!
కోట్ల ప్రణాళికల పసిమినంతా మేసేసి
ఎండిపోతున్న పల్లెటూళ్ల నోళ్లకు
పండు గవుతున్న మృగతృష్ణా!

జాతి దారిద్ర్యం మహాసముద్రంలా
విలయతాండవం చేస్తుంటే
కొద్దినోళ్ళకు మాత్రమే
ముత్యా లందిస్తున్న స్వాతీ!
ప్రగతీ, ఓ ప్రగతీ!
ఏది నీ ప్రగతి?
ఎవరి కోసం నీ తథాగతి?

''సామాన్యుడు చైతన్యవంతుడు కాకుండా
గంగకూడ మురిక్కాలవే నయ్యా, కవీ!
నీ గుడిసెను నీ భుజాలపై మోసుకొంటూ
నీ వెంత పరిగెత్తినా నీకు నే నందను!
ఆ చీకుచెత్త నంతా పారేసి నిలబడు,
అప్పుడు ఈ ప్రగతి సమస్తం నీదే!''

11. నిత్య వసంత నగరం

గ్రీష్మ మెంతగ లోక ప్రభీష్మమైన-
గిరి నిపాత ధారా నిరంతర ఝురులతొ
ఝరి ఝరాసార శోభిత తరులతలతొ
తరులతా పుష్ప గంధ శైత్యములతొ
శీతల రసార్ద్ర కేళీ విశేషములతొ
శ్రీ వసంతమె వెలయు బృందావనమున
రామకృష్ణు లందున్న కారణము కతన
అనుచు వర్ణించినారు పోతన్నగారు!

రామకృష్ణుల మందిరారామ మగుట
మండువేసవె ఆట మధుమాస మగును,
చుర్రుమను నెండయే సుఖజ్యోత్స్న యగును,
ఉక్కపోతయె చందన యోగ మగును,
చింతనిప్పుల మంటలు చిమ్మునట్టి
నట్టనడిమింటి సూర్యుడే నవ వసంత
శుభ్రశశియౌను, రామకృష్ణులకె కాదు-
వారితోనుండు వారికెవ్వరికి నంతె!

కృష్ణుడే తాను, తానె శ్రీకృష్ణు డగుచు
బ్రతుకె బృందావనమ్ముగ బ్రతికినట్టి
పోతనామాత్యునకు, తదాప్తులకు కూడ
నిప్పుటెండయు పండు వెన్నెలయె కాయు!

భాగ్యమతి పేర వెలసిన భాగ్యనగరు
బృందకంటెను నేమిట క్రిందిదయ్యె?
బాల గోపాలు డుండిన కాలమందు
బృందలోనున్నవెల్ల నే డిందు లేవె?
నిత్య నిపతిత గిరిదరీ నిర్ఝరులతొ

నిర్ఝరీభూత మధుహిమానీ రుచులతో
రుచి మహామోద పురవనీ ప్రచురణలతో
ప్రచురసంపత్ రసాలినీ ప్రణయములతో
హ్లాద రమణీయ సాగరోల్లాసములతో
ప్రాణహిత సాహితీ సుప్రభాతములతో
అనవరత కళానంద సాయాహ్నములతో
మధుర మై రేయ రాత్రుల మైకములతో
నిత్య సంగీతసాహిత్య నృత్యవిధుల
పరమమోహనమై, నిరంతర వసంత
శీధువుల నిన్ను నన్ను రంజించునట్టి
భాగ్యనగరుకు సాటి విశ్వమున కలదె?

గోకులము గోకులమె రాధయై కుమార
కృష్ణు నర్చించినట్టిది బృందవనము;
భాగ్యమతియు, కులీ కుతుబ్షాయు భువికి
ప్రణయసుధ పంచినట్టిది భాగ్యనగరు;
వారు నేగిరి, ఏగిరి వీరు కూడ
అమృత గంగా ప్రతీర విహారములకు;
మనము, మన వంటి వారెంతోమంది నేడు
తెర్వరులమే తదానంద తీరములకు !

రాజ్యములు నిల్చునా ? ప్రేమరాజ్యమొకటె
పరమమై నిల్చు శాశ్వత బ్రహ్మపదవి !
రాజు లుందుర ? ప్రేమ సమ్రాట్టు లొకరె
ఏలుచుందురు ఎదనెద నెల్లరతుల !
కాంచు మందుకె – ఈ నిదాఘమ్మునందు,
ఒక వసంతమె కాదు, పేరోలగముగ
ఋతువు లారును మన చుట్టు నృత్యమాడు !

నవ్వుచుంటి వదేమె ఆనంద మధుర
రాగ వైశాఖి? వైశాఖ రమ్య పూర్ణి
మాసి? ఎందుకే సోత్ప్రాసహాస మంత?
ఆవిరులు లేచెనేమి నీ హాస మందు ?
చైత్రి వైశాఖి నెలలు వసంతమన్న
వాడి కంఠెను మూర్ఖుడు లేడె యనుము,
ఫాల్గునియు చైత్రియును మధువగునె యనుము,
మండు వైశాఖమొకటె గ్రీష్మమగు ననుము!
అంతమాత్రము చేత నేమాయె, సకియ ?

గ్రీష్మమందె వర్షర్తు విక్రీడ లేదె ?
ఘర్మధారలు కురిసి నీ గాత్రలక్ష్మి
కమల వాసిని కంది చికాకు పడదె ?
బృందలో వసంతమె నిల్చె గ్రీష్మమందు,
భాగ్యనగరున వర్షర్తు వయ్యె నదియె!

చారు శీతల చందన చంద్రికలతో
నారికేళ తాళాంబు తుషారములతో
పక్వ పరిపన్న మకరికా పత్రములతో
కోరి శరదాదులును నిన్ను పోల్చకొనవె ?
కొంచె మటు నిటుగా సర్దుకొందుమేని,
సృష్టి నైజము తెలిసి జీవింతుమేని,
బ్రతుకె నిత్యవసంత దివ్యమనోజ్ఞ
భాగ్యబృందావనమ్మలు పరగు మనకు!
ఎల్ల సుఖములు మనలోనె వెల్లివిరిసి
అందుకొందుము మనము ఆనందమధువు!

12. ఆమని మువ్వలు

ఎక్కడివీ మువ్వల గలగలలు?
మువ్వల గలగలలు
రవ్వల రవరవలు? ॥

ఏ మువ్వల గజ్జెలు
ముందడుగులు వేస్తున్నవో,
ఏ రవ్వల మొలత్రాడు
గారాము చేస్తున్నదో? ॥

ఎటు నుంచి?
ఎటు పొంచి?
ఇటు తూరుపు నుంచి
అటు పడమర నుంచి
నానా దిక్కుల నుంచీ
నా కేసె వస్తున్నవి? ॥

పై నుంచా? ఆ
పై నందన వని నుంచా?
క్రింది నుంచా?
బృంద నుంచా?

నా హృదయ స్పందనలే
నవ వాద్య బృందంగా
నా చుట్టూ, నను తట్టే
నవశోభా నృత్యాలు,
నవ లక్ష్యాలకు నన్ను
నడిపించే తత్వాలు. ॥

13. ఎప్పటి కప్పుడే కొత్త

ప్రతి వసంతము క్రొత్తదే, ప్రతి పిక స్వ
రమ్ము క్రొత్తదే సృష్టి ప్రారంభ మాది;
క్రొత్తదై ప్రతి క్షణము నీ కొరకు విరియు!
నింపుకొనుచుంటివే గుండెనిండ మధువు?

ప్రతి పసిపాప క్రొత్త, దది
పల్కెడి గొంతు ప్రతీది క్రొత్తదే!
ప్రతి ఋషి వాక్కు క్రొత్త, దది
పంచిన సర్వసమాన జీవన
వ్రతమును క్రొత్తదే; చెవుడు
పట్టిన దీ కులజాతి! కానిచో
మతిచెడి లోక మానవ స
మాజపు వాకిట దొసి లొగ్గునా?

నూత్న యుగములు; క్రొత్త గొంతుకలు సతము
వచ్చి పోవుచు నుండు ప్రభాతము లటు;
మేలుకొనియుండుచే రాజ్య మేలుకొనుట!
జోగులాంధ్రకు లే వుషశ్శోభనములు!

సిరి వాల్జూపు, సరస్వతీ ప్రియదర
స్మేరమ్ము, శైలాత్మజా
వరసత్త్వమ్ము సమానమై భువికి ల
భ్యంబౌ సదా; నేడు తత్
కర పీయూషము గ్రోలు వంతు మనదా
కా వచ్చె; మేల్కొల్పవే
భరత క్ష్మాజనయిత్రి శ్రీచరణసే
వాసక్తికిన్ నీ ప్రజన్?

బహు జనమ్ముల చీకట్లు బడగ్రోసి
కువలయము నెట్లు గెల్తురు కొద్దిమంది ?
కులమతా లను పిచ్చుక గూళ్ళలోన
సంచరిలు టెట్లు వసుధైక జాతి రవులు?

గాంధి చెప్పిన దేమిటి? క్రైస్తు, మార్క్సు,
వ్యాసు, అంబేద్కరుడు, బుద్ధు డదియె చెప్పె!
వేద మేదైన, పలికిన నాద మొకటె!
సృష్టి రాహస్యమేమి గుర్తించినావు?

మన అదృష్టేందిరాదేవి మనసు పండి
రాశులైనవి అవకాశ రాజనాలు!
దక్కునో ఇపు డివి బీద బిక్కు ప్రజకు ?
తెరచియున్నవి నరబకాసురుల నోళ్లు!

ఆగస్టు విప్లవ లక్ష్యమేమిటి? స్వరా
జ్యశ్రీని ఏ నల్గురో
భోగుల్ పట్టి చెరన్ గొనన్ గలుగుటో?
బ్యూరోక్రసీ దాస్యమో?
వాగర్థాల విడాకులో? ప్రజకు సం
వాగ్దాన సంతర్పణో?
త్యాగుల్ జానపదుల్; తదీయ ధన ధా
న్యశ్రేయముల్ ముఖ్యముల్!

కావున డెందము విందుగ
జీవన సుధ నొంచు కొమ్ము, చిత్సత్ గతిలో
నీ వంతు వచ్చె; నసుగే
లా? వీరముగొమ్ము, ముందు కడుగిడు మింకన్!

14. జీవిత రామాయణం

వ్యాస వాల్మీకులే కవులవని కెల్ల;
కడమ వారు వారల పాదకమల గత మ
ధూళి సేవించి బ్రతుకు మధువ్రతాలె!
అందు కడపంక్తి నొక పసికందు నేను!

రసమయ మైన సృష్టి నొక
రామ చరిత్రగ తీర్చిదిద్ది, మా
నస సరసీ ప్రతీరమున
నాటిన వాల్మికి ఎట్టి మాలియో!
అసదృశమై, అనాదికి న
నంతతకున్ మొదలున్ శిరమ్మునై
ఎసగెడు నద్ది - జీవ పర
మేశ్వర పుష్పఫలప్రరోహమై!

ఆరు ఋతువులు కాండము లారు కాగ,
మధుర సంపూర్ణ ప్రకృతి రామాయణ కృతి!
చైత్ర చైత్ర మధ్యస్థ వత్సర మొకొకటి
ఒకొక పారాయణము కాల వికసనమున!

శైశవీ, బాల్య, తారుణ్య, సత్త్వ, ప్రాజ్ఞ,
బ్రాహ్మ్య దశ లారును పదేసి వర్గములుగ
మానవుని షష్టిపూర్తి రామాయణమ్ము!
రస పరాకాష్ఠ ఉత్తర రామ చరిత!

రాముడు మానవుం; డతని
        రాగము ద్వేషముతోడి జీవితా
రామము కావ్యమిద్ది; ముకు
        రమ్మున చంద్రుని వోలె చూచి, నీ
భూమికి చూపి, దిద్దుకొను
        మో నరుడా, బ్రతుకంచు - రామ నా
మామృత మిచ్చినాడు, పర
        మాత్ముడు వాల్మికి ! మౌని మాత్రుడే ?

సామాన్య మానవుడు శ్రీ
రాముడు, దేవతయె సీత; రామ చరితకున్
ప్రేమ రస సిద్ధి సీతా
శ్రీమచ్చరితమ్ము, హృదయ శిల్పాలయమున్ !

సీత ! సమస్త భూతముల
        జీవరసాన్నము తానెయౌ కృషీ
సీత ! సమస్త జీవులకు
        చిద్విక సన్మధు మాత జానకీ
సీత ! సమస్త విశ్వపరి
        సేవిత లక్ష్య పరాపరార్థ ఈ
సీతను గొల్చె మాధవ రు
        చిన్ గొని వాల్మికి మాధవాప్తికై !

జీవి రాముడు, సంస్కృతి సీత; లక్ష్య
పథములో నడిపించు దీపమ్ము సీత;
దీప మున్నంతవరకె అస్తిత్వ మెదియు
మానవాభ్యుదయమ్మె రామాయణమ్ము.

15. పండగనాడూ—

పండుగనాడూ పాత కవిత్వమేనా?
కొత్త దేదైనా పలకవయ్యా, కవీ!
ఎందు కా పాడు విసుర్లూ, విమర్శలూ, తిట్లూ?
ఆత్మను కరిగించే దేదైనా వుంటే చూడు!

కోకిలకు వసంతం ఒక్క అరవై రోజులు,
కవి కోకిలకు వసంతం అరవై యేళ్ళు!
మనకు వసంతం మొత్తం కాలమే!
నీ పాట కావాలి బాట నిత్యనవోదయానికి!

మల్లెపూలు, మధువ్రతాలు, మామిడి పిందెలు
గోరింక పిల్లలు, కోకిల పిల్లంగ్రోవులు
కొత్తజంటలు, కోరికల మంటలు, పంటలు
పైరగాలులు, ఫలరసాలు, మధువులు!

మధువులో మళ్లీ మళ్లీ వికసిస్తున్న వన్నీ
అన్నీ పాతవే కావా అంటావా?
ప్రభవకూ, అక్షయకూ తేడాయే లే దంటావా?
నిన్న నేనూ, నేటి నేనూ ఒకే ఒక్కటంటావా?

ఒక్క ఉషస్సుందరిగా తృప్తిపడేది గులాబీ,
లక్ష గులాబీల పరెమోషస్విని ప్రేయసి,
ఒక్కసారి నాకేసి ఇటు చూడు!
నవనవోన్మేష శ్రేయస్సువే నీవై పాడు!

ప్రతి జీవలవానికీ ఒక ఆయుష్కాలం లేదా?
ప్రతి విత్తనమూ చెట్టై, మళ్లీ విత్తనమై పోదా?
విత్తనమూ, దాని విత్తనమూ ఒకటే కాదయ్యా!
వాటి నడుమ ఒక తరం అనుభవసారం ఉందయ్యా!

గత ఉగాది కోకిలది విషాదకషాయ కంఠం,
ఈ ఉగాది కోకిలది విజయావేశ మధురోక్తి!
మరి, నీవు ప్రభవనుంచీ పలుకుతున్నదంతా
అక్షయ దాకా అక్షయపాత్రే ఎందుకవాలి?

శ్రీమన్న

పోయి కొత్త పాటలు పాడుకో అన్న ఎంకికి
వట్టి ఫొటోలు మాత్రమే తియ్యగలిగావు!
తెలుగు తోటల్లో వెలుగు తేనెలు తియ్యలేక
ప్రక్క-కొట్లు నుంచి పానకం తెచ్చి అమ్ముతున్నావా?

వైతాళికుడి నన్నావు-
వైయాకరణి వయ్యావు!
అభ్యుదయం అన్నావు-
అమావాస్యతోనే ఆగిపోయావు!

మానవుడు సూర్యుడు కాదయ్యా, చంద్రుడు!
దోషరహితుడు కాదు, దోషాకరుడు,
హాని వృద్ధు లున్నవాడు, అస్థిరుడు, అక్రముడు,
అయినా - అమృత హృదయుడు, అందుకే మానవుడు.

సూర్యుడు ప్రాణం, అది ప్రతి గాడిదకూ వుంది;
చంద్రుడు హృదయం, అది ఎందరిలో వుంది?
ప్రజ్ఞాన ప్రవేగానికి ముందుండాలి నీ ప్రభ!
కనీసం దానికి ప్రతిబింబం కావాలి నీ ప్రతిభ!

గులాబితోటలో ప్రేయసితో విహరిస్తూ
కొమ్మకు ముళ్లున్నాయని విసుక్కొంటున్నావా, కవీ?
కోకిలలో నీవు చూడవలసింది నలుపును కాదు,
దాని గానంలోని కొత్త ఉగాది మలుపును!

మామిడి కెంజిగురాకు ఒకరికి ఐస్‌ఫ్రూట్
మరొకరికి ఉగ్రకాళి నెత్తురు నాలుక,
ఇంకొకరికి విజయారుణ ఖడ్గ ధార,
కవికి మాత్రం అది నవజీవన రాగరేఖ!

మలయానిలానికి మానవుడు పులకిస్తాడు,
మానవస్పర్శకు మలయానిలమూ పులకిస్తుంది,
కాకపోతే - అది మనదాకా ఎందుకు వస్తుంది?
నీ కవితాస్పర్శతో కాలాన్నే పులకింపజెయ్యి!

కాలప్రవాహంలో ఒకో జీవితంలో ఒకో సుడిగుండం,
తనచుట్టూ తాను తిరుక్కొంటూ పోతుందది ముందుకు!
ఏ వీణారవం రేపిందో ఈ ఆవేగవలయాలను!
నీ కవితావేణువు నిలపాలి వాటికి దీప గృహాలను!

అరస మనీ, విరస మనీ అటూ, ఇటూ ఊగకు!
నీది సరసమైతే, అవి నీకే బొమ్మబొరుసులు!
అమ్మో, నాకేసి అంత గుచ్చిగుచ్చి చూడకు
నాలో నీ మైకం స్విచ్ ఆఫ్ అయిన లోకం!

పండగనాడూ పాత కవిత్వమేనా అనడం-
వికసిస్తున్న మానవాత్మకు నీకంఠం ఇవ్వమనడం!
నిన్నటి నీవూ, నేటి నీవూ ఒకటి కాదయ్యా!
ఒకటే అయితే, అభ్యుదయమే అర్థరహిత మయ్యా

భీమన్న

16. తాకనా?

తాకనా ఒకసారి
తన్మయత నొందః
అరుణోదయాలు నీ
చరణారవిందాలు ॥తా॥

ఉదయరవి చంద్రికా
ఉద్యాన రాధికా
మోవి మకరందాలు
ముద్ద మందారాలు ॥తా॥

ఆమోదమును గ్రోలి
ఆస్వాదమున తేలి
అందాల రుచులతో
ఆనందకందమై ॥తా॥

(ఒక ఉగాదినాడు మధ్యాహ్నం నేను నిద్రపోతుండగా ఒక చిన్న కల. దేవత లాంటి బాలిక నా ఎదట నిలిచి, నాతో ఆడుకొంటుండగా, నేను ఆనందంతో ''తాకనా ఒకసారి'' అంటూ అందంగా తిలకామోది రాగంలో ఆమె నిండా చిరునవ్వుల గిలిగింతలు పూయిస్తుండగా, మెలకువ వచ్చేసింది. ''తాకనా ఒకసారి'' అని పాడుతూనే లేచి కూర్చున్నాను. ''తన్మయతనొంద'' అనే రెండో చరణం దానంతట అదే వచ్చేసింది. ఆ తర్వాత నన్ను చూడవచ్చిన లలితసంగీత కళానిధి పాలగుమ్మి విశ్వనాథంగారితో ఈ ఉదంతం ముచ్చటించి, పాటను వసంతవాణి పరంగా పూర్తి చేశాను.)

17. శిశిర వసంతం

నిత్య వసంతంగా
బ్రతుకుతున్న కవి అతడు.

ఇంటా, బైటా
చుట్టూ, లోనా
అంతా వసంతమే
కాముని పూర్ణిమ!

అయితే—
మంచు, పొగమంచు
ఎండలు, బండలు
వరదలు, తుపానులు
ఆకలి చావులు
రోగం, రొష్టు
నక్కలు, రాబందులు
ఏవీ లేవను కొంటున్నాడా?
వాటి బాధలకు దూరంగా వున్నాడా?

అబ్బే!
నరకంలోనే
స్వర్గాన్ని సృష్టించుకొని,
ఎడారిలోనే
ఎలమావి నీడను కల్పించుకొని,
రాక్షస రణరంగంలోనే
రాసక్రీడ లాడుకొంటూ,
శ్రమిస్తూనే విశ్రమిస్తూ,
చస్తూనే జీవిస్తున్నాడు!

జీవస్వభావం ఎరిగినవాడు
అతడు నిజమైన కవి!

18. పైరగాలిలో పైరవీ కవిత

నాకు వోటుందో లేదో కూడ తెలీదు,
మా వూరివాడే ఒకడు ఎలక్షనులో గెల్చి
శాసన సభ్యు డయినప్పుడు మాత్రం
ఆ రోజంతా ఏడ్చాను!

నేను పరీక్షలో సైన్సు కాపీ కొట్టడం కోసం
హిస్టరీగైడు తీసుకెళ్లాను,
త లెత్తకుండా పేపరు వ్రాసేసిపోయిన ఒకడు
ఫస్టుగా పేసైనట్టు తెలిసినప్పుడు మాత్రం
నాకు తిండే సహించలేదు!

పిత్రార్జితం తలమున్కలుగావున్న దొరగార్ని నేను,
మావూరి మురికిపేట దరిద్రు డొకడు
ఆఫీసరై వచ్చిన రోజున
అందరితోపాటు నేను కూడ
అరుగు దిగవలసి వచ్చినప్పుడు మాత్రం
తల తీసేసిన ట్లైపోయింది నాకు!

కవికీ, కపికీ తేడా కనిపించదు నాకు
పద్యం కంటె మద్యమే తలకెక్కుతుంది నాకు,
అయితే - ఈమధ్య మా మిద్దెమీద
అద్దె కున్నవాడు ఏవో పద్యాలు వ్రాసి
శాలువాలు తెచ్చుకోవడం చూస్తుంటే మాత్రం
నా కళ్లు పండు మిరపకాయ లై పోసాగినై !

ఎన్నైనా భరించగలిగాను, కాని-
ఈ కపిగాళ్ళ మెడల్లోని పూలమాలలు మాత్రం
నా మెడలో తెల్లతాచులై బుసలుకొట్టడం
కాలువాలు శవాల్లా వెక్కిరించడం
ఇక సహించలే ననిపించి—

ఎన్నో రాత్రులు ఆలోచించి
ఒక కొత్తకవి పాతపుస్తకం సంగ్రహించి
అక్కడొకటీ ఇక్కడొకటీ వాక్యాలు చించి
ఒకదాని కింద ఒకటి దించి
పేంటుజేబులో భద్రీకరించి-
ఇక ఏంచెయ్యాలో తోచక
వీధిని పడ్డప్పుడు—
హఠాత్తుగా కనిపించాడొక అధికారమిత్రుడు
చిన్ననాటి నా క్లాసుమేటుడు!

మర్నాడు జరిగిన ఆధికారిక
మాయాజయంతి ఉగాది కవి సమ్మేళనలో
మహాకవుల పంక్తిలో వెలిశాను నేను
ఖద్దరపంచీ, సిల్కులాల్చీలతో!
లక్ష బీరుసీసాల బలంతో ఉబ్బి
తబ్బిబ్బై నిలిచాను మైకు ముందు!

మెడలోపడ్డ పెద్ద
ముద్దగులాబీల మాల
ఎడాపెడా ముద్దులు కురిపిస్తుంటే
తుడిచేసుకొంటూ కవిత కోసం
పేంటు జేబులోకి చేయి పోనిచ్చాను,
కాని, కాని—
అక్కడ పేంటు లేదు!

19. దేశం ముందడుగు వెయ్యాలి

దేశం ముందడుగు వెయ్యాలి
అవును వెయ్యాలి!
అయితే - ఇప్పుడు వేస్తున్నది?
ముందడుగు కాదా?

దేశ మంటే ధర లనుకొంటే
దేశ మంటే జనాభా అనుకొంటే
దేశ మంటే రూపాయి నోట్లనుకుంటే
దేశ మంటే వచన కవిత లనుకొంటే
ఇప్పుడు వేస్తున్న ఒక్కొక్క అడుగూ
ఒక్కొక్క స్కై రాకెట్టే కదా?

దేశ మంటే ధన ధాన్యా లనుకొంటే
ఒక్కొక్క సిమెంటు మేడ చీకటి గదీ
ఒక్కొక్క రత్నగర్భే కదా?
దేశ మంటే ప్రజాస్వామిక రాజకీయా లనుకొంటే
ప్రతి గ్రామపంచాయతీ చావడీ
ఒక్కొక ధర్మక్షేత్రమే కదా?

దేశంలోని ప్రతిగుంట నీళ్లూ
పాలై ప్రవహిస్తున్నవి!
పర్రల్లోని ప్రతి బెడ్డరాయీ
బియ్యం స్టేటస్‌తో బస్తాల కెక్కుతున్నది!
పెంటల్లోని ప్రతి పేడకడీ సాంబారు పొడై
విస్తట్లో గుబాళిస్తున్నది!

అంతర్జాతీయ రంగంలో
మన బేరసారాల నిజాయితీ, ఖ్యాతీ
మన క్రీడా వినోద విన్యాసాల శక్తీ, యుక్తీ
ఓహో! యమ!

ఇందతా దేశం ముందడుగు వెయ్యడం కాదా?
ఇదంతా వట్టి వక్రోకే అంటారా?
చెప్పేదేదో సూటిగా చెప్పమంటున్నారా?
అయితే- ఇదిగో వినండి!
ఇప్పుడు దేశం వెయ్యవలసింది-
ముందడుగు కాదు! వెన కడుగు!

పారతంత్ర్య పరమాంధకారంలో
ఇక తెల్లవారదేమో అన్నంత నిస్పృహలో
హఠాత్తుగా అర్ధరాత్రి
మిట్ట మధ్యాహ్నమైనప్పుడు
ఆ తీక్షణ కాంతి కిరణాలు
కళ్ళల్లో గుచ్చుకుపోయి
మనలో ముందున్న కొందరు
అంధుల మైపోయినప్పుడు
ముందుకే అనుకుంటూ
కొన్ని దశాబ్దాలు తప్పుదారిని వచ్చేశాం.

అయ్యో, ఆగండి!
మనం ఇప్పుడు పోతున్నది
మనం పోదలచిన మార్గంకాదు!
ప్రమాదంలో పడిపోతున్నాం-
ఆగండి! వెనక్కు మళ్ళండి!

ఊతకర్రతో, ఉక్కుకాళ్ళతో
బోసి నోటితో, బుద్ధ దీక్షతో
సంపూర్ణ త్యాగంతో
సర్వజన శ్రేయోయోగంతో
భారతాత్మ వేస్తూ వచ్చిన ముందడుగు
ఎక్కడ ఆగిపోయిందో అక్కడికి!
ఆగష్టు ప్రజా విప్లవం
దాస్యవిమోచన మహావిప్లవం అయినచోటికి
స్వాతంత్ర్య చండభాస్కరుడు
మన సమదృష్టిని సంహరించిన చోటికి
స్మగ్లర్లు, హోర్డర్లు, కల్తీ విషపు పురుగులు
అధిక ధనాశాపరులు, కుల మతోన్మాదులు
పదవీ దురోదరులు ఇంకా పుట్టిపెరగని ఆనాడు
పవిత్ర భారత సమసమాజ నిర్మాణోద్యమం
ఎక్కడ ఆగిపోయిందో అక్కడికి
వెనుతిరిగి కదలండి!

దేశం ముందడుగు వెయ్యాలి
అవును, వెయ్యాలి!
అక్కడినుంచి వెయ్యాలి!
సర్వజన శ్రేయోరాజ్య నిర్మాణంకేసి
సర్వజన సుఖసంతోషాలలోకి వెయ్యాలి!
దేశం ముందడుగు వెయ్యాలి!
ఆ ఉగాదినుంచి వెయ్యాలి,
ప్రతి అడుగూ ఒక ఉగాదిగా వెయ్యాలి!

(1975 జాతీయ కవి సమ్మేళనం (ఢిల్లీ)లో తెలుగుకు ప్రాతినిధ్యం వహించిన కవిత)

20. అమ్మ వస్తున్నది చూడు

అమ్మ వస్తున్నది చూడు !
కాళ్ళకు నీళ్లు పెట్టు !
గోదావరి గుండెల్లో ఇంకి
మన బావిలో ఊరిన నీళ్ళు-
అంతర్వాహిని అయిన సరస్వతిని
అభిషేకించి తేరిన నీళ్ళు-
అలసివస్తున్న అమ్మపాదాలకు
ఆహ్లాదం కలిగిస్తే చాలు !

పాదాలు కడిగి-
పైట చెంగుతో ఒత్తి-

కళ్ల కద్దుకొంటావు కదూ ?
కంగారుపడి, మరచిపోయేవు !
దాహానికి ఏమిస్తున్నావ్ ?
మన గంగా బొండాల నీరేనా ?
ఆకాశ గంగ లంకలలోని
అమృత సరస్సులలో ఇంకి,
మన ఎలతోట తొలి బొండాలలో
ఊరిన పీయూషవారేనా ?

రసదాళి చెరుకు రసంతో-
లేత ముంజెల మధురాసవంతో-
హైదరాబాదు అనాబ్‌షాహీలను
విప్పకల్లులో పిసికి ఊడగట్టిన
తేటతెనుగు పానీయంతో-
వేప పువ్వు రేకలు కలిపిన
కొత్త బెల్లం పానకంతో-
గళాసులు నింపి ఉంచు !
గళం సవరించుకొని ఆహ్వానించు !
మిగిలింది తీర్థంగా పంచు !

ఆసనం ఎక్కడ వేశావ్ ?
మన గున్నమామిడి నీడలోనే కద ?
ఆ కోకిల గుంటడు
వీణ తెచ్చుకున్నాడో లేదో, చూడు !
పచ్చివగరు గొంతుకతో
ప్రాణం తీస్తుంటాడు వాడు !

దక్షిణాది గంధం తోటల నుంచి
వచ్చిన విసనకర్రల కుర్ర కుంకలు
అమ్మను వట్టి అమ్మమ్మ అనుకొని
తోక ఝాడిస్తారు, జాగ్రత్తపడు !

మళ్లీ అరవై ఏళ్ళకు
మనసుపడి వస్తున్నది అమ్మ !
నాకు రూపం ఇచ్చిన అమ్మ !
నీకు దీపం చూపిన అమ్మ !

విరోధికృత్తు అన్నారు అమ్మను !
ఎవరికి ఎవరు విరోధి ?
మనిషి తనకు తానే విరోధి !
ఆత్మీయులైన అన్నదమ్ములు
ఆస్తికోసం కొట్టుకు చస్తూ
అమ్మను నిందించి ఏం లాభం ?
తన దురాశా దుర్మార్గాల ఫలితాన్ని
ఏ పిల్లికో, బల్లికో అంటగట్టి—
ఆత్మవంచన చేసుకొంటాడు మనిషి !
అమ్మను ఆడిపోసుకుంటాడు కినిసి !
విషం మింగుతాడు చావాలని
విధిని నిందిస్తాడు చంపుతాడని !
అరవై ఏళ్లు !
రెండు తరాలు, మూడు యువతరాలు !
ఇన్నేళ్లూ ఎక్కడున్నదో అమ్మ ?
నా పూజా పుష్పాల వాలబతకమ్మ !

కాల ప్రభుత్వపు కేబినెట్టులో
అరవై మంది కల మంత్రిమండలిలో
నన్ను కన్న అమాత్య లలామ !
విరోధి కృన్నామ !

కాలతరంగడోలకు
బాలమాత హస్తఖేలగా,
జగద్వ్యాపార సమాసక్తికి
సమాసక్త పరాశక్తిగా,
పనుల్లో మునిగి ఉంటుంది !
పండుగలకు వస్తూంటుంది !
ఏ ద్వైధీ ప్రణయానంద హేలకు
ఏరసాద్వైత పారవశ్య లీలకు
రూపంగా ప్రాణం పోసిందో నాకు !

మేనక శకుంతలనులా నన్ను
లోకానికి వదిలేసి పోయిన అమ్మ
మళ్లీ అరవై ఏళ్ల తర్వాత
చూచి పోదామని వస్తున్నది, చూడు !
మొత్తం స్వాగత సాహిత్యానికే
సర్వమంగళ సమతా సౌహిత్యానికే
స్వరం కట్టి పాడు ! !

[1971 లోని విరోధికృత్తు ఉగాది. నా జన్మవత్సరం.
విజయవాడ ఆకాశవాణిలో ఆనాడు చదివాను.]

21. ప్రమాదం తప్పించిన ప్రమాదం

భాగ్యనగరంలో
ఒక విశాలమైన రోడ్డు,
ఏదో దీర్ఘంగా ఆలోచిస్తూ
మెల్లగా పోతున్నది కారు!

కారు ఎంత మెల్లగా నడిచినా
పరిగెత్తే ఎద్దుబండికంటె వేగతరమే!
కారుకు దారివ్వకుండా బండి మాత్రం
ఎడ్లపేగులు తెంచేస్తూవుంది!

కారు వేగాన్ని నిరోధించాలని
ఎందుకో బండికంత ప్రయాస!
పోనీలే అనుకొన్నట్టున్నది
అనాసక్తంగా పోతున్నది కారు!

బేరు మంటూ పడింది హఠాత్తుగా బ్రేకు,
పక్కకుపడిపోయిం దొక ఎమ్ములగూడు!
ముఖం ముందు సీటుకు గుద్దుకొని
తొంగిచూశాడు వెనక సీట్లోని రామం.

పెద్దప్రమాదమే తప్పింది!
హమ్మయ్య అనుకొన్నాడు రామం,
ఒళ్ళు దులుపుకొంటూ లేచి
పేవుమెంటెక్కింది ఎమ్ములగూడు!

అప్పటికే జనం
చుట్టుముట్టేశారు కారును,
ఇప్పుడు కారు తలరాత
జనంచేతిలో ఒక పిచ్చిగీత!

అంతవరకు ఎవరూ కనిపించరు,
ఎక్కడైనా ఏదైనా జరిగితే చాలు
చచ్చిన ఎలకచుట్టూ కాకుల్లా
వచ్చిపడతారు జనం వందల్లో!

విమర్శలు, విసుళ్ళు, తిట్లు-
కొందరు డ్రైవరుమీదకు పోతే
కొందరు ఓనరుమీదకు దూకారు!
కారు ఔచిత్యాన్నే ప్రశ్నించారు కొందరు!

"ఎద్దుబండికే తప్పుకోలేం కదా
కార్లెందుకయ్యా మనమధ్య" అంటూ
నిగ్గదీసి అడిగేశారు వాళ్ళు-
ప్రతివాడూ ఎదురైన ప్రతి మొగంమీదా!

వెట్టికి కర్మ క్రిందివాడైతే
ఆక్సిడెంటుకు కర్త పై వాడు.
న్యాయం చెప్పగల రోడ్డుకు నోరు లేదు,
నోరున్న జనానికి ఆలోచించే తీరు లేదు.

ఇదేదీ పట్టినట్టులేదు రామానికి
చూస్తున్నాడు ఆ ఎమ్కులగూడుకేసే!
ఎక్కడో చూచినట్టుంది అతడిని-
తా నెరిగిన ఎవరి పోలికలోవున్నె అతడిలో!

ప్రమాదం తీవ్రమయింది కాకపోయినా
ప్రమాదం ప్రమాదమే కనుక-
ఎమ్కులగూడు ఎంతడిగితే అంత
ఇచ్చిపోదా మనుకొంటున్నాడు రామం!

ఇంకా కారుకిందే పడివున్న తన ఊతకర్రను
చేతిలోకి తీసుకొని ఆ ఎమ్కులగూడు
"ఆగండ్రా! ఆగండి!" అన్నా డంతలో!
ఆశ్చర్యంలో మునిగిపోయింది అల్లరంతా!

"కారుకింద పడింది నేను,
పొరపాటు నాది, కారుది కాదు,

పోనియ్యండి దాన్ని'' అనేసి, ఆ పేదవాడు
నడక సాగించా డా పేవుమెంటుపై!

ఆశ్చర్యచకితుడే అయాడు రామం
పిట్టలే అయిపోయారు జనం
మెప్పుగా తల లూచినై చెట్లు,
బ్రతికా ననుకొంది మానవత!

కారెక్కి ంచుకొందా మనుకొన్నాడు రామం
ఏదైనా ఇద్దా మనుకొన్నాడు, కనీసం
అత డెవరో తెలుసుకొందా మనుకొన్నాడు,
ఏదీ సాధ్యం కాలేదు!

చప్పున జ్ఞాపకం వచ్చింది రామానికి
తన చిన్నప్పుడు తన పల్లెలో
తమ పక్కింటి కవ్వీసు
అచ్చం ఇలానే వుండేవాడు!

కారు ముందుకు సాగింది.
రామం మనస్సు వెనక్కు దూకింది!
అవును- తన పక్కింటి కవ్వీసు
తన నెంత ప్రేమగా చూసేవాడు!

తన పల్లె అంటే-
తనకో పల్లె ఉన్నదా?
అదే, సర్కారు పుంత!
పుంతలో హరిజనుల గుడిసెలు!

తమ గుడిసె ప్రక్కగుడిసె కవ్వీశుది
అత డొక్కడే వుండే వా డందులో,
అతడికితోడు ఒక తంబురా,
ఒక ముసలి కుక్క!

ఒకరికి లోబడివుండే తత్వం కా దతడిది,
తమ పేటవాళ్లంతా కూలీలుగానో
పాలేళ్లగానో బ్రతుకు లీడుస్తుంటే-అతడు
జంగం కథలు పాడుకుంటూ జీవించేవాడు!

చిన్నప్పటి జ్ఞాపకాలు-
మంచివైనా, చెడ్డవైనా
మనోహరంగానే వుంటై!
మధు వందిస్తూనే వుంటై!

తనకు తెలిసిన జానపద కథలన్నీ
కవ్వీశు చెప్పినవే!
అంటరానితనం కోరలనుంచి కూడ
ఎన్నోసార్లు కాపాడా డతడు తనను!

తన బాల్య మంతా వెండి తెరపైవలె
కళ్ళల్లోకి వచ్చి నిల్చింది రామానికి!
తాను పైచదువుల కని పట్నంపోయాడు,
కవ్వీశు ఏమైపోయాడో గుర్తులేదు!

ఆనాడు ఆ మురికిపేటలో
తా నొక పిరికి పిల్లవాడు,

ఈ నాడు ఈ భాగ్యనగరంలో
ప్రాభవ సంపన్నుడైన ఒక అధికారి.

మారాలి ఇక తాను
మరల్చాలి ఇక తన కారును,
కవీశు తన కిచ్చిన ఉగాది సందేశం
ఈ కారు ప్రమాదం!

మొన్ననే కదా తాను
తన సొంతూరు వెళ్ళివచ్చాడు?
ఇప్పుడు తమపేట
అప్పటి సర్కారు పుంతకాదు!

ప్రధానగ్రామం వీధుల్లో
తమపేట ఒక క్రొత్తవీధి!
ఆ నాటి నిరుపేద బక్కకూలీలు
ఈనాడు సొంత భూముల పక్కా రైతులు!

ఆ నాడు తమ పాదధూళిని
తన నుదురుతోకూడ తాక నివ్వని అరుగులు
మురుగులు తొడిగి మురిశాయంటే
ఎంతలో ఎంత మార్పు!

ఆర్ష హృదయం మళ్లీ స్పందిస్తున్నది,
భారతాత్మ మేల్కొంటున్నది,
నిరంతరదాస్యం కింద అణగారిపోయిన
ఉపనిష దంకురం ఉత్తేజిత మవుతున్నది!

కులం, వర్ణం, కలిమి, లేమి-
ఈ అనార్ష అవైదిక దుస్తంత్రం నుంచి
భారతీయుడు బయటపడుతున్నాడు!
సమ సమాజానికి పునాది వేస్తున్నాడు!

సంభవామి యుగేయుగే అంటే
ఇదేనేమో అనిపించింది రామానికి !
ఆ నాటి కవ్వీశేనా
ఈరోజున కారుక్రిందపడ్డ మాన్యమూర్తి?

దైహికంగా అతడే ఇతడు కాదు,
దైవికంగా అతడే ఇతడు !
దేహమాత్రోపజీవి కాగూడదు తాను ఇక !

భాగ్యనగరంలో
అదొక విశాలమైన రోడ్డు,
గతాన్ని భవిష్యత్తుతో ముడిపెట్టుకొంటూ
కదిలిపోసాగింది మెల్లగా రామం కారు.

కష్టాల పుట్టనుంచి పుట్టాడు తాను
భోగభాగ్యాలలో మునిగిపోదా మనుకొంటున్నాడు,
కారు ప్రమాదం రూపంలో వచ్చి
జీవిత ప్రమాదం నుంచే తప్పించింది కవ్వీశు స్ఫూర్తి!

తనపేట బాగుపడి వుండవచ్చు,
మురికిపేటల్లో తొంభై పాళ్లు
ఎక్కడివక్కడే పడివున్నై ఇంకా !
వాటి ఉద్ధరణకు పూనుకోవా లిక తాను !

22. ఉగాది చేదు

నలనామ నవ నవోదయ
నలినాలయ వచ్చి నిల్చినది గుమ్మములో !
చెలి! పిల్చి, సహృదయుల గుం
దెలు నింద, ఉగాది పచ్చడిని పంచగదే !

కొత్త బెల్లపు రుచులతో మత్తుగూర్చి
ఎంత చేదైనగాని మింగించవచ్చు,
శివుడు కాగల్గు నెవ్వడు చేదు తినక?
అమృత మన నేమి? జీర్ణమౌనట్టి విషమె!

ఇది యమర్జంసీ యుగం కనుక
యమ అర్జెంసీతో చేసెయ్యాలి ఏ పనైనా?
నిజానికి-భగవంతు డెత్తిన ప్రతి అవతారమూ
ఒక్కొక్క ఎమర్జంసీయే కాదా?

పెరుగలేక నశిరిపోయేవాడు భగవంతుడు,
పెరికే పారెయ్యాలి నీ విప్పుడు ముళ్ళదొంకల్ని
మన సంస్కృతీ సీత మళ్ళీ ఒక మాయ లేడికి
బలి కాకుండా ఉండా లంటే!

స్మగ్లరో, హోర్డరో, బ్లేకుమార్కెటీరో,
లంచగొండియో, కులతత్వ వంచకుండో,
కంటకు దొకొక్క దొకొక లంకాధిపుండు!
పుండు మాననిచో శస్త్ర ముందు కాదే?

దేవతల పేర్లతో తమ దేవె నోర్లు
నింపుకొను రాహువులు పంక్తి నిండ కలరు,
కనుగలిగి యేలుకొమ్ము! చక్రమును చేత
నుంచుకొను మెప్పు హక్కులు పంచునపుడు!

మిగులు భూమిని సమంగా పంచాలి,
హుళక్కి భూమికి ప్రచారం పట్టాలివ్వడం మానాలి.
గ్రామం మధ్యలో హరిజనులకు ఇళ్ళు కట్టాలి,
ప్రత్యేక కుల కాలనీలను రద్దు చెయ్యాలి!

జాతిని విచ్ఛిన్నంచేసే తుచ్ఛతను నిర్మూలించేదాకా
సర్వసమత్వవైదిక పోషలిజాన్ని నెలకొల్పేదాకా
ఈ ప్రగతీశ్వరాంశిని ఉపసంహరించకు!
నలనామను అనల ధూమ కానివ్వకు!

23. సమర గీత

సత్యం వద, ధర్మం చర—
పాపాయ పరపీడనం—
ఆత్మ వ త్సర్వ భూతాని—
ఓం శాంతి, శాంతి, శాంతి—

ఇలాంటి నీతులూ, నినాదాలూ, లక్ష్యాలూ
తెలియకనా మనిషి దుష్టు డవుతున్నది ?
సుమతీ శతకం పద్యం ఒక్కటి చాలదా
ఆచరిస్తే అమృతం పొందడానికి ?

నిరంతరం శాంతి జపం చేసే ఈ ఆర్ష సమాజం
ఆక్రాంతం అశాంతిలో మునుగుతున్న దెందుకు ?
స్వార్థాలకు కళ్ళాలు పెట్టలేక !
అర్థకామాలకు అంకుశాలు పట్టలేక !

బిడ్డలు పసివాళ్ళూ, నిరాయుధులూ అయివుండి
దున్నలు ఊబిచిమ్ముతూ పైబడుతున్నప్పుడు
తల్లి మహాలక్ష్మి అయినా
బరిసెగొని బరి మీదకు రాక తప్పదు !

కించి దావేశమున పరికించిచూడు
వేదయుగముల నుండియు విశ్వచరిత !
మనుజ ప్రకృతికి చీడ పట్టినపు డెల్ల
ఆదుకొన గల్గినది చక్రమేదొ కాదె ?

రాక్షస స్వార్థ నిశితదంష్ట్రిలకు చిక్కి
మానవతయె నశించు ప్రమాదమందు
తనకు కానట్టు లూరకుండు నదె ప్రభుత?
శాంతి సౌఖ్యమ్ములకు నేత సమరగీత !

స్మగ్లరో, హోర్డరో, బ్లేకు మార్కెటీరో—
కంటకు డొకొక్క—డొకొక లంకాధిపుండు !
పుండు మానని చో, శస్త్రముండు, సాధ
న మ్మదే దైన దుష్ట నాశమ్ము వలయు !

భగవంతుని ఒక్కొక్క అవతారం
మానవచరిత్రలో ఒక్కొక్క ఎమర్జన్సీ !
ముళ్ల డొంకల్ని పెరకడం సాధ్యం కానప్పుడు
నరికి పారేసి పోయాడు భగవానుడు !

మరి — ఈనాటి ఎమర్జెంసీ ?
నరకుల పాలిటి నారీతాంక్రతే కాదు
హరిజనత కన్నుల్లో ఆశారుణ కిరణం !
బహుజనత బ్రతుకుల్లో ప్రగతి సుధారథం !

సంభవామి యుగే యుగే చదువు కాదు,
సత్కారామి క్షణ క్షణే చర్యవలయు !
సమరవేగాంశి యీ ఎమర్జన్సి కాదె
మలుపు మలుపున వెలుగిచ్చె మానవునకు ?

ఖలుల, నరపీడకుల పాత కంపు డొక్క
చీల్చి, డోలు కట్టిన ఎమర్జెంసి మనది,
ద్రోహమును, దుర్వ్యవస్థను ద్రుంచు ఝూంసి !
ఈ ఎమర్జెంసి నవ్యార్షకే విరించి !

24. భిక్షుక జాతి

"కొంచెం పెన్ను ఇస్తావా, వ్రాసుకొనిస్తాను?"
పాపం, వ్రాసేవాడికి పెన్ను లేదు !

"కొంచెం దువ్వెన ఇస్తావా, దువ్వుకొనిస్తాను?"
పాపం, తలున్నవాడికి సంస్కారం లేదు !

"కొంచెం అద్దం ఇస్తావా, ముఖం చూచుకొనిస్తాను?"
పాపం, అద్దం లేకపోతే ముఖముండి ఏం లాభం !

"కొంచెం పత్రిక ఇస్తావా, చదివిస్తాను?"
పాపం, చదువుకొన్నవా డెంత దరిద్రుడు!

"కొంచెం పొలం ఇస్తావా, పండించుకొనిస్తాను?"
పాపం దున్నేవాడిదే భూమి ఎన్నడవుద్దో!

అతడు ఆదిభిక్షువు కులంవాడు
ఆ త్రివిక్రముడి వంశంవాడు
అన్న సత్యం గుర్తుకు వచ్చి-
చేతులు మోడ్చి అన్నాను-

"నీకు కావలసిన సమస్త సౌకర్యాలూ
నేను సమకూర్చి పెడతాను, భిక్షూ !
నీవు పోయి ఆ పంచను కూర్చో" అని!

అవును-నిజం
అతడు ఈ మొత్తం జాతికి ప్రతినిధి,
ముష్టెత్తుకోవడం అతడి జన్మహక్కు-!
ఈ జాతినంతా మేపడం నా కర్తవ్యం,
నేను మట్టినుంచి మధువును పిండే కార్మికుణ్ణి!

25. ధర ధరలైన సంతలో

ఎన్నో వున్నై!
వెలుగే లేదు!
అరవై కోట్ల సరుకు,
అవసరానికొకటీ కనిపించదు,
అంతా వుంది-
వెలుగే లేదు!

ధరపై ఏమీ లేనట్టుంది!
నిజానికి ధరెక్కడుంది?
ధర బహువచనమై, ధరలై,
వినువీధుల్లో విహరిస్తోంది!
మట్టి, ఇక్కడేముంది?

ఇది వట్టి సంత!
సంతగోల తప్ప, సరసమైన దేదీ లే దిక్కడ!
కళా లేదు, కాంతీ లేదు;
పూర్వం ఎంతోవుండేది,
అంతా అందరికీ దొరికేది
నా వాళ్లకే కాదు
నానా జాతులకూ అందేది!

అదిగో, ఏదో శాల్తీ ఇటు వస్తున్నది!
కాదు, అటు పోతున్నది!
అది మానవుడా? అతడి నీడా?
ఆ చేతులోది కూడా ఖాళీ సంచీయే!
సంతలో ఏవో వున్నట్లేవుంది కాని యేంలాభం?
సంచీ దాకా రావడంలేదు!
వెతుక్కొందా మంటే-
వెలుగు లేదు!

ఎక్కడికోయ్, బాబూ?
ఎక్కడికి పోతున్నావ్?
ఎక్కడికి? ఎక్కడి నుంచి?
గమ్యం ఏది? ఎంత దూరం?

బందరు నుంచి బైలుదేరి
భాగ్యలక్ష్మి మందిరంకేసి పోతున్నావా?

అయ్యో, మోసపోయావయ్యా, ఆలస్యం చేశావు!
నీవుపోతున్న లక్ష్మీమందిరం బ్రతికి లేదు,
ఇప్పు డది కేవలం ఒక మమ్మీ!

ఆగవయ్యా, ఆగు!
ఆగి ఆలోచించు!
ఎక్కడ బైలుదేరావో-
ఎప్పుడు బైలుదేరావో-

నీవు తెచ్చుకొన్న తిండి పొట్లాలైపోయినై,
విస్తరాకులుకూడా నాకేసి నమిలేశావ్!
కుక్కలు కూడా నీ వెంటరావు
కాకులుకూడా నీకు తోడులేవు!

అదేమిటి?
జేబుల నిండా, బేగ్గుల నిండా,
సూట్ కేసులనిండా
ఏమిటి నింపుకొచ్చావ్?
రాళ్ళా? రత్నాలా? నోట్లా? వోట్లా?

నీ వెటు పోతున్నావో గుర్తుందా?
నీ ముందున్నదేమిటో గుర్తించావా?
చీకటి! ఇంతకంటే కటిక చీకటి!
కీకారణ్యం! మానవ మృగశాల!

అక్కడుండేది దొంగలో, దయ్యాలో,
పాడు గుడుల్లోని ఆకటి దేవతలో!
బియ్యం దుకాణంలోని బొజ్జ దొరలో!
నీ రాళ్ళకు విలువకట్టేది వాళ్ళే!
నీ వోట్లతో ప్రభువులయ్యేదీ వాళ్ళే!

వద్దు బాబు, వద్దు! నా మాట విను!
అటు పారెయ్ ఆ రాళ్ళను!
ఇటు మళ్ళు ఈ నాకేసి!
కూర్చో కాసేపు ఈ మామిడి నీడలో!

"నీ వెవరి వమ్మా," అంటున్నావా?
నేను దిక్కుమాలిన తెలుగు తల్లిని,
భద్రతలేని భరతమాతను,
ఆశతో సంతకు వచ్చి
అన్నీ వుండీ ఏమీ కనిపించక
నిరాశతో నీరసించిపోతున్నదాన్ని!
ఎటు వచ్చానో—
ఎటు పోవాలో—
అంతా చీకటి!
సంత గోల!
వెలుగైనా దొరుకుతుందేమో
వెదదాం ఈ ఉగాదిలోకి!

26. ప్లస్సు – మైనస్సు

దేశంలో ఆహారోత్పత్తులు పెరిగాయి,
వాటిని తినే నోళ్లూ పెరిగాయి;
ఉద్యోగుల జీతభత్యాలు పెరిగాయి,
బజార్లో ధరలూ పెరిగాయి!

పాఠశాలల్లో పనిగంటలు పెరిగాయి,
ఉదయం షిప్టు క్లాసుల్లోనే నిద్రపోతున్నది,
సాయంత్రం షిప్టు ఆ చీకట్లో
ఎటు పోతున్నదో దానికే తెలియదు!

ఇక్కడ మున్నేరుపై ఒక ఆనకట్ట మొలిచింది
అక్కడ గోదావరి ఆనకట్టకు గండిపడింది!
సకాల వర్షాలకు చక్కగా పండాయి చేలు
అంతలో తుపానుకొట్టి అయిందంతా గంగపాలు!

పేద రైతులకు పట్టా లొచ్చేసినై
భూములే కనిపించలేదు!
జగత్తంతకూ జాతీయ సమైక్యం,
హరిజనులు మాత్రమే ఊరికి దూరం!

విజ్ఞానం రాకె ట్లెక్కి
వినువీధుల్లో విహరిస్తున్నది,
మూఢత్వం మురికి మూలల్లో
మోసం కాళ్ళకు మొక్కుతున్నది!

పరిశ్రమలు పెరిగాయి
పదవులూ, ఉద్యోగాలూ పెరిగాయి
ఫైళ్లూ, పైరవీలూ పెరిగాయి
పనిలేనివాళ్ళ జాబితాలూ పెరిగాయి!

ఇరవై సూత్రాల ఇంద్రధనస్సును చేతబట్టి
ప్రగతి రథం ఉరికింది ముందుకు,
అది ఏ దేవుడి రథమూ కాదే అని
వెర్రిగా నిలబడిపోయాడు సామాన్యుడు!

ప్లస్ గుర్తు ఎంత పెద్దగా పెరిగితే
అంత పెద్దగాను పెరుగుతున్నది మైనస్!
ప్లస్సూ, మైనస్సూ సమఉజ్జీ అయితే
ఏ దేశాభ్యుదయ మైనా గొంగళే!

సామాన్యుడు చైతన్యవంతుడు కాకపోతే
గంగకూడ మురికి కాల్వే,
జాతికి సైంటిఫిక్ టెంపర్ రాకపోతే
ఉగాది కూడ అంధయుగమే!

27. పిట్ట గూళ్ళు ఈ మెదళ్ళు

ఏ మనిషీ ఒకేసారి పుట్టడు
క్రమం క్రమంగా పుడతాడు.
ఒకేసారి చావడు
మెల్ల మెల్ల గా చస్తాడు.
ప్రకృతిలో ఏ లవాన్ని పరిశీలించినా
ఈ సృష్టి రహస్యం విదిత మవుతుంది!

2

మానవ జీవితాన్నే పరిశీలించు!
పుట్టుకతో వచ్చిన అనేకం
చచ్చేవరకూ వుండవు!
మధ్యలో వచ్చే కొన్ని
మధ్యలోనే పోతై కూడః
ఆ వృద్ధుణ్ని చూడు!
ఇంద్రియాలు ఏ నాడో పని మానుకున్నై
మెదడు మూలబడింది

ప్రాణం శుష్కించింది
మిగిలివున్న దేమిటి?
పోయిన తొంభై శాతం ఏమయింది?
మిగిలిన పదిశాతం ఏ మవుద్ది?

౩

నూనె తరిగే కొలదీ
కాంతి క్షీణిస్తుంది,
శక్తి సరఫరాను బట్టి
జీవితం వికసిస్తూ, శుష్కిస్తూ వుంటుంది,
కోమాలో మనస్సు వున్నదా?
అపస్మారంలో ఆత్మ వున్నదా?
ఆశ, ఆత్మీయత ఏవి?
డబ్బై యేళ్ళకు బాల్యం గుర్తులేదు
ఎనభై నాటికి యౌవనం జ్ఞప్తిలేదు
తొంభైకి తా నెవరో తెలియదు
ఇది సామాన్యుడి జీవిత క్రమం
మరి, పునర్జన్మ అవకాశం ఏది?

4

పునర్జన్మ సిద్ధాంతం తప్పుడిది
కర్మ సిద్ధాంతం మోసగాళ్ళది
చచ్చిన తర్వాత ఏం జరుగుతుందో
బ్రతికున్నవాళ్ళకు ఏం తెలుస్తుంది?
జీవం క్రమంగా వికసిస్తుంది,
క్రమక్రమంగా క్షీణిస్తుంది,
అదే జీవం మళ్ళీ ఎలా పుడుతుంది?
క్రమంగా ఎండిపోయిన చెరువు
అదే నీటితో మళ్ళీ ఎలా నిండుతుంది!

5

నమ్మకు, ప్రియా!
దేనినీ మూర్ఖంగా నమ్మెయ్యకు!
ఏ మనిషీ సర్వజ్ఞుడు కాదు!
ప్రతి మనిషికీ స్వార్థం వుంది.
యౌవనంలో కామమే పరమార్థ మను కొన్నవాడు
అది చచ్చిపోయిన చాల కాలానికి చచ్చిపోతే
పునర్జన్మ ఎత్తేది ఏది?
మానవుడు అనేక శక్తుల సమాహారం,
ప్రతి శక్తీ దేని కదే స్వతంత్రం;
ఏదీ కర్మకు నిబద్ధం కాదు
ప్రతి కర్మా సాపేక్షం, స్వతంత్రం కాదు.

6

ప్రపంచంలో పరస్పర విరుద్ధాలైన ఇన్ని మతాలు
పరస్పరం కొరుక్కొంటూ, నరుక్కొంటూ కూడ
ఎందుకు బ్రతికిఉంటున్నాయో తెలుసా?
అన్నీ సత్యమే ప్రకటిస్తున్నాయి కనుక!
ఏమిటా సత్యం?
తమ కేమీ తెలియ దన్న సత్యం!
చచ్చిన తర్వాత ఏం జరుగుతుందో
బ్రతికున్నవా ళ్లెవరూ ఊహించలే రన్న సత్యం!
భగవంతు డొక్కడే జగత్పిత అంటూనే
అతడికి ప్రియతమ వారసుణ్ణి నేనే అంటూ
ప్రతి ప్రవక్తా కరవాలం ఝళిపిస్తాడు కనుక!
ప్రతి ఉన్మాదీ మత యుద్ధాలు నడుపుతాడు కనుక!
భగవంతుడి సమాధిపై ఆధిపత్యం కోసం
అన్ని మతాలూ చావడానికైనా సిద్ధపడి
ఒకదానిపై ఒకటి మోహరించి వున్నై కనుక!

7

మన కాలంలో మన అనుభవంలోని
ఒక వాస్తవాన్ని పరిశీలించి చూడు!
జాతిపిత గాంధీమహాత్ముడు తెలుసు కదా?
అతణ్ని జాతిపితగా, మహాత్ముడిగా,
అహింసాయోధుడిగా, సత్యాగ్రహ ప్రవక్తగా,
రవి అస్తమించని మహాసామ్రాజ్యాన్ని ఓడించిన
భారత దాస్య విమోచకుడిగా,
అంతవరకూ పూజించిన జాతి
స్వాతంత్ర్యం వచ్చిన మరుక్షణమే
అతణ్నీ, అతని సిద్ధాంతాల్నీ, కార్యక్రమాల్నీ
ఒక్క దెబ్బతో కాల్చి చంపివేసింది!
అందరు ప్రవక్తలూ అలా
అనుచరుల చేతుల్లో చచ్చిపోయినవాళ్లే!
వాళ్ళ పేర్లతో మిగిలివున్న మతాలు
వట్టి మమ్మీలు, నిలవ శవాలు!

8

తెలీదు, తెలీదు, తెలీదు—
జీవితం గురించి
దాని పూర్వాపరాలను గురించి
ఎవరికీ ఏమీ తెలియదు.
తన కేమీ తెలియ దని తెలుసుకొన్నవాడు జ్ఞాని,
అట్టి జ్ఞానంతో వ్యాపారం చేసుకొన్నవాడు ప్రవక్త!
అట్టి ప్రవచనాల గుత్తవ్యాపారానికి
బ్రాంచి మేనేజర్లు, ఏజెంట్లు నాయకులు!
ఈ రహస్యం తెలియనివాళ్ళు,
దానికి దూరంగా ఉంచబడినవాళ్లు,

తమ మార్కెట్టు సరుకే అసలు సరుకని
పెత్తందార్లచే బ్రెయిన్ వాష్ చెయ్యబడ్డవాళ్లు,
కాదన్నవాళ్ళని తన్నా లన్న ఉద్రేక విషం
రక్తం నిండా ఎక్కించబడ్డవాళ్లు ప్రజలు,
ఆ ముఠా సొంత ప్రజలు !
ఎంత ఖరీదైనా పెట్టి
అ దెంత నాసిసరుకైనా,అదే అమూల్య మనుకొంటూ,
దాన్నే కొనుక్కొని బ్రతికే కష్టమర్లు !
వట్టి మందలు !

9

ఏ మంద కా మందే స్వతంత్రం!
ప్రతి మందా తన కామందుకు బానిస !
ఏ మందలో పుట్టిన ప్రాణికి
ఆ మంద నియమావళి శిరోధార్యం !
మరో మందను గురించి తెలియదు !
మరో మంద తనకు జన్మశత్రువు !
రెండు మతాల మధ్య శత్రుత్వం
రెండు గుత్తవ్యాపార సంస్థల మధ్య పోటీ!
అంతే, అంతకన్న ఏం లేదు!
అంతకన్న ఎక్కువ ఎవడికీ ఏమీ తెలీదు!
అందుకే, దేవీ!
ఈ లోకంలో దేన్నీ గుర్తించకు !
అందరూ మనలాంటి మనుషులే !
అందరూ చచ్చి స్వర్గానికి పోయేవాళ్లే !

10

"స్వర్గానికా ?
మళ్లీ, అదేమిటి?" అంటున్నావా?

భయపడకు, అదొక సామెత.
చచ్చి స్వర్గానికి పోవడం ఒక లక్ష్యం,
మోక్షం మానవుడి ఒక పరమోహ,
ఆశ మానవుడి దైనందిన జీవితం!
అవి మూడే మత వ్యాపారానికి ముడిసరుకులు
జీవితం, స్వర్గం, మోక్షం!
ఈ మూటి గురించీ తెలియా లంటే
భవిష్యత్తు తెలియాలి,
అ దెవరికీ తెలియదు.
గతాన్ని బట్టి భవిష్యత్తును ఊహించవచ్చు,
ఊహ మెదడు సామర్థ్యం తోడిది.
మెదడు బల్బు ఎంత శక్తివంత మైతే
అంత విశాలంగా, విపులంగా,
నిశితంగా, సూక్ష్మంగా ఊహించగలదు.
మానవుడి అజ్ఞానాన్ని తెలుసుకొన్న జ్ఞాని
దేశ కాలాల పరిజ్ఞానం కల విజ్ఞాని
ప్రతి మనిషి మనస్సుకూ అనుకూలంగా
తన మనస్సును పోనివ్వగలడు
ప్రతి మనిషికీ భవిష్యత్తును నిరూపించగలడు
ప్రతి మనిషికీ స్వర్గమోక్షాలను అందివ్వగలడు!
మనిషి కతడే మహాప్రవక్త,
భవ సాగర తరణి, భగవంతుని అవతారం!

11

మతాలను, వాళ్ళ స్వర్గనరకాలను వదిలెయ్,
అవన్నీ వట్టి భ్రాంతులు.
మరి, ఈ సృష్టి సంగతి ఏమిటి?

ఈ జనన మరణాలు, హాని వృద్ధులు
గ్రహతారాదుల తిరుగుళ్ళు
ఋతు రాగాలు, రాగ ద్వేష భావోద్రేకాలు,
ఇదంతా ఏమిటి? ఎందుకు జరుగుతున్నది?
ఎవరికీ ఏమీ తెలియదు !
తెలియదంటే చాలా ?
అజ్ఞాన ప్రకటనే అన్నిటికీ జవాబా ?
దేవుడి మాట ఇక్కడే వద్దు,
ఉన్నా దనడానికి ఎంత ఋజు వుందో
లే దనడానికి అంతే ఋజు వుంది!
ఈ మన జీవలోకం వున్నట్టే
అవకాశంలో అనేక ఇతర లోకా లుండవచ్చుగా?
నేను పుట్టకముందు ఎవర్ని?
చచ్చిన తర్వాత ఏ మవుతాను?
భౌతికేతర పరాపర లోకానీకంలో
ఏదో లోకానికి చెందివున్న వాణ్నేమో!
అన్ని లోకాలనూ దర్శిస్తూ వుండి,
ఈ లోకానికి కూడ వచ్చిపోతున్న వాణ్నేమో!
ఎందుకు కాగూడదు?

12

నీవు కూడ నా వెంటపడి
పూవును తావిలా అనుసరించి వస్తున్నానో యేమో!
పూవును తావిలా, కోకిలను పాటలా,
మబ్బును మెరుపులా, సూర్యుని కాంతిలా,
కాకపోతే– కాకరకాయను చేదులా,
గులాబీని ముల్లులా అనుకో!

ఈ అనంత సృష్టి క్రమంలో
ఏ జీవి బ్రతుకైనా పరిమితం,
క్షణమాత్రం, అణుమాత్రం!
అందుకే - నే ననుకొంటాను—
ఒకే అవకాశంలో, తెరలు తెరలుగా
ఒకే చోట ప్రవర్తిల్లుతున్న
అనేకానేక సూక్ష్మ లోకాలలో
ఈ మన భౌతిక జీవలోకం ఒకటేమో నని!
ఈ లోకంలో ప్రతి జీవీ
తాత్కాలిక విరామం కోసం
తలుపు తెరచుకొని వచ్చి
తలుపు మూసుకొని పోతున్న-
ఒక వినోద పర్యాటక వ్యక్తే నేమో అని!
ఎవరికీ తెలియదు కనుక-
నాకూ తెలియదు!
ఎవరికైనా తెలిస్తే
నాకు అంతకంటె ఎక్కువ తెలుసు!
నేను ఆత్మగా రూపొంది
పరిమితుణ్నై పోయాను,
ఈ పరిమిత పరిధి పోగానే
మళ్ళీ అపరిమిత పరమాత్మనే అవుతాను,
అయితే, ఆత్మకంటె పరమాత్మ
ఎక్కువ క్రియాత్మకశక్తి కలిగినట్టిదా?
జాగృతి కంటె స్వప్నం
స్వప్నం కంటె సుషుప్తి
ఎక్కువ శక్తిమంతాలు కావు,

మనకు తెలిసిన సత్యం ఇది !
ఆత్మ మంచుగడ్డ
పరమాత్మ ఆవిరి
నడుమ నీరావస్థ ఏమిటి?
నారాయణుడా?
ఆవిరి కూడ అంతిమత కాదు!
పరమాత్మకు పై దేమిటి?
బ్రహ్మం!
అవాఙ్మానస గోచరం
ఆద్యంత రహితం
సచ్చిదానంద రూపం
నామరూప రహితం
అ ఏదో!

18

అందుకే, చూడు ఈ వసంతోదయాన్ని!
పరిశీలించు దీని ప్రవేశ నిష్క్రమణలను!
నీ చూపులు బాల సమీరాలుగా
నీ ఆలోచనలు పరిమళించనీ!
ఎవడి విశ్వాసం వాడి దైవం
ఒకటి సమాధి మరొకడి దేవాలయం
విశ్రమించనీ ఎవడి గూట్లో వాణ్ని
అదే ఆతడి స్వర్గం!
ఈ మెదళ్లన్నీ పిట్ట గూళ్లే,
దేని గూడు దానిది!
కానీ మన గూడు
ఈ వసంతోదయ కలశోదధి!

28. ఆనంద నామ

పేరు బియ్యం
సరుకు తెల్లరాళ్ళు,
పేరు సాంబారు పొడి
పొట్లం గుర్రపు లద్దె!
ఇది ఈయుగ ధర్మం-
మా దేశపు మగసిరి!
నీ పేరు-
ఆనంద కదూ. ఉగాదీ?
ఊరికే అడిగాను-
ఉలిక్కి పడకు!

పుట్టి పద్దెనిమి దేళ్లైనా
ఓ న మా లకే నోచుకోని నా కోసం
ఇంత కాలానికి నీ వైనా
తెచ్చావొక పలకా, బలపం!
ఆనంద నామ ఉగాదే
ఆంధ్ర భాషకు నవశకాది చేశావు!
ఇంతకన్న మాకేం కావాలి?
ఇదే నీకు స్వాగతం!
అ దేమి టలా వున్నావు!
కళ్ళు ఎర్రబడ్డా యేం?
కాళ్ళనిండా ఆ నెత్తు రేమిటి?
తెలుగు రాజధాని వీధుల్లో
తెలుగుతనం కోసం వెతికి వుంటావు!
తెలుగే కనపడక ఏడ్చివుంటావు?
అవునా?
అరవై ఏళ్ళకోసారి వచ్చే
నీకే అలా వుంటే-
ఎప్పుడూ ఇక్కడే పడివచ్చే
నా కెలా వుంటుంది చెప్పు?
ఇప్పు డెంతో నయం
అదృష్టవంతురాలివి నువ్వు!
ఈ పద్దెనిమి దేళ్లూ
రాజకీయాల రాత్రే తప్ప
పాడిపంటల పగ లెక్కడిది నాకు?
పాపం, ప్రమాదీచ పోతూ పోతూ
తెలుగుతనం రూపుకట్టిన ఓ ముఖ్యమంత్రిని

ఇచ్చి పోయింది కాబట్టి
ఈ వాకిట్లో
ఈ మాత్రం ముగ్గులైనా కనిపిస్తున్నై!
పిచ్చితల్లి ప్రమాదీచకు
కన్నీటితో వీడ్కోలిచ్చానందుకే!
ఏ ఉగాది అయినా ఒకటే నాకు!
కన్నూ చెవీ పనిచెయ్యని ప్రజాస్వామికంలో
ఎన్నికల మేనిఫెస్టోలా
ఆర్భాటంగా వస్తుంది!
అనామకంగా పోతుంది!
మరి- నీవు-
నీవూ అలానే
ప్రజల మధ్యకు వచ్చావు!
నీ ఎదుట వున్నది కురుక్షేత్రం
నక్క వున్నది రాక్షస వర్గం!
గతం సుఖాంత మయింది
భవిష్యత్తు భయంకరంగా వుంది!
అధిక ధరల, విషపు కత్తీల,
కులమత ద్వేషాల, కుక్షింభర రాజకీయాల,
ఆకలి మంటల, అరణ్యరోదనాల
అంధకాసురుల్ని ఎలా తుంచుతావో!
ఆనంద సుధను ప్రజల కెలా పంచుతావో!
తెలుగు బిడ్డవు నీవు
తెలుగు తల్లివి నీవు-
నిత్యానంద వసంత వైభవంతో
తెలుగుజాతిని కలకాలం పాలించు!

29. ఎవరు జగజ్జనని

జగజ్జనని భవాని–
ఆమెకు సొంత పిల్లలు లేరు!
విశ్వజన హృదయేందిర ఇందిర–
ఆమెకు సొంత బిడ్డలు లేరు!
సర్వజీవ జీవనవతి సరస్వతి–
ఆమెకు సొంత సంతానం లేదు!

అమ్మలగన్న అమ్మకు
ఈ ముగురమ్మల మూలపు టమ్మకు
చాల పెద్దమ్మకు– కూడ
నా అనే ఒక అమ్మాడైనా లేదు!

సొంత పిల్ల లుంటే–
తల్లిదండ్రుల్నే సంతలో అమ్మేస్తారు
అనే సత్యం ముందే తెలుసుకొని కాబోలు
మన త్రిమూర్తుల్లో ఒక్కడూ
కనుక్కోలేదు ఒక్క కొడుకునీ!

ఎందుకని?
చేతగాకనా?
శక్తి లేకనా?
ఉన్న పుష్టి అంతా
ఆఫీసు ఫైళ్ళలోనే
కారిపోవడం వల్లనా?

అపచారం ఉపశమించుగాక!
త్రిమూర్తులు, త్రిశక్తులు అంటే
జగజ్జనకులు, జగజ్జననులు!

తమకు సొంత మనే దేమైనా వాళ్లకు వుంటే
తక్కిన దంతా మరెవరి దౌతుంది?
ఒక్క కొడుకున్న దేవు డైనా
విశ్వజనకుడు కాలేడు!
ఒక్క కూతురున్న దేవత అయినా
విశ్వజనని కాజాలదు!
అందుకే—
సొంతం అనేది వున్నవా డెవడూ
భగవంతుడు కాలేడు!
ఈ రహస్యం తెలియని ధరణి
ఇచ్చ వచ్చిన ట్లిల్లా కనిపారేసి,
అక్షరాలా కని పారేసి
వాళ్లగతికి వాళ్లని వదిలెయ్యడం వల్ల
భూభారం పెరిగిపోయింది!
ధర్మగ్లాని ఏర్పడింది!
పాల సముద్రంలో ఉయ్యాల పాన్పుపై
హాయిగా నిద్రపోయే భగవంతుడు
యుగ యుగానికీ ఉలిక్కిపడవలసి వచ్చింది
నానా అవతారాలూ ఎత్తవలసి వచ్చింది!
ఏ నియమ నియంత్రణలూ లేకుండా
కనీసం నిరోధులు, విరోధులూ కూడా లేకుండా
ధరణి కని పారేసిన భూభారాన్ని
తగ్గించడానికి ఆ భగవంతుడు
ఎన్ని పుట్టుకలు పుట్టాడో
ఎన్ని చావులు చచ్చాడో
మనందరికీ తెలుసు!

ఎందరు మరిడమ్మలు!
ఎందరు మహా మారులు!
ఎన్ని భూకంపాలు
ఎన్ని తుఫానులు, ఉప్పెనలు
ఎన్ని ఊషరక్షేత్రాలు
ఎన్ని కురుక్షేత్రాలు!

భగవంతుడితో పోటీపడి
మానవుడు విజృంభిస్తున్న ఈ రోజుల్లో
ఈ భూభారానికి పరిష్కారం ఎలా?
ధరణీ! ఓ ధరణీ!
నీవు కనడం తగ్గించుకుంటావా?
నీ సంతాన భారంతో నీవే
కుప్పగా కూలిపోతావా?
ఆలోచించుకో, ధరణీ!
నీకు సాయం చెయ్యలేడు ఏ కరణీ!

బలవంతుడే రా జనేది
భగవంతుడి శాసనమా!
మానవుడే భగవంతుడైనప్పుడు
మా నాభిమానాలే జీవాత్మలవుతై!
బానిసగా బతకడం కంటె
యజమానిగా చావడం మంచిది!
పందిలా పదిమంది బానిస లెందుకు కంటావ్?
స్వసంతానాన్ని తగ్గించుకో!
సార్వజనిక జగన్మాతవుకా!
నీ కడుపున పుట్టితేనేనా నీ బిడ్డలు?
లోకం సమస్తం నీ సంతానమే కాదా?

30. కాలయుక్తి - సాలశక్తి

ఇది వైకుంఠము, వెంకటేశ్వరుడు ల
క్ష్మి తుండు కొల్వుండుటన్
ఇది కైలాసము, మల్లికార్జునుడు ఆ
ర్యేతుండు చెల్వొందుటన్
ఇది బ్రహ్మోర్వి, సరస్వతీ చరణ పం
కే జాతమై యుండుటన్
ఇది మా ఆంధ్రము, నీకు పీఠము, త్రిశ
క్తీ! పూజ గైకోగదే!

వాణియ తీరవాటిక, భ
వానియె రాయలసీమ, శ్రీ తెలం
గాణము; పూర్ణ రాజ్య రమ
గా, ముగు రమ్మల మూర్తి దాల్చి, గీ
ర్వాణ పథమ్మునన్ గదలి
వచ్చితి; వేలుకొనంగదే ఇకన్
ప్రాణము లొచు మా తెలుగు
పాలు జగత్ స్థితి కాత్మలై తగన్!

పింగళ పోతూ పోతూ
ఇంత నెత్తురు ముఖాన కొట్టిపోయింది,
కాళయుక్తి వస్తూ వస్తూ

కాళానుయుక్తితో
ముఖం కడిగి ముద్దులు కురిపించింది.
ఇది మామిడే కాదు, మర్రి కూడా అని నిరూపించింది.

స్వాగతమోయి వసంతా!
స్వామీ, వసంతా!
స్వాగతమోయి వసంతా!
సుందర సురభిళ సరస వసంతా
సుమనో వికస న్నిఖిల దిగంతా
సారాసార సమాన రసోదయ
సర్వశ్రేయో భాస్వంతా! ॥స్వా॥

మావి కొమ్మ, మల్లె కొమ్మ
వేప కొమ్మ, విప్ప కొమ్మ
ఏ కొమ్మను చూచినా
రమ్మంటున్నది! ॥స్వా॥
పండి రాలిన ప్రతి ఆకూ పల్లవితమై
మొరసి ముగిసిన ప్రతి స్వరమూ వికస్వరమై
ప్రతి జన్మ ఒక ప్రగతి సోపానంగా ఎక్కివస్తూ
ఎన్ని యుగాలుగా సాగుతున్నదో ఈ ఉగాది యాత్ర!
ఏమిటి ఈ తెలుగు నేల ప్రత్యేకత?
ఏమిటి ఈ కాళయుక్తి విశేషోక్తి?
ఎల్ల జగమ్ము నేలు హరి
నేలు మహా వట పత్రమాత, ఈ
యెల్ల తెలుంగు నేల నన
లెత్తిన నాలుగు కోట్ల తల్లి మా

పిల్లల మఱ్ఱి; మఱ్ఱి—బల
　　వీర పరాక్రమ రాజలక్ష్మియై
చల్లని నీడ గూర్చు సమ
　　సమ్మతి నెల్లర కెల్ల వేళలన్ !

　　అందువల్ల—
　　అక్కడ శ్రీమహావిష్ణువుకు ఉయ్యాల
　　కట్టిన మఱ్ఱి, ఇక్కడ యువజ్యోతికే
　　అభయ హస్తం పట్టిన మఱ్ఱి!

రాగ మధుర మధు జీవన తేజా
రావోయీ, ఋతురాజా!
శరదాదులు నీ సచివులు, మంత్రులు
జనసేవా పరతంత్రులు ॥స్వా॥

　　బిఱ్ఱులోన మఱ్ఱి, ప్రేమార్ద్రవాత్సల్య
　　మధువులోన గున్నమావి చెన్ను,
　　వ్యంగ్య వైభవమ్ము, ధ్వని మాధవత్వమ్ము
　　మూర్తిగొన్నవాడు ముఖ్యమంత్రి!
మహిత విహిత మూర్తి మా మఱ్ఱి చెన్నయ్య
ఉక్తి, యుక్తి, రక్తి, శక్తి కలుగు;
కాలయుక్తి నామకా! వత్స! వత్సరా!
కలిసి నడవ వయ్య! కలదు జయము !

　　ఎండలు మాడ్చి, వరదలు ముంచి
　　గుండెలు పగిలిన కువల యేందిర
　　అశ్రుజలధిలో స్నానమాడి, నీ
　　అడుగుల మడుగై పరచినదోయి!
　　　　స్వాగతమోయి వసంతా!
　　　　స్వామీ, వసంతా!

31. రాజకీయం నుంచి రాగోదయం

ఎంతటి విరహాగ్ని నుంచి
ఎంతటి ఆనంద సుందర సంవృష్టి!
ఎంతటి నిరాకృత
వీక్షా శూన్యం నుంచి
ఎంతటి పురాకృత పుణ్య పున స్సృష్టి!

తాను కాలిబూది అయిపోయి కూడా
ఎంతటి విబూదిని ప్రసాదించాడు
లోకానికి మన్మథుడు !
ఎన్ని కోపతాపాల శాపాల
ఎన్ని రాజకీయ రహస్యాల రగడల
యజ్ఞకుండాల అబ్ధిమథనాల
ఆత్మాహుతుల ఫలసాయం ఇది!
ఈ నవరసాల రసాల సంపదల
గాది! ఈ ఉగాది!

కామ దహనం జరిగి ఎన్నాళ్ళయింది?
మొన్న ఫాల్గున పూర్ణిమ నాడే కద?
పరమశివుడు చేసిందొకటి!
జరిగింది మరొకటి!
కాముణ్ని దహించి వేసిన పరమ రుద్రుడికి
కారుణ్యం అనే గయ్యాళి గంగ
నెత్తికెక్కి వుండడం వల్ల,
రతిదేవి కన్నీటి కణం
ప్రళయకారుని పరమాగ్ని బాంబునే
చల్లార్చి వెయ్యగలదై వుండడం వల్ల,
బూడిదై పోయిన పక్షం రోజుల్లోనే
భువనేశ్వరుడై వెలిశాడు కాముడు!
అంతవరకు ఒకే చిరునామా కలవాడు
ఈ నాడు అన్ని చిరు మానసాలూ
తన చిరునామాలే అయి కూర్చున్నాడు!

ఈ వసంతోత్సవ పల్లవ కోరక
పుష్ప ఫల రసరాగం అంతా అదే—
ఆ మహా చితాభస్మ పరమాణు పరాగం!
శివు డెంత మంచిపని చేశాడు!

ఒక్క శివుడే కాదు—
మంచివాడికి కోపం వచ్చినా
మంచే జరుగుతుంది లోకానికి!

రాజకీయాలు వేరు
రాగోదయాలు వేరు,
పైసల పైరవీల ఎన్నికలు వేరు
వలపుల పులకాంకురాల మన్నికలు వేరు!
అటూ, ఇటూ చూడకు-
అక్కడ గుమిగూడిన రకాలు
అతనుడి చిరునవ్వుల కోరకాలు కాదు!

ఇటూ, అటూ వినకు—
అక్కడ రేగుతున్న నాదాలు
శుకపిక శారికా నినాదాలు కాదు!
అటూ, ఇటూ ఆలోచించకు
ఇది మన గృహోపవనం కాదు!
ఆర్థిక సాంఘిక రాజకీయ పదవీ
చతుర్ముఖ బ్రహ్మల సమాఖ్యలు
ముఖాముఖీ, మైకా మైకీ
కురుక్షేత్రం ఆడుకొంటున్న
చతురంగ రంగ పౌరోద్యానం!
మన గృహోపవనం కాదిది!

ఇళ్లో, గుళ్లో, జైళ్లో, రైళ్లో
పదవులో, పెదవులో
ఎన్నికలో, మన్నికలో
పట్టుపరుపులో, పేవుమెంట్లో
భిక్షాటనో, దేశాటనో
హీరోలో, షీరోలో—
ఎవడి విశ్వాసం వాడి దైవం!
ఒకడి సమాధి మరొకడి దేవాలయం!

ఆ వ్యష్టి వైవిధ్యపు గోలనుంచి
ఉపసంహరించుకో సర్వేంద్రియాలనూ!
ఈ సమిష్టి వసంతశోభా ప్రాభవంలోకి
ప్రవేశించు ఏకాత్మవై!
త్వమేవాహ రసాద్వైత పరమాత్మవై!

అదేమిటి — అలా అయిపోయావు?
బాలేందు మౌళి పరమానుగ్రహంపొందిన
రతీ రమ్యాదేవిలా—
ఆర్షారణ్యాల
తపో దావాగ్నులు కాల్చిపారేసిన
నిష్కామ సేవా కామ్యచితా భస్మంలోని
అణువణువునా అవశవై పోతూ—
నీవే చెరకు విల్లువై
ఇలా వంగిపోతున్నా వేమిటి!
నీవు నవనవేషు రసదేవతవు!
నేను వట్టి చిరువేప పూ మొగ్గను!

32. ఇంత కాలానికి

ఇంత కాలానికి
మళ్లీ వెలిగించావు దీపం!
అబ్బ! ఎంత కాలానికి!
అంధకారం అహంకారంపై ఎంత యుద్ధంచేసి!

యుద్ధ రంగంలో నీ హృదయం చిందిన
ఒకొక్క రక్తకణం ఒకొక్క రత్న దీపంగా
కారుచీకట్ల కోరలు పెరికిపారేసి
జ్యోతిః శ్రేయో నిశ్రేయస రాజమార్గంలో
మళ్లీ ఈ సనాతన మానవతా విజయరథంపై
అధునాతన పూర్ణసుధా కుంభాన్ని ప్రతిష్ఠించావు!
ఆమ్నాయ పౌరుషోక్తిని అమృతీకరించావు!
ఆత్మ స్వాతంత్ర్యంపై ఆనందజ్యోత్స్నను ప్రసరించావు!

ఇంత కాలానికి
మళ్లీ రాజేశావు పొయ్యి!
అబ్బ, ఎంత కాలానికి!
దురాక్రమించి మూర్ఛించిన పిల్లులపై ఎంతయుద్ధంచేసి!

అవి వట్టి పిల్లులే అంటుంది-
స్వయం నియంతృక స్వప్రయోజక నాయకత్వ లోకం!
అవి పిల్లులా? రాకాసి నల్లులా?
మహిషాసురుని అసికొమ్ముల దున్నలా?
మహోరగాల కోరల కస్సుబుస్సు కసికన్నులా?
వెలుగంటేనే కిట్టని నరకాంధ తమస్సులు
ప్రతి యింటినీ ఆర్పేసి, ఆవులించి, ఆ బూడిదలో
మృత్యుకింకరుల్లా ముడుచుకు పడుకొన్నప్పుడు—
ప్రతి చకిత దీపకళికనూ నీ కన్నుల్లో దాచివుంచి,
ప్రతి పీడిత జీవుణ్ని నీ గుండెల్లో కాపాడి ఉంచి,
జనాభ్యుదయ మందిరవై, సాహస సత్యేందిరవై
శత్రు తండాలను పట్టి తరిమికొట్టి,
ఏ యింటి దీపాన్ని ఆ యింట తిరిగి నెలకొల్పావు!
ఏ గూటి జీవుణ్ని ఆ గూట తిరిగి నిలబెట్టావు!

ఇంత కాలానికి
మళ్లీ పండించావు పొలం!
అబ్బ, ఎంత కాలానికి!
చీడలపై, పీడలపై ఎంత యుద్ధం చేసి!

పంటల్ని పీల్చేసి, చెట్లను కూల్చేసి,
మంచిని ముంచేసి, మనిషి నెత్తురును జుర్రేసే

కీటకాలపై, తుఫానులపై, ఉప్పెనలపై
యుద్ధంచేసి గెలిచి, ఉర్వర నుద్ధరించి నిలిచి
సర్వభూన్యాన్ని సస్యశ్యామలగా మలిచి
ఓహో, ఎంత కాలానికి మళ్ళీ పండించావు
ఈ ఉపేక్షిత ఉపనిషత్ భారతాన్ని!
ఈ పరాశ్రిత పరిత్యక్త రత్నగర్భను!
ఎన్ని శీతాతప బాధలు! ఎన్ని నక్కల తోడేళ్ళ గాథలు!
ఈ కాంతి కాముక కాంతి క్షేత్రంపై ఎన్ని ఆకలి నాల్కలు!

అనంత శక్తివి—
అంధకారం ఉరఃకవాటాన్ని పగలదన్ని
వికల్పం గుండెల్లో సంకల్పాన్ని వెలిగించావు!
అన్నెందిరవు-
అన్ని అరివర్గాలను ఆత్మబలంతో అరికట్టి, మట్టుపెట్టి,
జాతి రాజనీతికి జీవధాతువును అందించావు!
అపరోక్ష కళా భారతివి—
అధర్మం నుంచి రక్షించి, ఈ ధర్మక్షేత్రాన్ని
సంరక్షించి, మళ్ళీ సార్వజనికం చేశావు!
త్రిశక్తీశ్వర నవశక్తీ!
నవ భారత యువశక్తీ!
యువ యుగాల జనశక్తీ!
సర్వదేవ సర్వ మంత్ర పరాశక్తీ!
నీ చేతి ఈ ఉజ్వలదీపం
ఇక అఖండంగా ప్రకాశించుగాక!
ఈ జాతి ఉద్ధత రూపం
ఇక అనంతంగా విస్తరించుగాక!

33. ఇంటర్వ్యూ

వసంత కవితల ఎన్నికలో
అభ్యర్థుల్ని ఎంపికచేసే కమిటీ ఇది.
ఒక సభ్యుడికి సంబంధించిన కొడుకో,
అల్లుడో, తమ్ముడో ఇంటర్వ్యూకి వస్తే
ఆ సభ్యుడు ఆ కాస్తసేపూ
లేచి బైటికి పోతూవుంటాడు.
మీ కందరకూ తెలుసుకదా?
అదొక మర్యాద-సంప్రదాయం.
అదే సంప్రదాయాన్ని అనుసరించవలసిందిగా
ఈ సదస్సులోని ఒక వ్యక్తిని కోరుతున్నాను!
ఆ వ్యక్తి మా ఆవిడ !
ఈ సభలో ఆవిడ లేకపోతే సమస్యేలేదు,
ఏ మూలనైనా వుండివుంటే మాత్రం—
ఒక మూడు నిమిషాలపాటు
బైటుండి రావలసిందిగా ప్రార్థన !
ఈలోగా నా కవితను ముగించేస్తాను !
ఇలా ఎందుకు కోరుతున్నానంటే—
ఈ నా కవితా నిర్మాణ కార్యక్రమ
నిర్వహణోద్యోగంలో చేరడాని కని
ఆమెకు చెందిన రెండు చరణాలు
ఇంటర్వ్యూకు వచ్చి వున్నై !
నేను అద్దంలో నా ముఖం చూచుకొంటూ—
''నా అంత అందగాడు ఈ లోకంలో
మరెక్కడా వుండడు కదూ?'' అంటాను

వెంటనే అనేస్తుం దామె—

"'ఏడిశావ్! దున్నపోతు మొగమూ, నీవూను'' అని!

మీరే చెప్పండి నిజం!

ప్రతి కుర్రవాడూ అద్దంలో తన మొగాన్ని

అన్ని కోణాల నుంచీ చూచుకుంటాడా? లేదా?

తన అంత అందగాడు కనీసం ఆ ప్రాంతంలో

మరొకడు లేడనుకుంటాడా? లేదా?

కాకపోతే—

ఆ మహిళా కళాశాల గేటు ముందున్న

చౌరస్తా కెందుకు పోతాడూ?

ముఖంమీద ఉమ్మినా

అది స్నో అనుకొని ఎందుకు రుద్దుకుంటాడూ?

వనితా విద్యాలయ ప్రాంగణంలో

వానర వేషా లెందుకు వేస్తాడూ?

మీరే చెప్పండి నిజం,

కనీసం నా ముఖం చూచి చెప్పండి!

ఇంటర్వ్యూ ఫెయి లయింది,

అభ్యర్థి సెలక్టు అయాడు!

అవునా?

కొట్టండి మరి చప్పట్లు!

జై, దున్నపోతు ముఖానికీ!

''మరి, అమ్మాయిాల సంగతో?''

అంటున్నా రెవరో!

నాకు తెలీదు

వాళ్ళ ముఖాలు నిజంగా ఎప్పుడూ నేను చూడలేదు!

34. రౌద్రి

రౌద్రీ!
మంచి సమయానికే వచ్చావు !
నీ కోసమే ఎదురుచూస్తున్నాం !
రా, కూర్చో !
అక్కడ కాదు, ఇక్కడ !
ఈ అధ్యక్ష పీఠం మీద !
ఈ పీఠం నీ కోసం
ఇప్పుడే ఖాళీ చేయబడి
పునర్వసంతీకరించబడి
ఆమోద సుభగం చేయబడ్డ అధ్యక్ష పీఠం.
ఎల్లప్పుడూ తానొక్కడే పట్టుకు వ్రేలాడా లన్న
అహమ్మతీ తపనా పంకిలం కాని పీఠం ఇది,
సామ్రాజ్యవాద సింహాసనంలా
శవ వాసన కొట్ట దిది,
ప్రజాస్వామిక పదవీ దాహంలా
నెత్తురు నాల్కలు చాచ దిది,
ప్రతీ యేడు క్రమానుసారంగా
కొత్తకు తావిస్తూ
పాత పై దొలగిపోయే
సనాతన ధర్మ పీఠం ఇది,
అధిష్ఠించు !
అధికారహస్తం అభయంకరించు.

అ దేమిటి, అలా
వేపపువ్వు మొఖం పెట్టావు ?
సమయానికి నీరందని చెరకు గడలా
అలా ఎండి పోయా వేమిటి ?
నిరుద్యోగ యువకుల చిరునవ్వుల్ని కూస్తూ
ఫైళ్ళలో పైసలు వెతుక్కొనే
ముసలి ఉద్యోగి కోకిల లా
ఎవరి మీద అలా కసురు కుంటున్నావు ?

వద్దు, రౌద్రీ వద్దు !
గతాన్ని చూచి బెంగ పడవద్దు !
ఎవళ్ళ మీదా కన్నూ, బుస్సూ మనవద్దు !
నీ కొక అవకాశం వచ్చింది.
ప్రతీ పల్లెనూ ప్రతీ ఇల్లునూ,
మందార వనాం త రామృత సరః
ప్రాంతంగా మార్చు!
ప్రతీ ఇల్లాలినీ నవ విద్రుమాభగా
శరదిందు శోభగా తీర్చు!
తమాల నీలవై మా తెలుగు రాజధానిని
భాగ్యనగరంగా వెలార్చు!
రౌద్ర మూర్తివైన నీవు
ఇ కారాంత పుంలింగానివో
ఈ కారాంత స్త్రీ లింగానివో గానీ-
వట్టి నపుంసక లింగాలమై పోయిన మాకు
కించిత్ మగతనాన్ని సమకూర్చు!

నిజం రౌద్రీ !
మేం వట్టి నపుంసక లింగాలం !

పుంలింగాల మని చాటుకోవడం కోసమే
ఆడపిల్లల హాస్టళ్ళపై పడి
అల్లరి చేస్తాం !
సినిమాల్లో మగసిరి పాటల్ని వింటాం,
పంట్లాం జేబుల్లో చేతులు దోపుకుంటాం !
పత్రికల్లో రేపుల్ని చూస్తూ
మాపుల్ని గడిపేస్తాం !
నీవే చెప్పు—
సిసలైన మగవాడు
స్త్రీ మూర్తిని ఆరాధిస్తాడు
అల్లరిపరచి అవమానిస్తాడా, రౌద్రీ ?

నీవు రౌద్రివి!
రౌద్రంతో పాలించి
మమ్మల్ని విరాట్‌పురుషసూక్తుల్ని చెయ్యి!
రుద్రాణివై విజృంభించి
మాలోని మహిషాసురుల్ని మర్దించు !
తెలుగుజాతికే కాస్త వెలుగు చూపించు
మనం తెలుగు వీరులం అనే స్ఫూర్తి కల్గించు.

స్వాగత సత్కారాలే తప్ప
వీడ్కోలు విందులు లేని
సంవిధానం నీది,
నీ పదవీకాలం పన్నెండు నెలలే అయినా
పంద్రెండు పంచవర్ష ప్రణాళికలకు సరిపడే
ప్రగతిని సాధించు
ప్రజలను బోధించు !
ఉద్బోధించు !

35. నెత్తురుతో వసంతా లాట

పులిని అవమానించా లని
నక్కకు వాతలు పెట్టి ఊరేగిస్తున్నై
అడవిలో అలగా జంతువు లన్నీ!
మరి, పు లేదీ?
ఉగాది పచ్చడి తిని, ఒళ్లు మరిచి
గుర్రు కొడుతోంది దాని పొదలో అది!

ఎర్రటి మోదుగ పూల మాలల్లాంటి
వాతల్ని నాకుకుంటూ నక్క
సన్మానోత్సవ మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ
మైకంలో పడి పోయింది !

స్వరాజ్యం లాంటి ఈ వసంతాన్ని
ఈ అడవికి తెచ్చిం దెవరు?
పులిని త్రోసి రాజని, నక్కను
ఉత్స విగ్రహం చేసిం దెవరు ?

నే నంటే నే నను కున్నై దేని కదే,
బయటికే కూనేసినై దేని గొంతుతో అది !
కూతలు చేతలుగా మారినై
పంజా లెత్తి గుండెలు చీల్చుకొన్నై
కోరలు చూపి గొంతులు కొరుక్కొన్నై
ఒకళ్ళ నెత్తురుతో ఒకళ్లు
వసంతా లాడుకొన్నై !

ఉదయమే పుట్టిన ఉగాదిని
సాయంత్రానికి చంపేసినై
ఉమ్మడిగా తెచ్చుకొన్న వసంతాన్ని
మొగ్గలోనే తుంచేసినై !

పులిని ఏమి చెయ్యాలన్నది పోయింది
నక్క ఎవరి చేతుల్లో ఆడా లన్నది
సమస్య అయింది !

ఇది చిట పట మండి
చింత నిప్పులు చెరిగింది
చివరికి అడవికే నిప్పెట్టేసింది !

పాపం, అలగా జంతువులు !
విజ్ఞతలేని కుక్షింభర జీవులు !

36. దుర్మతి గారు

ఆయియే, హుజూర్ ! వెల్‌కం, సార్ !
రండి ! రండి ! అండి గారు !
అదేం సార్, అలా చూస్తారు ?
మీరు దుర్మతి గారేనా ?
మీకే సార్, నేను స్వాగతం చెపుతుంట !

2

మీరు తెలుగువారే కదా ?
అందుకే సార్—
మీకే భాష అర్థమవుతుందో తెలీక
నాలుగు భాషల్లో స్వాగతం చెప్పాను !
పరాయి భాషల ప్రభుత్వాల కింద
వాళ్ల పాదసేవ చేసుకొంటూ బ్రతకడాని కని
పూర్వం ఏ భాషలు నేర్చుకున్నానో
ఆ భాషలే ఇంకా నాకు గర్వకారణం, సార్ !
ఆ భాషల్లో నేను ఉపన్యసించా నంటే—
అబ్బో, ఆ హర్షధ్వానాలు, మీరు వినాలి !

3

నాకు అధికార భాషలు నాలుగు, సార్ !
ద్రౌపది కంటె ఒక డిగ్రీ తక్కువ !
నవ్వకండి, సార్ !
నా ఏడుపు వినండి !
నాకు అధికార భాషలు నాలుగు,

ఇంగ్లీషు, ఉరుదూ, హిందీ, తెలుగు!
ఉరుదూ, ఇంగ్లీష్, హిందీ, తెలుగు!
పతివ్రతల వంశంలో పుట్టిన నాకు
నాలుగు భాషల మగళ్ళతో కాపరం
పరువేనా? బరువు కాదా, సార్?

4

మీ పేరు దుర్మతి కనుక
ఏవో దుష్ఫలితా లిస్తా రని ఎవరన్నారు?
ఎవరో అంటారని ఎందు కనుకున్నారు?
మరి, 1947 లో మీ అన్న సర్వజిత్తుగారు
తవ్వి మా తలకెత్తిన విజయోత్సాహం ఎంత?
సర్వజయం మాట అటుంచండి,
ఆత్మవినాశానికి బీజం అప్పుడే కదా పడత
అయ్యో, భారతీయ రొటీన్ నవోదయం గారూ!
ఒక్క సత్యాన్ని చిత్తగించండి-
మా నిండా, మా చుట్టూ
మత పిచ్చీ, కుల రొచ్చూ
పేరుకుపోయి వున్నంత కాలం
మమ్మల్నెవరూ ఉద్ధరించలేరు, సార్!
మేం సదా-
దేశదేశాల ముచ్చట ముంగిళ్ళ ముందు
నంగివేషాల గంగిరెద్దుల్ని తిప్పుకొంటూ
అడుక్కు తినవలసిందే!

5

వర్ణాలు లేవు కనుక
మా కోకిల గొంతుల్లో తడి లేదు,

కోట్లు పెట్టి కొన్న విదేశీ రిగ్గులతో
పాతాళగంగను కూడ తోడేశాం కనుక
పురాణ వృక్షాలు సైతం ఎండిపోతున్నై.
చక్కెర కోటా మొత్తం లక్ష్మికే కనుక
పార్వతికీ, సరస్వతికీ మిగిలింది
మామిడి పిందెలూ, వేప పువ్వూ మాత్రమే.
తీపి లేని పులుపూ, చేదూ
ఈ నాటి మా ప్రజా జీవితం!
మా కున్నదాంతోనే మిమ్మల్ని సన్మానిస్తాం
సన్మానం ఖర్చు మిమ్మల్ని అడగం
మీ రేదైనా ఇస్తే సంతోషంతో పుచ్చుకుంటాం.

6

ఏదైనా ఇస్తే అంటే, ఎందు కివ్వరు, సార్?
ఏ విలువా లేని వాళ్లే వేలు విరాళా లిచ్చి
సన్మానాలు చెయ్యించుకొంటున్న ఈనాడు
మీ రెందు కివ్వరు?
మీ పేరు దుర్మతిగారు అయినా
మీరు తెచ్చింది వసంతమే గా?
శుష్కప్రియాలూ, శూన్యహస్తాలు కావు మీవి.
తిండిలేక ప్రాణం కొడిగట్టినా
తీయగా పాడే కోకిల మీదే కదా!
మీ పరివారం పాడకపోతే
ఈ లోకానికి వసంత మెక్కడిది?
మీ ఆ స్థానం ఆనకపోతే
తొలకరికి వేదిక ఏదీ?

అవి మోదుగ పువ్వులా ?
మీ ప్రేమానురాగ పులకాంకురాలు !
అవి మల్లెలూ, సన్నజాజులూ నా ?
మీ వాత్సల్య దరహాస మధుబిందువులు !
రండి, ఇదిగో ఉగాది పచ్చడి,
మా సంస్థ చేసింది,
చేదు ఎక్కువగా లేదు.

7

నా దొక్క కోరిక, సార్ !
ఉగాది కోరిక కాదు కాని-
మీ అరవై మంది అన్నదమ్ములూ
ఏడాది కొకరు చొప్పున పాలిస్తారు !
అంతకన్న ప్రజాస్వామిక మేముంది, సార్ ?
కుల సంకుచితుల మైన మేము
అలాంటి రొటేషను పద్ధతి చేబట్టే టట్టు
ఆశీర్వదించి పొండి, సార్ !
సార్, సార్, అటు పోకండి,
అవి గొప్పవారి కొత్త భవనాలు !
ఏ ప్రాజెక్టుల కడుపుకొట్టిన సిమెంటుతో
రాజసం వెలగబెడుతున్నట్టివో అవి
అ వెప్పుడు కూలతవో తెలీదు,
ఆ పాపం మన కెందుకు ?
ఇలా రండి, ఈ తోటల్లోకి
ఇవే మా గ్రామీణుల నీడలు, గూడులు,
సహజ సుందరాలు
సుఖైక మందిరాలు !

37. అందరిదీ ఈ వసంతం

మామిడి పూచింది
కుంకుడు చెట్టూ పూచింది,
కోకిల క్వోం అంటే
కాకి క్యా అంది !

కొత్త చిగుళ్ళ మీదికి దూకింది లేడిపిల్ల
లేడిపిల్ల మీదికి దూకింది పులిపిల్ల,
వేప పువ్వును చూచి
మల్లె మొగ్గ ముక్కు మూసికొంది
మల్లె మొగ్గను చూచి
పల్లె పడుచు జడ సవరించుకొంది !

ఇదీ వసంతం !
దేని స్వేచ్ఛ దానిది,
దేని ఆనందం దానిది.
స్నేహాలు, శత్రుత్వాలు
విరిసే నిచ్చెనలు
కరిచే పాములు

జీవ లక్షణాన్ని మార్చలేవు
జీవి లక్ష్యాన్ని మలప లేవు.
అన్నిటికీ ఒకే వసంతం
దేని పరిధిలో అది కేంద్ర బిందువు
దేని క్రియా క్షేత్రంలో అది స్వేచ్ఛా సింధువు.

పులి పిల్ల బ్రతుకుతున్నది
లేడిపిల్లా బ్రతుకు తున్నది
దేని వ్యూహంతో అది,
దేని హక్కుతో అది.

మానవుడేనా బ్రతకలేనివాడు ?
మానవుడూ బ్రతుకుతున్నాడు
మధుమాసాన్నే సొంతం చేసుకొని,
అందరి హక్కుల్నీ ఆహారంగా గొని !

కత్తి, గొడ్డలి, బాణం, తుపాకీ
ఆటవికుని ఆహార సాధనాలు;
మతం, మంత్రం, దోపిడీ, దౌర్జన్యం
నాగరికుడి భోగ సోపానాలు.
వసంతం మాత్రం అందరిదీ,
ఎవరికీ దీనిపై ప్రత్యేక హక్కు లేదు.

మధుప్రియ కోకిల జీవితం కంటె
మానవ మేధావి జీవితం గొప్పదేం కాదు.
అందుకే, ఆనందించు,
సుందర వసంతంలో ఒక బిందువైనా కా !

38. దుందుభితో నవ శకం

ఓహో !
దుర్మతిని తరిమికొట్టు కొంటూ
దుందుభి వచ్చేస్తున్నది !
ఏం అతిలోక రమణీయ దృశ్యం !
రాక్షసాంధకారాన్ని చీల్చి చెండాడే
రామ బాణంలా
ఫాల్గున అమావాస్య చీకట్లను
నరికి కుప్పలు పోస్తూ
ఉగాది ఉషః కిరణం
ఎంత మనోజ్ఞంగా వుంది !

2

ఏమోయ్, నిన్నే, ఇదిగో !
ఇలారా ఒక సారి !
వంటగది ఎప్పుడూ వుండేదే లే.
అవును, అసలు—
ఈ లోకానికి ప్రాణాధారమే వంట గది.
సూర్యుడే పొయ్యి !
నీవు జగదంబవు !
ఆ కుర్ర కుంకల్ని ఇక లేపు
చదువూ లేదు, సంధ్యా లేదు,
నిద్ర ముఖాలు !
మన మేధావిగాణ్ణి కూడ లేవగొట్టు
కాస్త ఈ నాడైనా
లేచి వీధి మొగం చూడ మను,
పిరికి వెధవ !

3

మన తెలుగు వాళ్ళకు
సంవత్సరాదీ, వసంతారంభమూ ఒకటే !
అది నిజంగా మన అదృష్టం !
వసంతం ఫాల్గునంతోనే వస్తుం దనీ,
కోకిల ఏడాది పొడుగునా కూస్తుం దనీ,
బజారులో మామిడి పళ్లు కనిపిస్తున్నా
మన కవి కోకిలలు లలిత రసాల పల్లవాల
వగరు గొంతుకలతోనే అరుస్తారనీ
పండితులు విమర్శిస్తూ వుంటారు.

కవుల స్వేచ్ఛనూ, సన్మానాలనూ, శాలువాలనూ చూచి
పండితులు ఏడ్చుకొంటారు, నిజమే కాని—
ఈ విమర్శలో మాత్రం నిజం వుంది !
మనకు వాస్తవంగా
ఫాల్గున చైత్ర మాసాలే వసంత ఋతువు.

4

అయితే—
మనకు కనిపించే దంతా వాస్తవమే నా ?
వినిపించే దంతా నమ్మ దగిందే నా ?
కొంచెం ఆలోచించి చూడు !
మానవుడు మధుర స్వప్నాలను కంటున్నా డంటే
ప్రజలు పండుగలు చేసుకొంటున్నా రంటే
ప్రవక్తలు తమ సమకాలీన సమాజంపై
ప్రాణాలకు తెగించి తిరుగుబాటు జరిపా రంటే
గుడిసెల్లో, పేవుమెంట్లపై కూడ
పడుచు వాళ్ళు పిల్లల్ని కంటున్నారంటే
వాస్తవాలను ఎదిరించే కాదా ?
వాస్తవం ఒక్కటే జీవితం కాదు
కూడు గుడ్డ కొంప ఇవే కాదు జీవితం
అవి లేనివాళ్లు కూడ జీవిస్తున్నారు.

5

ఈ పసందైన వసంతోదయ రస కందంలో
ఈ శాస్త్ర చర్చ లెందుకు కాని—
మొత్తం అరవై సంవత్సరాల కాల అక్షమాలలో
ఏభై ఆరోది దుందుభి !
రాము డనే శిష్ట మానవత

రావణు డనే దుష్ట రాక్షసత్వంపై
విజయం సాధించిన శుభ వార్తను
లోకానికి చాటిన విజయ దుందుభి ఇది,
ఫాల్గున అమావాస్య ముగిసిన
చైత్ర పాడ్యమి ఉషః కిరణ మిది!
నా ఊహలో ఇది ఏళ్లై ఆరోది కాదు
మానవ మహా విజయ పురోగమనంలో
ఇదే మొదటిది !
ఇదే శ్రేయోరాజ్య శకాది

6

సరే కాని—
నీ వెప్పుడైనా ఉగాదిని చూశావా ?
ఉగాది పచ్చడిలో
వేప పువ్వులా వుంది కదూ నీకీ ప్రశ్న
యుగం అంటే జంట
ఇద్దరు కలిసిన క్షణం యుగాది !
మనం కలుసుకొన్న క్షణం నుంచీ
ప్రతి క్షణమూ నీకూ ఉగాదే నా ?
అవును—
నీకు నేను ఉగాదిని
నీవు నాకు ఉగాదివి
సీతారాముల, రాధాకృష్ణుల, శక్తీశ్వరుల
యుగ ధర్మం మనది !
నీవు నన్నూ, నేను నిన్నూ ఆరాధించుకొనే
సత్యం + సుందరం = శివం మనం !
సమతకు సదా ఉగాది పండుగ మనం !

39. గుడ్లగూబ ఆరాటం

ఒరే, ఎందుకురా కూస్తావు ?
ఓరి, పరభృత ముష్టిం పచా :
పని లేని పంబా ! నోరు మూసుకో ;
నీ రాజ్య మింకా రాలేదు పడుకో !

ఈ తమో రాజ్యానికి అధినేతను నేను
ఈ ఎగురుబోతు వర్గంలో మేధావిని నేను
నక్కలకు, నాగులకు, పిల్లులకు, పీడలకు,
దొంగలకు, దెయ్యాలకు, హంతకులకు
రెండో ఆట సినిమాలతో సహా
మొత్తం చీకటి వ్యవహారా లన్నిటికీ
నాయకుడిని నేను ఆజ్ఞాపిస్తున్నాను విను,
అరవకు !

ఆరె, నా రాజ్యంలో నన్నే ధిక్కరిస్తున్నావే !
ఏం చూసుకొనిరా ఆ ధైర్యం ?
ఆ కూతల వెనక ఎవరా నేతలు ?

వసంత కంతులా ? కళా కాంతులా ?
ఏమి టవి ?
బలిసిన వాళ్ళ ఊహాపోహలు కాక ?
ఇంతలేసి పెద్ద పెద్ద కళ్ళున్న నాకే
కనిపించని దేదైనా వున్నదా, లోకంలో ?
చీకటి కంటే సత్యం ఏముందిట ?

వెన్నెలే అభ్యుదయ నిరోధక ప్రతిపక్ష
మాయావాదం అనుకొంటే -
అంతకంటె మహావిప్లవ మహోదయం
ఏమిటిరా, ఆ దిక్కున కనిపిస్తున్నది నీకు ?
నీ వంటి పాటగాళ్ళకు, ఆటగాళ్ళకు
కలలు దున్నుకొనే వాళ్ళకు
కవిత లమ్ముకొనే వాళ్ళకు
స్వేచ్ఛారాజ్యం వచ్చేస్తున్నదా ఏమిటి ?

ఇదేమిటి ? నాకళ్లు మూతలుపడిపోతున్నై !
అదేమిటి ? ఆ...రక్తపాతం ఆశాపరిధిలో?
లోకంలోని చీకట్లన్నీ ఉవ్వెత్తున పారి వచ్చి
నా కన్నుల్లో దూరి
తలుపులు మూసేసుకుంటున్నై!
జగత్తులోన రణ గొణ ధ్వను లన్నీ
నా చెవుల్లో మర మేకులు కొట్టేస్తున్నై !

ఒరే, నీవే గెలుసున్నట్టున్నావు!
ఆ వచ్చిందేమిటో !
అది తెచ్చిందేమిటో !
నా కెలా తెలుస్తుంది ?
నే నేం మేధావిని ?

40. త్రిశంకార్తులు పుట్టిన ఉగాది

ఏమి టలా కూర్చుండి పోయావు ?
వినిపించడం లేదా ఆ వసంతాగమన గీతం ?
మధుదేవతకు ఆ కోకిల పలుకుతున్న స్వాగతం ?

* * *

కోకిల !
కాకుల గూటి పిట్టే,
కాకులు తన్ని తరిమేసిన అనదే,
కాకుల మూకలతో పోలిస్తే
సంఖ్యాబలం లేనిదే,
సైజులో చిన్నదే.
అయితే—
దాని పంచమ వర్ణంలో (స్వరంలో)
విశ్వ చైతన్య విపంచినే మీటగల
నవోదయ సమైశ్వర్యం లేదా ?

* * *

పాపం, ఒకే ఒక కోకిల మిగిలింది !
ఇది కూడపోతే, ఇక—
ఈ తోటకు వసంతమే రాదేమో !

* * *

వెయ్యేకరాల తోట !
ప్రపంచానికే రసదానం చేసిన ఫలాగారం !
సగమై, పావై, పరకై
సీలింగుతో ఛిన్నాభిన్నమై ,
మనకు నాలుగు చెట్లైనా మిగలకపోగా—
తోటంతా ఇళ్లై, రోడ్లై, ఫేక్టరీలై
పొగలు కక్కుతున్నై !

* * *

దున్నేవాడిది భూమి,
దున్నని వాడిది పంట !
ఇదీ మన వినా దాభ్యుదయం !
భూమిని జాతీయం చేయడానికి బదులు
ముక్కలు చేసి వ్యక్తులకు పంచడం—
వాళ్ళ పంటను దున్నని దొరలు
దోచుకు తినడానికి కాక మరెందుకు ?

* * *

ఈ ఉన్న ఒక్క వేప సైతం స్వేచ్ఛగా ఎదగకుండా
కొమ్మలు నరికేశారు కరెంటు తీగల వాళ్ళు !
ఆ మామిడి పిందెలు చూడు—
మన డెందాల లాగే ఎలా కందిపోయున్నాయో !
అవును—
పాతాళ గంగను కూడ
ఫారిన్ రిగ్గులతో తోడేస్తుంటే
మహా వృక్షాల కైనా
మాన ప్రాణా లెంతకాలం నిలుస్తై ?

* * *

దుశ్శాసన వధానంతర
భీమసేన రక్తాట్టహాసంలా వుంది ఉదయ సంధ్య !
నెత్తురు చిమ్ముకొంటూ వచ్చేసింది రుధిరోద్గారి !
ఏమిటలా చూస్తున్నావు ?
పంపులో నీళ్ళు రావడం లేదు కదూ ?
ఈ తెలుగు దేశంలో నీళ్ళెక్కడున్నై
ప్రజల కళ్ళల్లో తప్ప ?

* * *

అన్నట్టు, ఇది
మన చంద్రుడి జన్మదినోత్సవమే కాదు,

ఏప్రిల్ పద్నాల్గు సూర్యుడి జన్మదినోత్సవం కూడ,
మన అంబేద్కర్ జన్మదినోత్సవం కూడ !
ఓహో, ఎంతటి పవిత్రోత్సవం !
నవభారత జన జీవన ధార్మిక త్రిమూర్తులు
కలిసి చేసుకొంటున్న ఉమ్మడి పండుగ !

* * *

సత్య సౌందర్య దర్శన మధువ్రతాలైన నీ చూపులు
మధు మక్షికాలై భ్రమిస్తున్నై !
అయినా లభించడం లేదు సుఖశాంతులు లోకానికి !
గండిపేట హిమాయతసాగరు ఎండిపోతే నేం ?
మహా సాగరే లేదా మన కోస్తా పొడుగునా ?
ఉప్పు సత్యాగ్రహం ప్రకటించి
తీపి నీరుగా మార్చి తీసుకొద్దాం, లే !
ఉగాది ఉపోష్యం కాదు.

* * *

"నా కుగాదులు లే" వన్న కృష్ణశాస్త్రి నిర్వేదం,
ఉగాదులే కాదు, సర్వసంపదల గాదులూ
ఇక మీవే అన్న అంబేద్కరు జ్యోతిర్వేదం,
మన సర్వజన శుభంకర సామ్యవేదం—
కలిపి అందించు ఉగాది పచ్చడి !
రుధిరోద్గారి ఎవరో కాదు,
మన ఇలువేల్పు విజయ రుద్రాణి !

* * *

(1983 ఏప్రిల్ 14న ఆకాశవాణిలో ప్రసారమైన కవిత. తెలుగు ఉగాదితోపాటు తమిళ ఉగాది, అంబేద్కర్ జన్మదినం కూడా కలిసి వచ్చినై. అందుకే చంద్రుణ్ణి, సూర్యుణ్ణి, అంబేద్కరుణ్ణి భారతీయ ధార్మిక త్రిమూర్తులు అన్నాను.)

41. రస రాగ వైవిధ్యం

కొత్త సినిమా విడుదలైన మొదటి రోజుకూ
కొత్త ఏడాది తొలిరోజుకూ ఏమిటి తేడా?
ఏం లేదు, తేడా ఏమీ లేదు.

అక్కడ టిక్కెట్లకోసం, సీట్లకోసం తొక్కిసలాట
ఇక్కడ వేపపువ్వు వగైరాల కోసం హడావుడి
రెండూ ఒకటే, తేడా ఏం లేదు.

సినిమా టిక్కెట్లు రేపు కూడా దొరుకుతై
వేపపువ్వు రేపు కూడా దొరుకుతుంది
ఈనాడే ఎందుకింత తొందర?

ఇదే మానవ మనస్తత్వంలోని రహస్యం!
దేనికైనా మొదట పంక్తిలో తానుండాలి
పంక్తిలో మొదటివాడు తానే కావాలి
ఏ చెట్టుదైనా తొలి ఫలం తనకే దక్కాలి
ఏ రుచినైనా తొలిగా తానే ఆస్వాదించాలి!

ఈ ఉగాదులు —
ఒకొక్కటి ఒకొక్క మహోదయం
ఒకొక్కటి ఒకొక్క ఆత్మ విమర్శనం
ఒకొక్కటి ఒకొక్క రాధామాధవం
ఒకొక్కటి ఒకొక్క ఆనందమార్గదర్శనం!
దేనికదే కొత్త, దేనికదే ప్రత్యేకం
అన్నీ ఒకలాగే కనబడుతున్నా
అందాలు వేరువేరు,
అన్నీ ఒకేలాగ వినబడుతున్నా
రాగాలు రకరకాలు,
ఆస్వాదించండి
ఆనందించండి!

42. వసంత వరణం

(శిశిర రుతువు చివరి ఘడియ గడిచిపోయింది. వసంత రుతువు తొలి ఘడియ ప్రారంభం కాబోతున్నది. ఒడలెల్ల కనులుగా ఎదురు చూస్తున్నది ప్రకృతి కాంత వసంతుని కోసం. ఆ చూపుల కొసలు ఏదో వార్తను మోసుకు వస్తున్నాయి. అది బృంద గానంగా వినిపిస్తున్నది)

బృందగానం :

అది గదిగో కెందామర పువ్వు బొడిచె!
అదిగదిగో మావి చిగురు జెండా!
అదిగో మధుపూర పూర్ణకుంభం!
అదిగో నవ వసంతోత్సవ రథం!
　　బైలుదేరె! బైలుదేరె!
　　బైలు కొసల నుండి!
మలయానిల పత్రముపై
మధుపాక్షర లేఖ ఇదే!
వసంతుని విలాసాలను
దెసలు చదివి వినిపించె!
　　వచ్చె నదే! వచ్చె నిదే!
　　వసంతోత్సవ రథం!
కోకిల స్వాగతము చెప్పె తొలుత,
కుంకుమ మిడె మంకెన పువు నెలత,
ఉగాది పల్లకి లోనికి
ఉరికె కొత్త పెండ్లి కొడుకు!

తరలి వచ్చె! తరలి వచ్చె!
తన వెంటనె ప్రొద్దు పొడిచి!

(వసంతుడు ప్రవేశించాడు. ప్రకృతి పదహారు వేల వనలక్ష్ములై అతణ్ణి వరించి వచ్చింది. ఒక్కొక్కరి నే అతడు సమాదరిస్తూ వస్తున్నాడు. అంతట మధుప్రియ (కోకిల) అతణ్ణి సమీపించింది)

మధుప్రియ :

నీ వియోగ మహార్తవార్ణవ పంచకమ్మున
నావ దొరకని దాన నోయీ!
పంచ మమ్మును దాచుకొని, బ్రతుకోర్చుకొని, నీ
పంచ చేరిన దాననోయీ!

ఓ వసంతా! నా వసంతా!
జీవన లతాంతా!

అణగి, లోకపు కాకులతో దశ మాసములు నే
నణువు వలె జీవిస్తి నోయీ!
శిశిరపుం గొనలందు నీ చిరునవ్వు లే నా
చీకు చింతలు రాల్చె నోయీ!

ఓ వసంతా! నా వసంతా!
జీవన లతాంతా!

కంఠమున శివునిన్ ధరించిన విషమునై, నీ
కరుణకై మనుచుంటి నోయీ!
నీవ నన్ను ధరించి, ప్రకృతికి పురుషుడై, న
వ్యావనులు నిర్మింపు మోయీ!

ఓ వసంతా! నా వసంతా!
జీవన లతాంతా!

వసంతుడు :

నీ వటే కోకిలా ?
నీ వటే కాకిలా !
నా వియోగము లోన
నల్లనైనా వటే !
నవ్వరే, ఎవరైన
నవ కవులు వింటే ?
నీవ కాటుక కాయ
వీ వన రమల కెల్ల,
నీవ బొగ్గుల కుంప
టే విరహ హృదయాల,
నాకు ప్రియు రాలవా ?
నవ్వరే యెవరైన ?
విషపు బాణాసనము
వింటివా ? నీ గొంతు,
కలిపి కట్టు నొకప్డు
కలియ గొట్టు నొకప్డు
నీ వటే కోకిలా ?
భావాగ్ని పొగలా !

(కోకిల సిగ్గుపడి దారి విడుస్తుంది. వసంతుడు పరిక్రమిస్తాడు. రసాలిని (మామిడి) ప్రవేశిస్తుంది.)

రసాలిని :

నేను బాల రసాల లతనోయ్ !
నేను, మాధవ ! నీకు జత నోయ్ !
ఉగాది రుచుల గాదెను, నే

జగానికి మాధురిమ నోయ్!
తావి తరగల షట్పదమ్ముల
నీవు వ్రాసిన ప్రేమ లేఖలు
నన్ను నన్నే త్రావి త్రేన్చుచు
నున్న వివిగో నోయ్!
తీయ తేనియ పాత్రముల ఆ
తిథ్యమును సమకూర్చి పెట్టితి;
పీపులా? నీకేలు సోకిన
చేప వా రస పయోధునులు?

వసంతుడు:

ఈ వగరు పిందెలా
నీ వలపు రసధునులు?
ఈ తేనె టీగలా
నీ తలపు దూతికలు?
నవ్వరే, యెవరైన
నవ కవులు వింటే?
మనసులో కోకిలపు
మసి గూడుకట్టుకొని
శాంతి లోకమును జవ
జవ లాడ కవ్వించు
కెంజివురు బావు టా
రంజించునా నన్ను?
ఎల మావి నా కొక్క
వలపు నెల వను కొంటి;
వింగి కే గురి పెట్టు
నిప్పు బాణపు మొనవె!

చూతులే తరువాత;
చూతమా ! నిలువుమా !

(రసాలిని దారి తొలగుతుంది. నింబలత (వేప) ప్రవేశిస్తుంది.)

నింబలత :

ముద్దులొల్కు భూకాంతకు ముత్యాల్
ముగ్గులు పెట్టిన వాకిలి నేను
నింగి అద్దమున నా ప్రతిబింబమె
తొంగి చూడదా పాలపుంత వలె ?
రావోయీ, మధుదేవా ! కై
కోవోయీ, నా సేవ !
పికములు, శుకములు, కాకము లనుచున్
భేదము లేదోయ్ నా పంక్తి !
అందరి కాయు, స్వారోగ్యము, భా
గ్యము సమముగ కూర్చె రాణి నేనే !
రావోయీ, మధు దేవా ! కై
కోవోయీ, నా సేవ !

వసంతుడు :

నీ పూల నవ్వు వె
న్నెల కాయునే కాని,
వెన్నెలల కడలిలో
విషము దాగిన దమ్మి !
చేదు విషమో లమ్మి !
చేర రా కోలమ్మి !
బేల చూపుల వలపు
పూల ప్రభ వసుకొంటి,

నీ గుండె చేదుతో
నింపు కొన్నా వటే ?
ఆయు రారోగ్యాలె
ఆనంద మగు నటే ?

(నింబలత నిష్క్రమిస్తుంది. ఇక్షుకాంత (చెరకు) ప్రవేశిస్తుంది)

ఇ క్షు కాం త :

చెరకు వింటి చెలి చెప్పగ
వింటిని, నిను కంటిని !
మల్లిక నీ మాట చెప్ప
ఊరితి, నిను కోరితి !

పువ్వు టమ్ము రివ్వు మనగ
నేను కూడ దాని తోడ
దూకి నిన్ను తాక లేక
విలపించితి విరహ బాధ !

విశ్వానికె రుచి, పంచమ
వేదానికె పర్వమునే !
కనికరించి చేకొనుమా,
కాంతా ! ఓయి, వసంతా !

వ సం తు డు :

ఓసి, గడసాని ! నీ
బోసి నవ్వుల కేమి,
వాసి వన్నెల కేమి
వాలు చూపుల కేమి,

నా ప్రక్క నిను చూచి
నవ్వరే నవ కవులు ?
దీనురాలవు పరా
దీను రాలవు నీవు,
ఆసనమవే గాని
అమ్మ వెట్లగుదువే ?
ఎత్తరా మగనాలు
ఏల గలదే మగని ?
నీ నింద ఎంతెంతో
తేనె యున్నను గాని
నమిలి మ్రింగిన కొలది
నార సాగును పిప్పి !
వేణు ప్రియవె కాని
వినపడదు నీ పలుకు !

(ఇక్షు కాంత ప్రక్కకు తొలుగుతుంది. ఒక వెండి గిన్నెను చేత పట్టుకొని నాట్యం చేసుకొంటూ ఒక గోపిక ప్రవేశిస్తుంది. తన ప్రాణాలు ఆమె చేత నున్నట్టుగా వసంతుడు ఆమెను అనుసరిస్తాడు)

గో పి క :

ఉగాది దేవత,
యుగాధి దేవత
జగానికే అ
గ్ర గామి దేవత
దిగాలు పడ నేమీ ? వసంతుని
మొగాన ఎరు పేమి ?

ప్రణయ విహంగము
పరభృత మనుచు
ప్రియ మాకందము
పేదది యనుచు,
సిద్ధ నింబలత
చేదే యనుచు,
కోమలేక్షువే
కురూపి యనుచు,

దిగాలు పడ నేమి? వసంతుని
నిగాకు ఫల మేమీ?

ఆకులు రాలని
మ్రాకు లున్నచో,
శిశిరము సోకని
చేత మున్నచో,
చేదే యెరుగని
స్వాదు వున్నచో,
కుందు లేని ఆ
నంద మున్నచో

జగాన దిగు లేమి? వసంతుని
జన్మకు ఫల మేమి?

రసాధి దేవత
వసంత భూమిక
ఒసంగినవె ఈ
పసందు లన్నీ,

అసాధు వన నేమి? వసంతుని
ప్రసాదమే భూమి!

(ఆమెతో కలిసి నాట్యం చేస్తూ వసంతుడు ఆమె చేతిలోని పాత్రను తన చేతిలోకి తీసుకొంటాడు. రుచి చూస్తాడు. తేజోవంతుడవు తాడు. ఆనందమూర్తి అవుతాడు.)

వ స ం తు డు :

అనిర్వచనీయ మిది, ఓహో!
అమృతమునకే అమృతమో!
అపూర్వము, అద్వితీయ మహో!
ఆత్మకే ఇది ఆత్మమో!
ఓ జగన్మధు మోహినీ! నా
యాగమము నీ కోసమేనే!

కంఠమున కల కంఠములతో
కందోవల యెల వెన్నెలలతో
అధరమున శీధు రసములతో
అఖిల సౌందర్య రుచి వీవే!
ఓ జగన్మధు మోహినీ! నా
యాగమము నీ కోసమేనే!

(ఆమె అతని కేలు గ్రహిస్తుంది. పాత్రను తిరిగి మెల్లిగా అందు కొంటుంది.)

గో పి క :

ఇదేనోయీ, అమృత కలశం!
ఇదే నోయ్, జీవన రహస్యం!
తీపి, చేదు, వగరు, పులుపు
రూప మందిన విశేషం!

విడి విడిగ ఒక్కొక్క రుచి కే
ర్పడదు సంపూర్ణత్వము;
అన్ని రుచుల సమైక్య మియ్యది,
ఆంధ్ర కిది ప్రత్యేకము!

బ్రతుకు భాండము నిండ నవరస
పాకములు నింపిన దిదే నోయ్
కష్ట సుఖముల నిగ్గు, తెలుగు ఉ
గాది పచ్చిడి ఇదే నోయ్!

వసంతుడు :

బలే దానవే! బలే జాణవే!
తెలుంగు వాసిని నిల్పితివే!
ప్రపంచ రుచికే అధినాథుడ నను
పచ్చడి గిన్నెను పట్టితివే!

మహీ మాధురీ! మధుర ఝురీ! మ
న్మనో హరీ! ఆంధ్రీ!

ఉగాది పచ్చడి నిగారములలో
జగజ్జీవమే గుభాళించెనే!
ఏ రుచి కందని వసంతునే నీ
పారాణికి పహరా పెట్టితివే!

జను స్సుందరీ! జగా జహ్వారీ!
జనతా మాధురి! ఆంధ్రీ!

(ఆమె ముందు, అతడు వెనుక నాట్యం చేసుకొంటూ నిష్క్రమి
స్తారు. ప్రకృతి అంతా సుందరతరంగా వికసిస్తుంది.)

43. పూర్ణ మధు పూర్ణిమ

చాంద్రమాన కాలీను లందరికీ
చైత్ర మాసాది ఉగాది,
వసం తానం దాసక్తు లందరికీ
ఫాల్గుణ కామపూర్ణిమ ఉగాది.

2

రాధాపూర్ణిమ, మాధవ పూర్ణిమ
వ్యాసపూర్ణిమ, బుద్ధపూర్ణిమ
ఈ అన్ని పూర్ణిమలూ కలిసి
ఒకే ఒక పూర్ణమధు పూర్ణిమ నాకు,
అది నీవే వైశాఖివి!
పూర్ణసౌందర్య మధుశాఖవి!

3

ఫాల్గుణీ చైత్రీ సుందర చాంద్రీ శోభ లన్నీ
ఈ ఉగాది పర్వోత్సవ మాధుర్యా లన్నీ
నేను సేకరించేవీ, నిల్వ చేసుకునేవీ,

మానవుణ్ణి ముందుకు నడిపించే శక్తు లన్నీ
క్షణక్షణం నిన్ను రాధాపూర్ణిమగా
ఆరాధించడం కోసం!
వ్యాసపూర్ణిమగా తలదాల్చడం కోసం!

4

అహం బ్రహ్మాస్మి నా సిద్ధాంతం
ఆత్మవత్ సర్వభూతాని నా జీవితం
అన్నం, సున్నం ఒకే బ్రహ్మ పదార్థం అయినా
అన్నమే తినడం నా స్వభావం
ఉల్లిపువ్వు, మల్లిపువ్వు ఒక తోటలోవే అయినా
మల్లెపూలనే నీ జడలో ముడవడం నా ఆనందం.

5

ఆకలి, నిరాశ, రోగం, వైకల్యం, దోపిడి, దుఃఖం
ఈ పీడా షడ్వర్గం పరమ విరోధులు నాకు,
నా పోరాటం అంతా వీటి నిర్మూలన కొరకే,
నేను సుఖాసక్తుణ్ణి, సౌందర్యోపాసకుణ్ణి, రసలోలుణ్ణి,
ప్రకృతి కళాకాంతులతోనే నా సాంగత్యం,
నిజ సౌందర్యం స్థానంలోకి నెగిటివ్‌ను చేరనివ్వను!

6

నేను మట్టిలో కలిసిపోతే, నీ కోసం-
మందార పుష్పంగా వికసిస్తాను,
వసంత కోకిలనై పాడతాను,
గంధవహుణ్ణై విహరిస్తాను,
పూర్ణేందు శేఖరుణ్ణై నృత్యం చేస్తాను!
నేను చచ్చినా శృంగార పురుషమూర్తినే!
సౌందర్య కళాకిరణ పుంజాన్నే!

44. కాంపౌం డేదైతే నేం

కోకిల కూస్తున్నది, ఎక్కడి నుంచో!
అది కూత కాదు, పాట!
కొందరికి కూత, కొందరికి పాట,
కొందరికి విశ్వైక ప్రేమగీత
వాళ్ళవాళ్ళ సంస్కారాన్నిబట్టి.
పోనీ, కాని —
అదెక్కడి నుంచి పాడుతున్నట్టు?
చర్చి కాంపౌండు నుంచా?
మసీదు కాంపౌండు నుంచా?
శివాలయం కాంపౌండు నుంచా?

ఏ కాంపౌండు నుంచి అయితేనేం?
అన్నిటా వున్నై ఉద్యాన వనాలే,
ఎక్కడి నుంచి పాడినా కోకిల కోకిలే!
అది ఏ మతానికీ అనుయాయి కాదు,
ఏ గుడికీ పూజారి కాదు.

చంద్రుడు వెన్నెల కాస్తున్న దే కాంపౌండులో?
చల్లగాలి వీస్తున్న దే కాంపౌండు నుంచి ?
కాంపౌండ్లకు అతీతమైన కళాకాంతులలో
వసంతం ఒకటి, కోకిల వసంతప్రియ!

జీవాధారాలూ, జీవ నావశ్యకాలూ
జీవిత సుఖ సంతోషాలూ, అన్నీ
ఏ కాంపౌండుకో పరిమితమైనట్టివి కావు,
అందరినీ సమానంగా ముంచెత్తే పరమాత్మీయాలు,
కాంపౌండ్లు ఆత్మరక్షక దుర్గాలు మాత్రమే,
పైనుంచి వచ్చే గాలీ వెలుతురూ వీటికి లేవు.

ఆకులు రాల్చేసి మోడైన
ఆ శిశిర వృక్షాన్ని చూడు !
సర్వసంగపరిత్యాగి వేమనలా లేదూ అది?
ఆయన పద్యాలే కోకిల పాట లేమో?
అందుకే మోడునుంచి కొత్తమొగ్గలు తలలెత్తుతున్నై
పాటలకు శ్రుతులై ప్రతిస్పందిస్తూ!

కోకిల వసంతప్రియ,
వసంతం నవనవాభ్యుదయ వికసనప్రియ,
అది ఏ దివ్యక్షేత్రం నుంచి అవతరిస్తున్నదో
ఏఏ రసరాగమాధుర్యాలను తెస్తున్నదో
అందుకో అంజలి పట్టి !

కాంపౌండులకు కట్టుపడుండేవి పెంపుడు జంతువులు,
కొట్టాలు, కట్టుకొయ్యలు, దాణాలూ, వాటికోసం,
కోకిల దివ్యకళాజీవనమేధోధార,
పరబ్రహ్మగా ఆత్మను కరిగించే నాదబ్రహ్మ !

45. మానవ - నవోదయం

ప్రయోక్త : జగన్నాటక సూత్రధారి
కవి : మానవ ప్రగతి దర్శకుడు
అమరాత్మ : మానవ స్వాతంత్ర్యం కోసం పోరాడి, వీర మరణం పొందిన స్వాతంత్ర్య సమర యోధుని ఆత్మ
ధర్మసేన : అనేక మంది సమరయోధుల ఆత్మల బృందం
ప్రకృతిమాత: కనిపించే ప్రకృతి కంతటికీ తల్లి అయి, కనిపించని శక్తి
ఉష : అయోమ యాంధకారంలో అభినవ ఆశారేఖ

ప్రయోక్త

కవి ఆవేదన పడతాడు
ఆ ఆవేదన నుంచి
అభ్యుదయం అవతరిస్తుంది
అనాది నుంచి
మానవ ప్రగతిలోని మలుపులను
అభ్యుదయ ప్రకరణాలను
పరిశీలించి చూస్తే
మానవ సమాజపు జీవనాడుల నిండా
అవినీతి అంధకారం క్రమ్ముకొన్నప్పు డెల్లా
గుండెలు పగుల్చుకొనేవాడు కవే
యువతరాన్ని హెచ్చరించేవాడు కవే,
నర సమాజపు నవనాగరికతకు
కవే మార్గ దర్శకుడు,

నాగరికతా సమ్యక్ సంచిత ధర్మనిధులకు
కవే రక్షక భటుడు, ధర్మకర్త.

కవి

అమ్మా, నవోష్యా?
ఒరే నవ నవోదయం?
(ఎవరూ పలకరు) !

ప్రయోక్త

ఆతడే కవి
అర్ధరాత్రే అరుణోదయాన్ని పిల్చేవాడు
మధ్యాహ్నం కూడ మేలుకొల్పులు పాడేవాడు
కవి కాక మరొక డెలా అవుతాడు?

కవి

ఎవ రతడు?
మానవుణ్ని దానవుణ్ణిగా మార్చి
అష్టకష్టాలకూ ఆలవాలం చేసి
మానవాత్మనే హతమారుస్తూ
విజృంభించిన వికటాంధకారంలో
ఊపిరాడక ఉషస్సు కోసం
ఆక్రోశించే నన్ను గురించి
ఏమిటో అంటున్న అత డెవరు?

ప్రయోక్త

నేను, కవీ, నేను
కాల నేత్రాన్ని

కాల కంఠాన్ని
జగన్నాటక ప్రయోక్తను,
నీ ఊహకు రూప కల్పనను,
నీ మాటకు స్వరకల్పనను
నిన్ను నే నేమీ అన లేదు
వాస్తవం ప్రవచించాను.

కవి

అయితే, స్వామీ
ఇప్పు డర్ధరాత్రి దాటిన తర్వాత
అరుణోదయ మెంత దూరం?

అమరాత్మ

అవును కవీ అవును
అర్ధరాత్రి దాటిన తర్వాత
అరుణోదయం సన్నిహితమే,
అరుణోదయ కర్తవ్యాల కోసం
అర్ధరాత్రినుంచే సిద్ధ పడవలసి వుంది.
అరుణోదయమై
అరవిందాలు వికసించినా
కన్ను తెరవని జడుల కోసం
మధ్యాహ్నం వరకూ కూడ
మేలు కొల్పులు పాడవలసే వుంది.

కవి

మీ రెవరు, మహాశయా ?
మానవ నవోదయ దీక్షా ప్రాంగణంలోనే

మనుగడ అస్తమించి పోయినా
ఏ దేశ భక్తి మహాత్మవో అన్నట్టు
ఏ యువ భారత శక్త్యాత్మవో అన్నట్టు
ధ్వనిస్తున్నది నీ వీరామర వాణి
జ్వలిస్తున్నది నీ లోకానుభవ ధోరణి!

అమరాత్మ

వద్దు కవీ వద్దు
అంతటి గొప్ప గొప్ప పేర్లు నాకు వద్దు,
స్వాతంత్ర్యోద్యమ మహాయజ్ఞాగ్ని లో
నే నొక తొలి సమిధను మాత్రం,
స్వరాజ్య సౌధ మహానిర్మాణంలో
నేనొక పునాది రాయి మాత్రం.
ప్రజాభ్యుదయ మహా క్షేత్ర విస్తరణలో
నే నొక నారు మొక్కను మాత్రం.
ఏ తొలి సమిధా
యజ్ఞపురుషుని పూర్ణసాక్షాత్కారాన్ని చూడ గోరదు
ఏ పునాది రాయీ
మహా సౌధ శిఖర శిల్పం కావాలని ఆశించదు
ఏ చెట్టు వేరూ దాని పుష్పఫల సౌభాగ్యం గా
మన్నన లందా లను కోదు, కాని—

ప్రయోక్త

చావో, స్వాతంత్ర్యామో అన్న
క్విట్ ఇండియా మహా విప్లవంలో

బలవంతుడే రాజన్న
పశు బలం తుపాకి గుండుకు
గుండె పగిలి చచ్చిపోయిన
ఒక యువ వాలంటీ రతడు!

ధర్మసేన

అతడొక్కడే కాదు
అసంఖ్యాకంగా వున్నా రిక్కడ
ప్రజల కోసం ప్రాణా లర్పించిన
తరతరాల తరుణ యోధులు
యుగ యుగాల యువ వీరులు
ఈ మహాంధకారం నిండా
ఏ మహోదయం కోసమో ఎదురు చూస్తూ!
కాని—

అమరాత్మ

కాని—
ఏదీ ఆ మహాయజ్ఞ ఫలం ?
ఏదీ ఆ మహాసౌధ శ్రీ
ఏదీ ఆ మహావృక్షచ్ఛాయ ?

ధర్మసేన

యజ్ఞఫలం కుక్కల పాలు
సౌధశ్రీ పిశాచాల పాలు
వృక్షచ్ఛాయ కొండశిలవల పాలు
ఏ ప్రజల సంక్షేమం కోసం

ఏ ప్రజల సుఖశాంతుల కోసం
త్యాగధనులు ప్రాణా లర్పిస్తున్నారో
ఆ ప్రజ లంతా ఏరి?

ప్ర యో క్త

ప్రజల కింకా నవోదయం కాలేదు
కవి పిలుపు ఉషస్సుకుకూడ అందటంలేదు

(శోకరుద్ధమైన కంఠంతో ఒక స్త్రీ వెర్రిగా నవ్వుతున్న ధ్వని)

క వి

నీ వెవరు తల్లీ?
కష్ట నష్టా లన్నింటినీ
కడుపులోనే దాచుకొని
కమ్మని శాంతి సుఖాలను
కన్నబిడ్డల కర్పించే
ధరా మతల్లిలా ఎవరు తల్లీ నీవు?

ప్ర కృ తి మా త

నేనా కవీ?
నేను ప్రకృతి మాతను
స్వేచ్ఛ కోసం, స్వాతంత్ర్యం కోసం
సర్వ జన సౌఖ్యం కోసం
సమతా ధర్మ సంస్థాపన కోసం
మానవుడే మాధవుడు కావాలనీ
మహిమీదే స్వర్గం నెలకొనాలనీ,
ఆశించి, ఆలపటించి, అందుకోసం
విద్రోహ శత్రులతో పోరాడి

వీర మరణం పొందిన
తరతరాల వీరయోధుల
ఆరని ఆదర్శాలకు ఆశ్రయాన్ని
తీరని కోరికలకు తీర్థాన్ని.

ధ ర్మ సే న

ఆమె మా అమ్మ;
నవమాసాలు కాదు
నవకోటి మాసాలకైనా
విముక్తి లభించని మా క్షుభితాత్మలను
వెలుగు కనిపించని మా చిరలక్ష్యాలను
తన అణువణునా ధరించి
నవోదయం కోసం
వొళ్ళంతా కళ్లు చేసుకొని
నిరీక్షిస్తున్న మా అమ్మ;
మనిషి చచ్చినా మనసు చావని అవస్థకు
వ్యవస్థ అయిన అమ్మ.

(అయోమయ స్థితిని తెలిపే అవ్యక్త కంఠస్వరాలు - సభలో గదరగోళంలాంటి ధ్వనులు)

ప్ర యో క్త

కవికి అయోమయంగా వుంది;
ఉషస్సు కోసం విసిరిన తన పిలుపు
మధ్యలో తేనె తుట్టెకు రాయిలా
అతృప్త నిస్పృహ వీరాత్మల పుట్టకు తగిలి
ఆ నివురుకప్పిన నిప్పులు రేగి

చేలరేగి చుట్టుముట్టినై ;
కవి సతమతమై పోతున్నాడు.
తన చుట్టూ తన నిండా
అన్ని ప్రక్కలా విశ్వవ్యాప్తంగా
అవే కంఠధ్వనులు!
అవే ఆశా నిరీక్షలు!
ఏనాటి నుంచో
ఇహ పరాలను ఏకం చేసి
ఏ స్వర్గమో నిర్మించాలన్న
ఎందరో మహర్షుల, ప్రవక్తల, మహాత్ముల
నిత్య నిరంతర కృషి-
ఈ నాటికీ ఫలించ లేదన్న
నిరాశా నిస్పృహల మూకుమ్మడి ధాటికి
ఈయన ఎలా తట్టుకుంటాడో, పాపం!

కవి

ఎందుకయ్యా పాపం ?
పాపం అనవద్దు ఏ కవిని గురించీ;
సానుభూతిని సహించలేడు కవి
సహించేవాడు కవి కాదు.
ఏ మహాశయ సాధన కోసం
మీరంతా ప్రాణ త్యాగం చేశారో
ఆ మహాశయం ఇంకా సిద్ధించక
వాపోతున్న అమర జీవాత్మలారా!
ఒక్కసారి నాకు
మీ అపరోక్ష దర్శనం దయచెయ్యండి :
(భయంకరమైన నిశ్శబ్దం)

ప్రకృతి మాత

కవీ ఏమిటి నీ ఉద్దేశం ?
మహోదయం పేరుతో
మహాప్రళయమే కల్పించ దలిచావా ఏమిటి ?
వెలుగులో కళ్లు మూసుకొన్నా
కారు చీకటిలో కళ్లు తెరిచినా
ఒకటే నయ్యా కవీ !
ప్రజా సంక్షేమం కోరి, పోరి
ప్రాణాలర్పించిన అమరవీరుల ఆకాంక్షల
అ పరోక్ష దర్శనం కదూ కోరావు ?
అదిగో అలా చూడు!

(ఇక్కడ పేర్కొనబడే దృశ్యాలకు అనుగుణంగా రకరకాల ధ్వనులు ప్రవర్తిస్తై)

ప్రయోక్త

ఎండలు మండి పోతున్నై
మేఘాలు సమ్మె చేస్తున్నై
సరోవరాలు ఎండి పోతున్నై
జన పదాలు దగ్ధ మవుతున్నై!
ఓహో!
ఆ రంకాల కాల నాటకశాలకు
నిప్పంటుకొన్నది!
జ్వాలలు, రక్త జ్వాలలు !

ప్రకృతి మాత

ఆ మండి పోతున్నవి ఎండలు కాదు, ధరలు
ఆ సమ్మెకడుతున్నవి మేఘాలు కాదు, మేధావులు

ఆ ఎండిపోతున్నవి సరోవరాలు కాదు
ప్రజల ప్రాణావసరాలు
ఆ తగలబడుతున్నవి జన పదాలు కాదు
జనా నీకపు బతుకు తెరువులు
నిప్పంటుకొన్నది కాలానికి కాదు
మానవుడి భవిష్యత్తుకు
అవి జ్వాలలు కాదు
అమర జీవాత్మల నిరాశానిస్పృహలు!
అయ్యో అది మృత్యు ధూళి పొగ కాదు
బ్రతికున్న వాళ్ళపై చచ్చిన వాళ్ళ పగ!
కవీ, మానవుడు!
మానవు డాత్మ హత్య చేసుకొంటున్నాడు!

అమరాత్మ

ఆత్మంభర, కుంక్షింభర పదవీలోలుడై
తోటివాణ్ని మోసం చేసైనా
కోటికి పడగెత్తాలన్న దురాశకు దాసుడై
లంచానికి కంచానికి లొంగిపోయి
ధర్మాన్ని హత్యచేసే విశ్వాస ఘాతకుడై
శ్రమ శక్తిని దాచుకునే చోరుడై
సమభుక్తిని నిరాకరించే క్రూరుడై
మానవుడు మైమరచి
తనను తానే తినేసుకొంటున్నాడు!
భ్రాంతిలో పడ్డాడు
అది రజ్జుసర్పభ్రాంతి కాదు
సర్పరజ్జు భ్రాంతి!

(అమరసేన అట్టహాసం చేసిన ధ్వనులు)

కవి

అమ్మా, నవోష్యా!

(ప్రకృతి పగిలేటంత గంద్రగోళం, అరుపులు, అట్టహాసాలు)

కవి

అమ్మా, నవోష్యా!

ఉష

ఎవరదీ?
కవి గొంతులా ఉంది!

కవి

అవును, నేనే

ఉష

అప్పుడే లేచావా, కవీ?

కవి

అప్పుడే లేవడమా?
నేను పడుకొన్న దెప్పుడు?
ఎంతో కాలంగా
నిజమైన నవోదయం కోసం
సర్వ జన శ్రేయస్సుందరమైన
మానవ మహోదయం కోసం
కంటిపై రెప్పలేకుండా
ఒళ్లంతా కళ్లుచేసుకొని

ఎదురు చూస్తున్నాను, ఉషా!
గొంతుకలోనే గూడు కట్టుకొని
కంఠాన్నే కల కంఠంగా కూర్చుకొని
ప్రతి నవోదయాన్నీ పిలుస్తున్నాను!
ఎన్నో ఉషస్సులు వచ్చిపోతున్నై
ఎన్నో నవోదయాలు పుట్టి గిడుతున్నై
ఎందరో దేశభక్తులు, ప్రవక్తలు
మహాత్ములు త్యాగాలు చేస్తున్నారు
ఎన్నో పథకాలు, ప్రాజెక్టులు తయారవుతున్నై
కోటానుకోట్ల ధనం యజించబడుతోంది
కాని — ఇంతవరకూ
నే నూహించిన ఆ నవ్యోషకు
నా గొంతు వినిపించలేదు,
నే నాశించిన ఆ నవ నవోదయానికి
మానవత సిద్ధించలేదు!
వింటున్నావుగా
యుగ యుగాల నుంచి
మానవ నవోదయం కోసం ఆహుతై
ఎదురుచూస్తున్న అమరాత్మల
ఆవేదనలు, అలజడులు?
ఇంకెంతకాలం ప్రకృతి మాత కడుపుకోత?
ఇంకెంతకాలం ఈ పెరిగిపోతున్న సాధు హత్య?

ఉ ష

కవీ, ఓ కవీ!
ఇంకెంతోకాలం అక్కరలేదయ్యా!

నేను భావిస్తున్న నవమానవ నవోదయం
నీవు ఊహిస్తున్న శ్రేయోరాజ్య నిర్మాణం
నీవు సంకల్పిస్తున్న సమధర్మ సమాజం
దగ్గరలోనే ఉందయ్యా!
భారతాత్మను మేల్కొల్పుతున్నాను
విశ్వాత్మను తోడి తెస్తున్నాను.
నీ పిలుపు వినబడుతున్నది
నీ కృషి ఫలిస్తున్నది
నీ వసుధైక కుటుంబ నవ్యోష
రూపం దిద్దుకొంటున్నది !
అదిగో, అమరాత్మ
ఆనంద రాగోదయంతో!
ఇదిగో, ధర్మసేన
ప్రకృతి మాత ప్రభాత వదనంతో!
మేమంతా నీవాళ్ళం
నీ మహోద్యమ ప్రవర్తకులం
లేవయ్యా, కవీ, లే!
లేచి, నమస్కరించు నవ నవోదయానికి!

(అమరాత్మ, ధర్మసేన అందరి కంఠాలతో)

ప్రయోక్త

జయోస్తు ఉషాదేవీ జయోస్తు!
విజయోస్తు మహాకవీ విజయోస్తు !
ధన్యం మానవ జాతి!
ధన్యం జీవ జగత్తు!
(ఆకాశవాణిలో ప్రసార మైనట్టిది)

భీమన్న కృతులు

ముద్రితాలు

1. దీప సభ	పద్య కావ్యం
2. మధు బాల	గీత కావ్యం
3. రాగోదయం	గేయ సంపుటి
4. భీమన్న కావ్య కుసుమాలు	లఘుకృతుల సంపుటి
5. పాలేరు	నాటకం
6. కూలి రాజు	నాటకం
7. రాగ వాసిష్ఠం	నాటకం
8. అసూయ	నాటిక
9. పడిపోతున్న అడ్డుగోడలు	నాటిక
10. మధు గీత	ముక్తకాల సంపుటి
11. పైరు పాట	గేయ నాటిక
12. మానవుని మరొక మజిలీ	గేయ నాటకం
13. బాల యోగి	నాటకం
14. అనాది కొసనుంచి అనంతత్వంలోకి	వచన కవితల సంపుటి
15. త్రిపదలు	ముక్తకాల సంపుటి
16. సెవెంత్ సీజన్	ఆంగ్ల కవితల సంపుటి
17. చిత్ర కళా ప్రదర్శన	పది నాటికల సంపుటి
18. జానపదుని జాబులు	లేఖా సంపుటి
19. ప్రకృతిలో మానవ ప్రకృతి	కావ్యసంపుటి
20. రాగవైశాఖి	లేఖా కావ్యం (వచనం)
21. అకాండ తాండవం	నృత్య గేయ కావ్యం
22. పిల్లి శతకం	వ్యంగ్య రచన

23. రాజకీయ వీరుడు-డాక్టరు ఖాను *జీవిత చరిత్ర*
24. ధర్మం కోసం పోరాటం *సాంఘిక, రాజకీయ సిద్ధాంత గ్రంథం*
25. ఏక పద్యో పాఖ్యానం-సవ్యాఖ్యానం *వ్యంగ్య రచన*
26. అశోక వనిలో రాముడు *పద్య కావ్యం*
27. రాఖీలు *గేయాల సంపుటి (352)*
28. ఆదికవి వాల్మీకి *నాటకం*
29. మణి మానసం *పద్య కావ్యం*
30. గుడిసెలు కాలిపోతున్నై *గద్య కవితల సంపుటి*
31. కేదారీశ్వరి *తెలుగు నేల పాటలు*
32. బొమ్మ *గేయ కావ్యం*
33. ప్రగతి *నాటకం*
34. జన్మాంతర వైరం *కర్మ సిద్ధాంత కావ్యం*
35. శివాలకలు *సాంస్కృతిక విప్లవ కవితల సంపుటి*
36. రాధతో ఎగ్గిబిషనుకు
37. ఓయి ! కవీ ! కవిత్వం రాయి !
38. భీమన్న ఉగాదులు *ఉగాది కవితల సంపుటి*

పాలేరు నుంచి పద్మశ్రీ వరకు బోయి భీమన్న
(రచన- హైమవతి)

భీమన్న సాహితీ షష్టిపూర్తి సంచిక
(సంపాదకుడు : గనుమల జ్ఞానేశ్వర్)

అముద్రితాలు

1. గోరువంకలు (నఖక్షతాలు) *రాజకీయ సాంఘిక వ్యంగ్య-విమర్శల మినీ కవితలు*
2. అతికిన ముక్కలు *గేయ పద్య కావ్యం*
3. సినీ మనీ-మనీ సినీ *గేయ నాటికలు*
4. వేద వ్యాసుడు *నాటకం*
5. ధర్మ వ్యాధుడు *నాటకం*
6. క్షీర సాగరం *నవల (మొదలైనవి)*